






fb/prajasakti, www.prajasakti.com

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 7 | విజయవాడ, ఆదివారం 7 జనవరి 2018 | 12 + 12 పేజీలు వెల : 5.00



లాలూకు మూడున్నరేళ్ళు జైలు 8

సాయం సగమే

మహిళా పొదుపు బృందాలకు అందని రుణాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

డ్వాక్రా సంఘాలకు పెద్ద ఎత్తున రుణాలు ఇస్తున్నట్టు ప్రభుత్వం చెబుతున్న మాటలకు ఆచరణకు పొంతనలేని పరిస్థితి నెలకొంది. ప్రస్తుత ఆర్థికసంవత్సరం దాదాపు ముగింపునకు వస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన లక్ష్యం అందుకోవడం ప్రశ్నార్థకంగా మారింది. నిర్దేశిత లక్ష్యంలో ఇప్పటివరకు దాదాపు సగం మాత్రమే రుణ పంపిణీ జరగడమే దీనికి కారణం. చివరి మూడు నెలల్లో పూర్తిస్థాయిలో రుణాలు ఇస్తామని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నప్పటికీ, దానిని సాధించడంపై అధికారవర్గాలలోనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారిక సమాచారం ప్రకారం ఇప్పటివరకు 1,97,635 గ్రూపులకు మాత్రమే రుణ పంపిణీ చేశారు. ఇంకా 2,57,687 గ్రూపులకు మిగతా 9లో

త్వరలో రెండో దశ విద్యుత్ సంస్కరణలు

- అయినా ఛార్జీలు పెరగవు
- ఆందోళన వద్దు
- నెల్లూరు జన్మభూమిలో సిఎం చంద్రబాబు



నెల్లూరు జిల్లా కోడూరుపాడులో నిర్వహించిన జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో పొదుపు మహిళలకు చెక్కు అందజేస్తున్న సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి- నెల్లూరు సిటీ ప్రతినిధి

త్వరలో రెండోదశ విద్యుత్ సంస్కరణలను చేపట్టనున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. నెల్లూరు జిల్లా కోడూరుపాడులో శనివారం జరిగిన జన్మబూమి-మాఊరు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ రంగంలో రాష్ట్రం గణనీయమైన అభివృద్ధి సాధించినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలోనే సాధ్యమైనంత త్వరలో రాష్ట్రంలో రెండవ దశ విద్యుత్ సంస్కరణలను అమలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. సంస్కరణలు అమలు చేసినా ఛార్జీలు పెరగవని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి చెప్పారు. 2014లో అధికారంలోకి వచ్చినపుడు రాష్ట్రంలో 22.5 మిలియన్ల యూనిట్ల కరెంటు కొరత ఉందని, రెండు నెలల్లో తన అనుభవం ద్వారా దీనిని అధిగమించామని తెలిపారు. మూడేళ్లలో 8,900 మెగా వాట్ల కరెంటును అదనంగా ఉత్పత్తి చేశామని తెలిపారు.ఎండ, గాలితో తయారు చేసే కరెంటు స్టోరేజీ చేసుకుని తిరిగి వినియోగించే నూతన విధానం అమల్లోకి తెచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. విద్యారంగం గురించి మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యార్థులు మట్టిలో మాణిక్యాలని, వారిని సరిగా మలిస్తే ప్రపంచాన్ని జయించే శక్తి వారికి ఉందని కొనియాడారు. పరిశ్రమలు రావాలన్నా, మిగతా 9లో

దుర్గ గుడి ఈవోపై వేటు

పూర్తి స్థాయి విచారణకు సిఎం ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దుర్గ గుడి ఈవో సూర్య కుమారిపై ఎట్టకేలకు వేటు పడింది. దుర్గ గుడిలో తాంత్రిక పూజల ఘటనపై విచారణ చేపట్టిన విచారణ కమిటీ తమ నివేదికను శనివారం సమర్పించింది. ఆలయానికి సంబంధం లేని వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించకుండా నిరోధించడంలో ఈవో విఫలమయ్యారని నివేదికలో పేర్కొనడంతో ఆమెను బదిలీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దేవాదాయ శాఖ కమిషనర్ అనురాధకి ఇన్‌ఛార్జిగా బాధ్యతలు అప్పగించింది. నివేదికపై శనివారం దేవాదాయ శాఖ మంత్రి మాణిక్యాలరావు, విజయవాడ నగర పోలీస్ కమిషనర్ గౌతం సవాంగ్ భేటీ అయ్యారు. వాస్తవాలను సిఎంకు వివరించారు. భేటీ అనంతరం మంత్రి మాణిక్యాలరావు మాట్లాడుతూ దుర్గగుడిలో ఆలయ నియమాలకు మిగతా 9లో

సూరంపల్లి ఐరన్ కంపెనీలో ప్రమాదం

కరుగుతున్న ఐరన్ ద్రావణం పడి ఇద్దరు కార్మికులు మృతి

ఏడుగురికి తీవ్ర గాయాలు 2

సైన్స్‌పై పాలకుల నిర్లక్ష్యం

- రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో సిసిఎంబి మాజీ డైరెక్టర్ మోహన్‌రావు

9



చారిత్రక ఆధారాలే భావితరాలకు పునాది

- 42వ ఏపి హిస్టరీ కాంగ్రెస్ సమావేశాల్లో వాణి మోహన్

2

విశాఖ స్టీల్స్‌లో షేర్ల విక్రయం

దేశద్రోహం : సిఐటియు

ప్రజాశక్తి- డాబాగార్డెన్స్, విశాఖ

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను 10శాతం షేర్లు అమ్మకానికి సిద్ధపడుతోందని, ఈ దేశద్రోహ నిర్ణయానికి వ్యతిరేకంగా కార్మికవర్గంతో పాటు ప్రజలు ఉద్యమంలో భాగస్వాములు కావాలని సిఐటియు ఆలిండియా అధ్యక్షులు హేమలత,రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నరసింగరావు పిలుపునిచ్చారు. హేమలత మాట్లాడుతూ... డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డిసిఐ)ను ప్రైవేటీకరించాలన్న ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించాలని కోరారు. విశాఖ నగరంలోని సీహార్స్ కూడలిలో ఉద్యోగులు చేస్తున్న రిలే దీక్షా శిబిరం శనివారంతో ముగిసింది. డిసిఐ ప్రయివేటీకరించాలన్న ప్రభుత్వ నిర్ణయంపై మిగతా 9లో

పాలేకర్ వ్యాఖ్యలపై ఆగ్రహం

- శాస్త్రవేత్తల నిరసన
- స్పీకర్ కోడెల సైతం అభ్యంతరం
- ఇరుకున పడ్డ సర్కారు

9

గవర్నర్‌ను కలిసిన ఎసిబి డిజి ఠాకూర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అవినీతి నిరోధక శాఖ డిజి ఆర్పీ ఠాకూర్ రెండు తెలుగు రాష్ట్రాల ఉమ్మడి గవర్నర్ ఈఎల్ఎన్ నరసింహన్‌ను హైదరాబాద్‌లో శనివారం కలిసారు. పుష్పగుచ్ఛం ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పరిస్థితులపై వీరి మధ్య చర్చ సాగినట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ఎసిబి కార్యాలయ భవనాల నిర్మాణంతో పాటు అవినీతి నిరోధక కేసుల వివరాలు, ఆయా కేసుల పురోగతి, అక్రమార్కుల ఆస్తులను ప్రభుత్వపరం చేసేందుకు కొత్త చట్టం చేసే ప్రక్రియతో పాటు పలు అంశాలను ఠాకూర్ ఈ సందర్భంగా గవర్నర్‌కు వివరించినట్లు సమాచారం.

■ మైనార్టీ సబ్‌ప్లాన్

చిత్తూరు జిల్లా కల్లూరులో శనివారం జరిగిన మైనార్టీ సంక్షేమ ఆత్మీయ సభలో మాట్లాడుతున్న జగన్మోహన్‌రెడ్డి



మైనార్టీల సంక్షేమానికి సబ్ ప్లాన్

వైసిపి అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - పులిచెర్ల

మైనార్టీల అభివృద్ధికి సబ్‌ప్లాన్ అమలు చేస్తానని వైసిపి అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి చెప్పారు. శనివారం పులిచెర్ల మండలంలో ప్రజా సంకల్పయాత్ర ప్రారంభమయ్యింది. శ్రీనివాసపురంలో ప్రారంభమైన పాదయాత్ర మతుకువారిపల్లి, చల్లావారిపల్లి, పాతపేట మీదుగా కల్లూరు చేరుకుంది. కల్లూరులో జరిగిన మైనార్టీ సంక్షేమ ఆత్మీయ సభలో ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి అండగా ఉంటానని చెప్పారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో మైనార్టీల అభివృద్ధికి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. తాము అధికారంలోకి వస్తే పేదలకు వైద్యానికి అయ్యే ఖర్చు వెయ్యి దాటితే ఆరోగ్యశ్రీ కార్డుకు వర్తించేలా చేస్తానని హామీ ఇచ్చారు. సభ ప్రాంగణంలో మెడిసిన్ విద్యార్థి నగ్మా మాట్లాడుతూ 'చదివిస్తారు సరే, ఉద్యోగాలు ఇస్తారా' అని ప్రశ్నించారు. ఉద్యోగాలు రావాలంటే తాను ముఖ్యమంత్రి అవ్వాలని, ముఖ్యంగా మన రాష్ట్రానికి ప్రత్యేక హోదా రావాలని, ప్రత్యేక హోదా వల్ల జిఎస్‌టి, ఇన్‌కంటాక్స్ కట్టాల్సిన అవసరం ఉండదని తెలిపారు. ప్రత్యేక హోదా వస్తే ఉద్యోగాల కోసం విప్లవాలు తీసుకొస్తానన్నారు. రాష్ట్రంలోని 1.42 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తానని చెప్పారు. అనంతరం చల్లావారిపల్లి, మతుకువారిపల్లి, పాతపేటలలో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట ఎంపి మిథున్‌రెడ్డి, పుంగనూరు ఎంఎల్‌ఏ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పీలేరు, మదనపల్లి ఎంఎల్‌ఏలు చింతల రామచంద్రారెడ్డి, దేశాయ్ తిప్పారెడ్డి పాల్గొన్నారు.

12న సిఎం ఢిల్లీకి...

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఈ నెల 12న ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ వెళ్లనున్నారు. 11తో 'జన్మభూమి - మా ఊరు' కార్యక్రమం ముగింపు అనంతరం సిఎం ప్రధాని మోడీతో భేటీ అవుతారు. ఇదే విషయం ప్రధాని మోడీ శుక్రవారం తనను కలిసిన టిడిపి ఎంపిలకూ స్పష్టం చేశారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పెండింగ్ అంశాలు, విభజన సమస్యలు, పోలవరం వంటి విషయాలపై సిఎం ప్రధానితో చర్చిస్తారని సమాచారం.

సూరంపల్లి ఐరన్ కంపెనీలో ప్రమాదం

కరుగుతున్న ఐరన్ ద్రావణం పడి ఇద్దరు కార్మికులు మృతి

ప్రజాశక్తి - గన్నవరం (కృష్ణాజిల్లా)

కృష్ణాజిల్లా గన్నవరం మండలం సూరంపల్లి సమీపంలోని ఓ ఐరన్ తయారీ కంపెనీలో శనివారం రాత్రి జరిగిన ఘోర ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతిచెందారు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. సూరంపల్లి పారిశ్రామికవాడకు సమీపంలో రోడ్డు పక్కనే విజయవాడకు చెందిన గంటా ప్రసాదరావు జిఎస్ అల్లాయ్ ఐరన్ కాస్టింగ్ కంపెనీ నడుపుతున్నారు. పాత ఐరన్‌ని కరిగించి ఓడల తయారీ, పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన రాడ్లు ఇందులో తయారు చేస్తారు. శనివారం సాయంత్రం ఇనుము కరగబెడుతున్న సమయంలో ట్యాంక్ నుంచి పెద్ద శబ్దం వచ్చి దానిపై ఉన్న మూత పైకి ఎగిరిపడింది. దీంతో ట్యాంకులో కరుగుతున్న ఇనుప ద్రావణం ఒక్కసారిగా లేచి పక్కనే ఉన్న కార్మికులపై పడింది. దీంతో వారి శరీరాలు కాలిపోయాయి. ఘటనలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన కార్మికుడు ముబారక్ ఆలీ(30) అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన ఎనిమిది మంది కార్మికులను విజయవాడ గొల్లపూడిలోని ఆంధ్రా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అమలాపురానికి చెందిన శివశంకర కుమార్(38) మృతి చెందాడు. గాయపడిన వారిలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన జబ్బార్, ఒడిషాకు చెందిన సత్యనారాయణ, రమేష్‌నాయక్, అమలాపురానికి చెందిన విబి.ప్రసాద్, ఉమాశంకర్ ఉన్నారు. జిల్లా కలెక్టర్ బి.లక్ష్మీకాంతం గొల్లపూడిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. ఎసిపి విజయ భాస్కర్ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం వివరాలు సేకరించారు. సిఐ శ్రీధర్‌కుమార్ కేసు నమోదు చేశారు.

మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు నష్టపరిహారం చెల్లించాలి
- సిపిఎం తూర్పు కృష్ణా కార్యదర్శి ఆర్.రఘు

ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని సిపిఎం తూర్పు కృష్ణా కార్యదర్శి ఆర్.రఘు, తూర్పు కృష్ణా కార్యదర్శివర్గ సభ్యులు వై.నరసింహారావు, గన్నవరం మండల కార్యదర్శి కళ్లం వెంకటేశ్వరరావు, సూరంపల్లి గ్రామ సర్పంచి దేవరపల్లి కోటేశ్వరరావు పరిశీలించారు. సూరంపల్లి కంపెనీలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.25 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. గాయపడిన కార్మికులకు నష్టపరిహారంతోపాటు పూర్తి స్థాయిలో చికిత్స అందించాలని కోరారు. ప్రమాదానికి కంపెనీ యాజమాన్యం బాధ్యత వహించాలన్నారు. సంబంధిత అధికారులతో చర్చించారు.



సంఘటన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సిపిఎం తూర్పు కృష్ణా కార్యదర్శి ఆర్.రఘు, నాయకులు వై.నరసింహారావు

తుది బడ్జెట్ మార్చి నెలాఖరుకే : యనమల



ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

రాష్ట్ర తుది బడ్జెట్ మార్చి మాసాంతానికే ప్రవేశపెడతామని రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలో రాష్ట్ర యువజన సర్వీసులశాఖ ఆధ్వర్యంలో శనివారం జరిగిన యువకెరటాలు-2018 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మచిలీపట్నంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యనమల మాట్లాడారు. సంక్రాంతి పండుగ తర్వాత మంత్రులు, ఆర్థిక నిపుణులు, కార్యదర్శులతో సమావేశాలు నిర్వహించి ముసాయిదా బడ్జెట్‌ను రూపొందిస్తామని యనమల వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశీలన తర్వాత తుది బడ్జెట్‌ను మార్చి నెలాఖరుకు ప్రవేశపెడతామన్నారు. జనవరి - డిసెంబరు కాలాన్ని పరిగణనలోకి తీసుకుని బడ్జెట్లు రూపొందించాలన్న ప్రతిపాదనలు వచ్చినప్పటికీ గత పద్ధతినే అవలంబించాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. బడ్జెట్‌లో మౌలిక సదుపాయాలకు తొలి ప్రాధాన్యత కల్పిస్తున్నామన్నారు. వ్యవసాయం కీలకమని చెబుతూ ఈ ఏడాది 29 ప్రాజెక్టులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకున్నామన్నారు. రాష్ట్రంలో పేదరికం కొనసాగుతోందని, ఆర్థిక, సామాజిక అసమానతలను రూపుమాపాల్సి ఉందని యనమల చెప్పారు.

ఆర్టీసి డ్రైవర్లకు 'ఫిసా' సీటు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డ్రైవర్ల కోసం ఆర్టీసి బస్సులో ప్రత్యేకమైన సీటును ఏర్పాటు చేసేందుకు ఎపిఎస్ ఆర్టీసి చర్యలు చేపట్టింది. ఆర్టీసి బస్సులకు ఈ సీట్ల కోసం హరిత కంపెనీని ఎపిఎస్ ఆర్టీసి ప్రత్యేక బృందం ఇటీవల సందర్శించింది. అందులో ఫిసా సంస్థ రూపొందించిన ప్రత్యేక సీటును ఆ బృందం ఎంపిక చేసింది. నూతనంగా ఏర్పాటు చేయనున్న ఈ సీటు వల్ల డ్రైవర్లకు వెన్నునొప్పులు, కీళ్లనొప్పుల వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉంటాయని హరిత కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు.



దక్షిణ కోస్తాలో జల్లులు!

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

దక్షిణ అండమాన్ సముద్రానికి ఆనుకుని ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడినట్లు భారత వాతావరణ శాఖ పేర్కొంది. దీనికి అనుబంధంగా 4.5 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని తెలిపింది. దీని ప్రభావంతో ఉత్తర దిశ, ఈశాన్యం నుంచి చలిగాలులు రాష్ట్రంపైకి వీస్తాయని హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొంది. రాగల మూడు రోజులు పొడి వాతావరణంతో చలి ప్రభావం చూపిస్తుందని, 10వ తేదీన దక్షిణ కోస్తాలో అక్కడక్కడా ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశముందని తెలిపింది.

ప్రజ్ఞ

1. మాలి నూతన ప్రధాని?
2. జమ్మూకాశ్మీర్ సరిహద్దులో బిఎస్ఎఫ్ నూతనంగా ప్రారంభించిన ఆపరేషన్?
3. బసవసాగర్ డ్యామ్ ఎక్కడ వుంది?
4. 2022 జాతీయ క్రీడలు ఎక్కడ జరగనున్నాయి?
5. ఇటీవల మృతి చెందిన వసంత్ శంకర్ దవ్‌ఖేరే ఏ రంగానికి చెందిన వారు?

సమాధానాలు 7లో

చారిత్రక ఆధారాలే

భావితరాలకు పునాది

- ఏపి పురావస్తు శాఖ కమిషనర్ వాణీమోహన్
- నరసాపురంలో 42వ ఎపి హిస్టరీ కాంగ్రెస్ సమావేశాలు ప్రారంభం

ప్రజాశక్తి-ఏలూరు ప్రతినిధి

చరిత్రకారులు అందించే ఆధారాలు, పరిశోధనలే భావితరాలకు పునాది, మార్గనిర్దేశమని ఏపి పురావస్తు, మ్యూజియం శాఖ కమిషనర్ జి.వాణీమోహన్ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం వైఎన్ కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ 42వ వార్షికోత్సవ సమావేశాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఎపి హిస్టరీ కాంగ్రెస్ జనరల్ అధ్యక్షులు ప్రొఫెసర్ యల్లాప్రగడ సుదర్శన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వాణీమోహన్ మాట్లాడారు. చరిత్ర నూతన తరానికి కొత్త ఉత్సాహం నింపుతుందన్నారు. చారిత్రక ఆధారాలను, పురావస్తు వివరాలను డిజిటలైజేషన్ చేస్తే భద్రంగా భావితరాలకు అందించవచ్చన్నారు. దీనిపై ప్రభుత్వంతో చర్చిస్తున్నామని తెలిపారు. విజయవాడలోని బాపు మ్యూజియంలో చరిత్రకు సంబంధించిన ఎన్నో అంశాలున్నాయన్నారు. పోలవరం సమీపంలోని రుద్రకోటలో నిర్వహిస్తున్న పురావస్తు తవ్వకాల్లో ముఖ్యమైన అంశాలు వెలుగు చూస్తున్నాయని చెప్పారు. గుంటూరు జిల్లాలోని ఉండవల్లి గుహలను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. పురావస్తు శాఖ నుంచి ఏపి హిస్టరీ కాంగ్రెస్‌కు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. విజయవాడ, ఏలూరులో నేషనల్ మ్యూజియం, పార్కుల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని పేర్కొన్నారు. పిల్లలకు చరిత్రపై అవగాహన ఉండాలని తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎపి హిస్టరీ కాంగ్రెస్ జనరల్ అధ్యక్షులు ప్రొఫెసర్ యల్లాప్రగడ సుదర్శన్ మాట్లాడుతూ.. ఎపి హిస్టరీ కాంగ్రెస్ ధ్యేయాలను వివరించారు. ప్రభుత్వ నిధులు తీసుకుంటే చరిత్రను వక్రీకరించాల్సి వస్తుందనే ఉద్దేశంతో తీసుకోకుండానే 42 ఏళ్లుగా సభలను నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఏపి హిస్టరీ కాంగ్రెస్ వ్యవస్థాపక అధ్యక్షులు రామకృష్ణ మాట్లాడుతూ.. సంస్థ ఆటుపోట్లను ఎదుర్కొంటోందన్నారు. సభల నిర్వహణకు సైతం నిధుల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. వైఎన్ కళాశాల కరస్పాండెంట్ చినమిల్లి సత్యనారాయణరావు మాట్లాడుతూ.. చరిత్రను తెలుసుకుంటేనే భవిష్యత్తును తీర్చిదిద్దుకోవచ్చునని చెప్పారు. ఈ సందర్భంగా గతేడాది చరిత్రకారులు సమర్పించిన నోట్సు అంతా కలిపి తయారు చేసిన 41వ సంపుటిని వాణీమోహన్ చేతులు మీదుగా ఆవిష్కరించారు. ఏపి హిస్టరీ కాంగ్రెస్ వెబ్‌సైట్‌ను ప్రొఫెసర్ సుదర్శనరావు ఆవిష్కరించారు. అనంతరం వాణీమోహన్‌ను ప్రతినిధులు సత్కరించి జ్ఞాపికను అందజేశారు. డచ్ భవనాన్ని చారిత్రాత్మక కట్టడంగా గుర్తించాలని కోరుతూ కమిషనర్‌కు కళాశాల నిర్వాహకులు చూపించారు. కార్యక్రమానికి ఏపి, తెలంగాణ, పాండిచ్చేరి, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల ప్రతినిధులు హాజరయ్యారు. సమావేశం అనంతరం సెషన్లు నిర్వహించారు. ఇందులో ప్రతినిధులు తమ పరిశోధనలను గురించి వివరించి పత్రాలను సమర్పించారు. కార్యక్రమంలో ఏపి హిస్టరీ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జి.వెంకట్రామయ్య, ప్రొఫెసర్ సోమశేఖరరావు, వైఎన్ కళాశాల వైస్ ప్రెసిడెంట్ జివికె రామారావు, కోశాధికారి ఎర్రమిల్లి గోపాలకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



41 ఏపి హిస్టరీ కాంగ్రెస్ సంపుటిని ఆవిష్కరిస్తున్న పురావస్తు శాఖ కమిషనర్ జి.వాణీమోహన్ తదితరులు

కాపు కార్పొరేషన్‌లో కుట్టుమిషన్ల గోల

నంద్యాల ఉప ఎన్నికల్లో మిషన్‌లు పంచేశారని ఆరోపణలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కాపు కార్పొరేషన్ అవకతవకలకు నిలయంగా మారుతోందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఎన్టీఆర్ విద్యోన్నతి పథకం ద్వారా పోటీ పరీక్షలకు ఇచ్చే శిక్షణలో అక్రమాలు చోటు చేసుకున్నాయనే అంశంపై విచారణ ముగింపునకు రాక ముందే కుట్టుమిషన్‌ల కొనుగోలు, పంపిణీల అంశంలో కూడా అవకతవకలు జరిగాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాపు కార్పొరేషన్ ద్వారా ఉపాధి కల్పనలో భాగంగా పేద కాపు వర్గానికి చెందిన స్త్రీలకు కుట్టులో ఉచిత శిక్షణ ఇవ్వడమే కాకుండా, శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కుట్టుమిషన్‌లు కూడా కార్పొరేషన్ నుంచే అందించాలని నిర్ణయించారు. అయితే వీరి కోసం గతంలో సుమారు మూడు వేల కుట్టు మిషన్‌లు కొనుగోలు చేసినట్టు సమాచారం. వీటిని ఆయా జిల్లాల్లో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి పంపిణీ చేయాల్సి ఉంది. కానీ వాటిని దారి మళ్లించి నంద్యాలకు తరలించినట్టు తెలిసింది. నంద్యాల ఉప ఎన్నికల్లో ఓటర్లను ఆకట్టుకునేందుకు ఈ కుట్టుమిషన్లను పంపిణీ చేసినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. కాపు వర్గాల్లో ఇది మింగుడు పడని అంశంగా మారింది. కాపు కార్పొరేషన్ ద్వారా కొనుగోలు చేసి ఎన్నికల్లో పంచడం ఎమిటని ప్రశ్నిస్తున్నారు.

రేపటి నుంచి విజయవాడలో సిపిఐ జాతీయ సమావేశాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిపిఐ జాతీయ సమావేశాలు ఈ నెల 8 నుంచి 10 వరకు విజయవాడలో నిర్వహించనున్నామని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ వెల్లడించారు. చివరి రోజు జింఖానాగ్రౌండ్స్‌లో బహిరంగసభ ఏర్పాటవుతుందన్నారు. విజయవాడ దాసరిభవన్ లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డారు. రాష్ట్రంలో, దేశంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులపై లోతుగా విశ్లేషించి ఈ సమావేశాల్లో ఒక నివేదికను రూపొందిస్తామని చెప్పారు. కేరళలోని కొల్లంలో ఏప్రిల్ 25 నుంచి జరిగే 23వ జాతీయ మహాసభల్లో ఈ నివేదికపై చర్చించి ఆమోదం తెలుపుతామన్నారు.

నేడు ఎఐటియుసి నూతన భవన ప్రారంభం

ఎఐటియుసి నూతన రాష్ట్ర కార్యాలయ భవనం ఆదివారం ప్రారంభం కానుందని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు చలసాని వెంకట రామారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యాలయ ప్రారంభ సందర్భంగా గొల్లపూడి వన్ సెంటర్ నుంచి బేలీఫ్స్ హోటల్ వద్ద నిర్మించిన నూతన భవనం వరకు భారీ ర్యాలీ జరగనుందని వెల్లడించారు. అనంతరం 11:30 గంటలకు బహిరంగ సభ ఉంటుందన్నారు.

సిపిఎస్ ఉద్యోగుల ఆందోళనలకు మద్దతు

కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ జెఎసి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సిపిఎస్) ఉద్యోగుల ఆందోళనలకు రాష్ట్రప్రభుత్వ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్, టీచర్స్ అండ్ వర్కర్స్ జెఎసి పూర్తి మద్దతు తెలిపింది. ఈ మేరకు జెఎసి చైర్మన్ ఎవి నాగేశ్వరరావు, సెక్రటరీ జనరల్ ఎం బాలకాశి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాత పెన్షన్ పునరుద్ధరించాలని కోరుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెన్షన్ సాధన సమితి ఆధ్వర్యంలో ఈ నెల 9న రాష్ట్రంలోని అన్ని పాత తాలూకా కేంద్రాల్లో జరిగే ధర్నాల్లో జిల్లాలోని కాంట్రాక్ట్ సంఘాలు పాల్గొని మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. ఈ ఆందోళనలకు సంఘటిత రూపం ఇస్తూ పెన్షన్ సాధన సమితి ఏర్పాడటాన్ని స్వాగతిస్తున్నారు. 1999లో అప్పటి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఉద్యోగులపై పెట్టే పెన్షన్ ఖర్చులు తగ్గిస్తామని ప్రపంచ బ్యాంకుతో ఒప్పందం చేసుకున్నారని గుర్తు చేశారు. కేరళలో 2013లో కాంగ్రెస్ ప్రభుత్వం సిపిఎస్ అమలు చేసిందని గుర్తు చేశారు. సిపిఎస్ రద్దు కోసం పోరాడేందుకు ఏర్పడిన పెన్షన్ సాధన సమితిని మరింత విస్తృత పర్చాలని, బ్యాంకు, ఇన్సూరెన్స్, రైల్వే, విఆర్‌ఓలు, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్,యూనివర్సిటీల తదితర రంగాల ఉద్యోగులను కూడా కలుపుకొని పాత పెన్షన్ పథకం సాధించాలని ఆకాంక్షించారు.

పోలవరాన్ని నాణ్యంగా నిర్మించాలి : రఘువీరా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలవరం ప్రాజెక్టును పూర్తి నాణ్యతతో నిర్మించాలని పిసిసి అధ్యక్షులు ఎన్ రఘువీరారెడ్డి డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పరం నిందలు వేసుకొంటూ ప్రాజెక్టు నిర్మాణాన్ని జాప్యం చేస్తున్నాయని మండిపడ్డారు. విజయవాడ కనకదుర్గమ్మను శనివారం ఆయన దర్శించుకున్న తర్వాత విలేకరుతో మాట్లాడారు. ఈనెల 7 నుంచి 10 వరకు ధవళేశ్వరం నుంచి పోలవరం ప్రాజెక్టు వరకు పిసిసి ఆధ్వర్యంలో మహా పాదయాత్ర చేయనున్న నేపథ్యంలో అమ్మవారిని దర్శించుకున్నామన్నారు. పాదయాత్ర తర్వాత పోలవరంలో ఒక రోజు సామూహిక సత్యాగ్రహాన్ని చేయనున్నట్లు చెప్పారు. పోలవరం నిర్వాసితులందరికీ 2013 చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలన్నారు. ప్రాజెక్టులో కమీషన్లు ఏవిధంగా పంచుకోవాలి అన్నది కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ఆశయంగా కనిపిస్తోందన్నారు.

ప్రత్యేకం

రాష్ట్రంలో విస్తరిస్తున్న చిన్నారుల అపహరణ ముఠాలు..!

పిల్లలచే భిక్షటాన చేయిస్తున్న వైనం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రద్దీగా ఉండే నగరంలో హీరో ద్విచక్ర వాహనంపై వెళ్తూ ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర ఆగినప్పుడు కొందరు చిన్నారులు భిక్షాటన చేస్తూ అతని కంటబడతారు. వారి నుంచి వివరాలు సేకరించిన సదరు హీరో ఆ చిన్నారులను తల్లిదండ్రుల నుంచి బలవంతంగా ఎత్తుకొచ్చి, మరికొందరిని కిడ్నాప్ చేసి వారి ద్వారా భిక్షాటనతో పాటు నేరాలు చేయిస్తూ, విలన్ కోట్లకు పడగలెత్తినట్లు కనుగొంటాడు. విలన్‌ను చితక్కొట్టి ఆ చిన్నారులకు స్వేచ్ఛ ప్రసాదిస్తాడు. నిజానికి ఇది సినిమా కథే.. కానీ ఆంధ్రప్రదేశ్‌లో అటువంటి స్వేచ్ఛ కోసమే చాలా మంది చిన్నారులు ఎదురు చూస్తున్నారు. వాస్తవ పరిస్థితులు సినిమా కంటే మరింత ఘోరంగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రంలో చిన్నారులను ఎత్తుకెళ్లి భిక్షగాళ్లుగా, నేరగాళ్లుగా మారుస్తోన్న మాఫియా విస్తరిస్తోంది. మారుమూల ప్రాంతాలతో పాటు ప్రధాన నగరాల్లోనూ ఈ దందా సాగుతుంటం ఆందోళనకరం. దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్న చిన్నారుల మాఫియా స్థానిక నేరగాళ్లతో సత్సంబంధాలు నెరపుతూ చిన్నారుల కిడ్నాప్‌లను ప్రోత్సహిస్తోంది. ఇక్కడి చోటా మోటా నేరగాళ్లు సుమారు ఐదేళ్లు లోపు ఒంటరిగా ఉన్న, లేదా స్కూలుకు వెళ్తోన్న బాలబాలికలకు మాయమాటలు చెప్పి మాయం చేస్తున్నారు. తల్లిదండ్రులకు దూరమైన చిన్నారులను భిక్షగాళ్లుగా మార్చేస్తున్నారు. హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడలతో పాటు ప్రధాన నగరాల్లో పిల్లలను వీధులపై తిప్పుతూ ఆదాయ వనరులుగా మార్చేసుకుంటున్నారు.



చిన్నారుల జంబ్లింగ్

నాలుగు నెలల క్రితం అనంతపురం జిల్లాలో వరుసగా చిన్నారుల అదృశ్యానికి సంబంధించి మూడు కేసులు నమోదయ్యాయి. దీనిపై అప్పటి జిల్లా ఎస్పీ జివిజి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు లోతుగా దర్యాప్తు చేయడంతో కఠోర వాస్తవాలు వెలుగు చూశాయి. జిల్లాకు చెందిన ఒక పాత నేరగాడు చిన్నారులను కిడ్నాప్ చేసి కర్ణాటక రాష్ట్రంలోని చిన్నారులతో భిక్షాటన చేయించే మాఫియా ముఠాకు ఒక్కొక్కరిని రూ.1.50లక్షలకు విక్రయించినట్లు తేలింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతాల్లో కిడ్నాప్ చేసిన చిన్నారులను ఇతర రాష్ట్రాలకు, ఇతర రాష్ట్రాల్లో కిడ్నాప్ చేసిన వారిని రెండు తెలుగు రాష్ట్రాలకు తరలించి భిక్షాటనతో పాటు నేరాలు చేయించడంలో కొన్ని ముఠాలు చురుగ్గా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ముఠాలు వ్యవస్థీకృతంగా వ్యవహరిస్తూ దేశవ్యాప్తంగా ఈ దందా నిర్వహిస్తూ నెట్‌వర్క్ పెంచుకుంటున్నాయి.

2017లో 1059 కిడ్నాప్‌లు

గతేడాది రాష్ట్రంలో 1059 కిడ్నాప్ కేసులు నమోదయ్యాయి. ఇందులో ఎక్కువగా చిన్నారులే బాధితులుగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. కిడ్నాప్ చేసిన చిన్నారులను ప్రాంతం, భాష అర్థంకాని ఇతర రాష్ట్రాలకు తరలించి సొంత తల్లిదండ్రులను, బంధువులను సొంత పరిసరాలను మరిచిపోయేలా చేస్తున్నారు. అనంతరం నయానో, భయానో వీరితో భిక్షాటన, నేరాలు చేయిస్తూ కోట్లు గడిస్తున్నారు. ఏదైనా నేరం చేసి పోలీసులకు దొరికినా జువైనల్స్‌తో చేయించింది ఎవరనేది పోలీసులకూ తెలియకుండా జాగ్రత్త పడుతున్నారు. అందుకే రాష్ట్రంలో గతేడాది జువైనల్ నేరాలు పెరిగినా అందులో అసలు నిందితులు ఎవరనేది తెలియకుండానే ఉండి పోయింది. పోలీస్ శాఖతో పాటు ప్రభుత్వం కూడా చిన్నారుల మాఫియాపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పలువురు సూచిస్తున్నారు.

సంక్షిప్తం

బోధనాస్పత్రులకు రూ.167.7 కోట్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని 15 బోధనాస్పత్రుల్లో మౌలిక వసతులకు ప్రభుత్వం రూ 167.7 కోట్లు మంజూరు చేసింది. ఈమేరకు వైద్యఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

మెడ్‌టెక్ జోన్‌లో రేడియేషన్ డైరెక్టరేట్

విశాఖలో ఏర్పాటు చేస్తున్న మెడ్‌టెక్ జోన్‌లో రేడియేషన్ డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆ జోన్ పరిధిలో రేడియేషన్ ప్రభావం లేకుండా ఉండేందుకు డైరెక్టరేట్ చర్యలు తీసుకుంటుందని వీటిలో పేర్కొన్నారు.

జర్నలిస్టులకు పింఛను సౌకర్యం : ఎన్ఎజె డిమాండ్

కేరళ తరహాలో ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా పాత్రికేయులకు, ప్రెస్ కార్మికులకు పింఛను సౌకర్యాన్ని దేశ వ్యాప్తంగా అమలు చేయాలని నేషనల్ అలయన్స్ ఆఫ్ జర్నలిస్ట్స్(ఎన్ఎజె) అధ్యక్షులు ఎస్.కె పాండే, ప్రధాన కార్యదర్శి, కోటేశ్వరరావు, కార్యదర్శి చంద్రకాంత్‌లు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర కార్మిక శాఖ మంత్రి సంతోష్‌కుమార్ గాంగ్వర్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. కొత్త వేజ్ బోర్డు ఏర్పాటు చేయాలని, వర్కింగ్ జర్నలిస్టుల చట్టం ఎలక్ట్రానిక్ మీడియా ఉద్యోగుల దుస్థితిని దృష్టిలో ఉంచుకుని వర్తింపజేయడంతోపాటు ఉమ్మడి వేజ్ బోర్డు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని సూచించారు.

క్షుద్ర పూజలపై సిట్టింగ్ జడ్జితో విచారణ : అంబటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లోకేష్‌ను ముఖ్యమంత్రిని చేయడం కోసమే చంద్రబాబు నాయుడు కుటుంబం దేవాలయాల్లో తాంత్రిక పూజలు నిర్వహించి ఉంటారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి అంబటి రాంబాబు అనుమానం వ్యక్తం చేశారు. తక్షణమే ఈ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన లోకేష్ రాజకీయ భవిష్యత్ కోసం ఆయన తల్లి రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రముఖ దేవాలయాల్లో క్షుద్రపూజలు జరిపించి ఉంటారనే ప్రచారం సాగుతోందన్నారు.

కృషి, పట్టుదలతోనే క్రీడల్లో రాణింపు

వెయిట్ లిఫ్టర్ కరణం మల్లీశ్వరి

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు)

క్రీడల్లో రాణించాలంటే కృషి, పట్టుదల ఉండాలని వెయిట్ లిఫ్టర్ కరణం మల్లీశ్వరి అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని గంజి రవీంద్ర హ్యాండ్‌లూమ్స్‌లో చేనేత వస్త్రాలను ఆమె శనివారం పరిశీలించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో క్రీడాకారులు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొలి నుంచీ తాను చేనేత వస్త్రాలనే ఇష్టపడతానని, అవి నాణ్యంగా, సౌకర్యవంతంగా ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గంజి చిరంజీవి, గంజి రవీంద్ర, టి.రవీంద్రకుమార్ పాల్గొన్నారు.



విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో శనివారం నిర్వహించిన పిఎస్ఎన్ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జాతీయ నాయకులు బిశ్వాస్

ఉపాధి చూపడంలో కేంద్రం విఫలం

ఎస్ఎఫ్ఐ జాతీయ నాయకులు బిశ్వాస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వృత్తి విద్యా కోర్సులు పూర్తి చేసుకుని బయటకు వస్తున్న విద్యార్థులకు ఉపాధి చూపించడంలో కేంద్రప్రభుత్వం విఫలమయిందని ఎస్ఎఫ్ఐ జాతీయ నాయకులు, అఖిల భారత ప్రొఫెషనల్ స్టూడెంట్ నెట్‌వర్క్ (పిఎస్ఎన్) కన్వీనర్ మయూక్ బిశ్వాస్ విమర్శించారు. పిఎస్ఎన్ సమావేశాలు విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బిశ్వాస్ మాట్లాడుతూ ఏటా లక్షలాదిమంది విద్యార్థులు వృత్తి విద్యా కోర్సులు పూర్తిచేసుకొని బయటకు వచ్చి నిరుద్యోగులుగా మిగులుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో నాణ్యతలేని వృత్తివిద్యా కోర్సులు బోధిస్తున్నారని, ఈ రంగానికి బడ్జెట్ కేటాయింపులను తగ్గిస్తున్నారని విమర్శించారు. ప్రకటనల కోసం మోడీ ప్రభుత్వం రూ.36 వేల కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. ప్లానింగ్ కమిషన్ స్థానంలో తీసుకొచ్చిన నీతిఅయోగ్ వల్ల ఏం సాధించారో కేంద్రప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రాధాన్యతలతో నడపాల్సిన ఐఐటీల్లో కూడా మౌలిక సదుపాయాలు లేవని తెలిపారు. ఎఎన్‌యు ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఈదర శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో సామాజిక స్పృహ తగ్గుతుందని, ఇలాంటి సమావేశాల ద్వారా వారిలో చైతన్యాన్ని కల్పించాలని కోరారు. పిఎస్ఎన్ కమిటీ సభ్యులు ఎన్‌డి లాల్ సలామ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ అఖిల భారత ఉపాధ్యక్షులు ఎస్ నూర్‌మహ్మద్, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె రమేష్,వై రాము ప్రసంగించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ అశోక్, కృష్ణా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ కోటి, ఎం శోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరిహారం కోసం కళ్లు కాయలు

- డబ్బులివ్వకుండానే భూముల స్వాధీనం
- 'పురుషోత్తపట్నం ఎత్తిపోతల'లో ఇదీ ప్రభుత్వ తీరు



పురుషోత్తపట్నంలో పంపుహౌస్ నిర్మాణానికి ముందు రైతు కరుటూరి శ్రీనివాస్‌కు చెందిన పొలం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

భూసేకరణ పరిహారం చెల్లించకుండా భూములను స్వాధీనం చేసుకోవద్దని ఆదేశాలు జారీ చేస్తామని రాష్ట్ర హైకోర్టు ప్రభుత్వాన్ని హెచ్చరించిన నేపథ్యంలో తూర్పుగోదావరి జిల్లా పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం విషయం మళ్లీ తెరపైకి వచ్చింది. ప్రభుత్వం తమ భూములకు తక్కువ పరిహారం ప్రకటించి బలవంతంగా లాక్కుందని పురుషోత్తపట్నంలో 72 ఎకరాలకు సంబంధించిన 87 మంది రైతులు గతంలో కోర్టును ఆశ్రయించారు. కోర్టులు అవార్డులు (పరిహార ఉత్తర్వులు) జారీ చేసినప్పటికీ భూపరిహారం సకాలంలో చెల్లించడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో భూములు కోల్పోయిన రైతులు కోర్టులను ఆశ్రయించి ఎగ్జిక్యూషన్ పిటిషన్లు దాఖలు చేస్తున్నారు. ఈ పిటిషన్లు కోర్టుల్లో ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉండిపోవడంతో రైతులు నష్టపోతున్నారని హైకోర్టు ప్రభుత్వంపై ఇటీవల ఆగ్రహం వ్యక్తం చేసింది. సీతానగరం మండలం పురుషోత్తపట్నం వద్ద నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకం వల్ల నిర్వాసితులుగా మారిన 87 మంది రైతులు భూనష్టపరిహారం ఇప్పటికీ అందలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకానికి ప్రధానమైన పంపుహౌస్ నిర్మాణం పూర్తి కావాలంటే రైతు కరుటూరి శ్రీనివాస్‌కు చెందిన 2.42 ఎకరాల భూమి అవసరం ఉంది. ఈ రైతు ఎకరానికి రూ.40 లక్షలు ఇస్తే భూమిని అప్పగిస్తానని స్పష్టం చేశారు. భూమిని ప్రభుత్వానికి ఇస్తున్నానని ధ్రువీకరించే ఒప్పంద పత్రంపై సంతకం చేయలేదు. అయినప్పటికీ శ్రీనివాస్ పొలాన్ని గతేడాది పోలీసులు, రెవెన్యూ అధికారులు బలవంతంగా స్వాధీనం చేసుకుని, కుటుంబంతో సహా ఆయనను గృహనిర్బంధం చేశారు. నష్టపరిహారం చెల్లించకుండానే శ్రీనివాస్ భూమిలో పంపుహౌస్ నిర్మిస్తోంది. సీతానగరం మండలం నాగంపల్లికి చెందిన రైతు మడిచర్ల సత్యనారాయణ తన భూమిని



కరుటూరి శ్రీనివాస్ పొలంలో నిర్మిస్తున్న పంపు హౌస్

ప్రభుత్వానికి అప్పగించలేదు. ఒప్పందపత్రంపైనా సంతకం చేయలేదు. రెవెన్యూ అధికారులు అవార్డు ప్రకటించకుండా పోలీసుల సాయంతో పొక్లెయిన్లతో దౌర్జన్యంగా పొలంలో ప్రవేశించారు. 30 మంది రైతులపై సెక్షన్ 353 కింద అక్రమంగా కేసులు నమోదు చేశారు.. సెక్షన్ 41ఎ కింద రైతులకు నోటీసులు జారీ చేశారు. ఈ రైతుకు ఇప్పటికీ ప్రభుత్వం పరిహారం చెల్లించలేదు.

ఈ పథకం వల్ల భూములు కోల్పోయిన నాగంపల్లి, పురుషోత్తపట్నం, చిన కొండేపూడి, వంగలపూడి రైతులు ఎకరానికి రూ.60 లక్షలు చొప్పున చెల్లించాలని గతంలో డిమాండ్ చేశారు. అప్పటి జిల్లా కలెక్టర్ హెచ్ అరుణ్‌కుమార్ గతేడాది జనవరి 7న రాజమహేంద్రవరంలో రైతులతో సమావేశమై ఎకరానికి రూ.19.50 లక్షలు ప్రకటించగా, రైతులు తిరస్కరించారు. సీతానగరంలో మళ్లీ 24న రైతులతో సమావేశం నిర్వహించి 2013 భూసేకరణ చట్ట ప్రకారం లేదా పట్టిసీమ తరహా పరిహారం చెల్లిస్తామని ప్రకటించారు. గ్రామాల వారీగా వివిధ ప్రాంతాల్లో వేర్వేరు నష్టపరిహారం చెల్లిస్తామంటూ చేసిన ప్రతిపాదనలను రైతులు తిరస్కరించారు. ఫిబ్రవరిలో చినకొండేపూడిలో సీతానగరం ఎంఎల్ఎ పెందుర్తి వెంకటేష్ రైతులతో సమావేశమై ఎకరానికి రూ.28 లక్షలుగా నిర్ణయించారు. దీనిని కూడా రైతులు వ్యతిరేకించారు. ఫిబ్రవరి 16వ తేదీ రాత్రి పురుషోత్తపట్నంలో రైతులతో సమావేశమైన జలవనరుల శాఖ మంత్రి మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ప్యాకేజీ విషయంలో స్పష్టమైన హామీ ఇవ్వలేదు. దీంతో 72 ఎకరాలకు సంబంధించిన 87 మంది రైతులు తమ భూములను ప్రభుత్వానికి ఇవ్వబోమని ప్రకటించారు. వారి భూములకు నష్టపరిహారం చెల్లించకుండానే ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పంపుహౌస్, ఇతర పనులను చేపట్టింది. ఇప్పటికైనా ఎకరానికి రూ.40 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

'గంగ'గోడు వినేదెవ్వరు!

- 10 నుంచి 6.48 టిఎంసిలకు కుదింపు
- 1 నుంచే నీటి విడుదలకు బ్రేక్
- లక్ష ఎకరాల ఆయకట్టు ప్రశ్నార్థకం



బ్రహ్మంసాగర్ రిజర్వాయర్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

తెలుగుగంగ గోడును వినేనాథుడే కరువయ్యాడు. ప్రభుత్వం తెలుగుగంగలో భాగమైన బ్రహ్మంసాగర్ రిజర్వాయర్‌లో నీటి నిల్వను 10 టిఎంసిలకే నిల్వ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కారణాలు లేకుండానే 6.48 టిఎంసిలకు కుదించింది. నెలాఖరు వరకు వెలుగోడు నుంచి నీటిని విడుదల చేసే అవకాశాలు ఉన్నప్పటికీ ఒకటినే ప్రభుత్వం నిలిపివేసింది. లక్ష ఎకరాల ఆయకట్టు సాగు ప్రశ్నార్థకంగా మారింది. కొత్త ఏడాది మొదటి రోజు నుంచి ఆయకట్టు సాగుపై చీకట్లు అలుముకోవడంతో రైతాంగంలో ఆందోళన నెలకొంది.

బ్రహ్మంసాగర్ 17.78 టిఎంసిల నీటి నిల్వ సామర్థ్యాన్ని కలిగి ఉంది. 1.77 లక్షల ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. ఏటా 12 టిఎంసిలను నిల్వ చేసి ఆయకట్టుకు సాగునీరు అందించేవారు. గతేడాది 12 టిఎంసిల నిల్వతో జలకళను సంతరించుకుంది. ఫలితంగా బోటింగ్ సదుపాయం అందుబాటులోకి రావడంతో పర్యాటకుల సందడి ఉండేది. పూర్తి స్థాయిలో ఆయకట్టు సాగయ్యేది. మైదుకూరు, బద్వేల్ నియోజకవర్గాల పరిధిలోని బి.కోడూరు, బద్వేల్, గోపవరం, పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బి.మఠం, మైదుకూరు, దువ్వూరు, ఖాజీపేట, చాపాడు మండలాల పరిధిలోని రైతాంగం కరువును సమర్థవంతంగా ఎదుర్కొనేది. ఈ ఏడాది 6.48 టిఎంసిల నిల్వకు పరిమితం చేయడంతో కరువు, దుర్భిక్షం బారినపడే అవకాశం కనిపిస్తోంది.

ఈ ఏడాది శ్రీశైలం జలాశయం ఆలస్యంగా నిండిన విషయం తెలిసిందే. మిగుల జలాలను సద్వినియోగం చేసుకోవడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ లెక్కన బ్రహ్మంసాగర్‌లో 12.5 నుంచి 15 టిఎంసిలను నిల్వ చేయాలి. కడప జిల్లా పట్ల వివక్షలో భాగంగా బ్రహ్మంసాగర్‌లో 6.4 టిఎంసిలు, సబ్సిడరీ రిజర్వార్ (ఎస్ఆర్)-1, ఎస్ఆర్-2 రిజర్వాయర్లలో ఒకటి, 1.8 టిఎంసిల చొప్పున నీటిని నిల్వ చేసినట్లు కాకి లెక్కలను ప్రభుత్వం చూపుతోంది. కర్నూలు జిల్లా సిద్ధాపురం ఎత్తిపోతల పథకానికి నీరందదనే ఉద్దేశంతో కడప జిల్లాకు నీటి విడుదలను నిలిపివేశారు. 17 టిఎంసిల నిల్వ కలిగిన వెలిగోడు రిజర్వాయర్ నుంచి రొటేషన్ పద్ధతిలో వారం రోజులు ఒకరికి, మరో వారం రోజులు ఒకరికి చొప్పున నీటిని విడుదల చేయవచ్చు. ఇలా చేస్తే బ్రహ్మంసాగర్‌లో 10 టిఎంసిలను నిల్వ చేసి పూర్తి ఆయకట్టుకు సాగునీరందించే అవకాశం ఉందని నిపుణుల చెబుతున్నారు. ఫలితంగా ఎడమ కాల్వ కింద 1.50 లక్షలు ఎకరాలు, కుడికాల్వ కింద 21 వేల ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. 10 టిఎంసిలు నిల్వ చేయకపోతే లక్ష ఎకరాల ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారనుంది. 6.48 టిఎంసిల నిల్వల్లో మూడు టిఎంసిలు డెడ్‌స్టోరేజి, ఒక టిఎంసి నీటి ఆవిరి కింద పోతే రెండు టిఎంసిలతో 20 వేల ఎకరాల ఆయకట్టుకు మాత్రమే ఆరుతడి పంటలకు సాగు నీరందే అవకాశం కనిపిస్తోంది. ఈ లెక్కన 1.20 లక్షల ఎకరాల ఆయకట్టును నట్టేట్లో ముంచి నట్లే.

కష్టపడి పనిచేస్తేనే విజయాలు

మానసిక వికలాంగులతో మిస్‌వరల్డ్ ఆస్ట్రేలియా ఎస్మా ఓలాడర్స్

ప్రజాశక్తి-కాకినాడ

కష్టపని పనిచేస్తేనే విజయాలు సొంతమవుతాయని మిస్‌వరల్డ్ ఆస్ట్రేలియా ఎస్మా ఓలాడార్స్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ జి కన్వెన్షన్ హాల్లో శనివారం రాత్రి నిర్వహించిన తెలుగు ప్రిన్సెస్ పోటీల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె తౌలుత బదిర, మానసిక వికలాంగులైన విద్యార్థులతో ర్యాంపు వాక్ నిర్వహించారు. వారితో సెల్ఫీలు దిగారు. అనంతరం ఆమె మాట్లాడారు. మిస్‌వరల్డ్ ఆస్ట్రేలియా కోసం తాను నాలుగుసార్లు ప్రయత్నించి, ఐదోసారి విజయం సాధించగలిగానని చెప్పారు. పిల్లలకు చిన్న వయసు నుంచే పలు అంశాల్లో శిక్షణ ఇవ్వడం వల్ల వారు మరింత ఉన్నతస్థితికి చేరే అవకాశం కలుగుతుందన్నారు. పిల్లల సంక్షేమానికి అండగా ఉంటానని ప్రకటించారు. 650 మంది విద్యార్థులను కాకినాడలో కలుసుకోగలిగానని తెలిపారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలంటే ఎంతో ఇష్టమని చెప్పారు. అవకాశం వస్తే మరోసారి కాకినాడకు వస్తానని తెలిపారు. కాకినాడ కాజాను తొలిసారి రుచి చూశానని చెప్పారు. విద్యార్థులంతా తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చేందుకు కష్టపడి చదువుకోవాలన్నారు. అనంతరం తెలుగు ప్రిన్సెస్ పోటీల్లో విజేతలుగా నిలిచిన తాడిపర్తి అపర్ణకు మెమోంటోను బహూకరించారు. ఫస్ట్ రన్నరప్‌గా ఉండమట్ల సంజన, సెకండ్ రన్నరప్‌గా సాయిశ్రేష్ట ఎంపికయ్యారు.

కలుషిత ఆహారం తిని 40 మంది విద్యార్థినులకు అస్వస్థత

జి.సిగడాం కస్తూరిబా గాంధీ పాఠశాల సిబ్బందిపై కలెక్టర్ ఆగ్రహం
ఎస్ఒ, ఎఎన్ఎం, హెడ్‌కుక్ సస్పెండ్

ప్రజాశక్తి - రాజాం

శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో మూడు రోజుల కిందట కలుషిత ఆహారం తిని 40 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. పాఠశాలలోనే మందులు, ఇంజెక్షన్లతో సరిపెట్టడంతో, శుక్రవారం రాత్రికి వారి పరిస్థితి విషమించడంతో రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల కథనం ప్రకారం... ఈనెల నాలుగో తేదీన మధ్యాహ్నం విద్యార్థినులకు పులిహోర వండి పెట్టారు. భోజనం తిన్న కొద్దిసేపటి తర్వాత 40 మంది విద్యార్థినులు వాంతులు, విరేచనాలు, జ్వరం, తలనొప్పితో అస్వస్థతకు గురయ్యారు. ఈ విషయాన్ని పాఠశాల సిబ్బందికి చెప్పినా పట్టించుకోలేదు. పాఠశాలలోనే జి.సిగడాం పిహెచ్‌సి వైద్యులతో మాత్రలు, ఇంజెక్షన్లు ఇచ్చి రెండు రోజులు సరిపెట్టారు. శుక్రవారం రాత్రికి పరిస్థితి విషమించడంతో ప్రత్యేకాధికారి పి.శిరీష విద్యార్థులను రాజాంలోని సామాజిక ఆస్పత్రికి తరలించారు.



రాజాం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

కలుషిత ఆహారం వల్లే ఈ ఘటన చోటుచేసుకుందన్న ప్రాథమిక నివేదికతో సిబ్బందిపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల ప్రత్యేకాధికారి పి.శిరీష, జి.సిగడాం ఎఎన్ఎం జి.కుమారి, హెడ్ కుక్ ఎర్ర బాపమ్మను సస్పెండ్ చేశారు. రెండు రోజుల పాటు పాఠశాలకు సెలవులు ప్రకటించి, పాఠశాలలో పూర్తిస్థాయిలో పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు.

'బీమా -కారెగావ్' ఘటనపై కెవిపిఎస్ నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి-ఒంగోలుటౌన్

భీమా-కొరెగావ్‌లో జరిగిన హింసను ఖండించాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటూ ఒంగోలులో కెవిపిఎస్ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మజుందర్ మాట్లాడుతూ బీమ్-కొరెగావ్ ఘటన వెనుక బిజెపి హస్తం ఉందన్నారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బి రఘురామ్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో టిడిపి శ్రమజీవులు, బలహీనవర్గాలపై దాడి చేస్తూ నిత్యం ప్రజాస్వామ్యానికి విఘాతం కల్గించడమే పనిగా పెట్టుకున్నాయని విమర్శించారు. బీమా-కొరెగావ్‌లో కూడా అదే రుజువయిందన్నారు. దళితులు, బలహీనవర్గాలు, కష్టజీవులు ఏకమై దాడులను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్ శ్రీను, పియన్‌యం రాష్ట్ర కార్యదర్శి ఎస్ అనిల్ మాట్లాడారు.

సిఎం సమక్షంలో తేల్చుకుంటాం

ట్రాన్స్‌ట్రాయ్‌పై క్రిమినల్ కేసులు పెడతాం
దేనా బ్యాంకు రికవరీ అధికారి

ప్రజాశక్తి-పోలవరం

పోలవరం ప్రాజెక్టులో తమ బ్యాంకు అధికారులు, రికవరీ బందం సీజ్ చేసిన మూడు భారీ యంత్రాల్లో రెండింటిని ట్రాన్స్‌ట్రాయ్ కంపెనీ వాడుతున్నట్లుగా సమాచారం అందిందని, ఆ కంపెనీపై క్రిమినల్ కేసులు పెడతామని దేనా బ్యాంక్ రికవరీ అధికారి సంతోష్ కుమార్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 8న పోలవరం ప్రాజెక్టుకు వస్తున్న నేపథ్యంలో ఆయన సమక్షంలో తేల్చుకుంటామని చెప్పారు. యంత్రాల సీజ్ విషయమై ప్రజాశక్తి శనివారం ఫోన్లో సంప్రదించగా సీజ్‌చేసిన మూడు యంత్రాల్లో రెండింటిని కంపెనీవారు వాడుతున్నట్లుగా సమాచారం ఉందని చెప్పారు. కోర్టు ఆదేశాల మేరకు సీజ్ చేసిన వాహనాలను వాడడం చట్టరీత్యా నేరమని తెలిపారు. సంబంధిత కంపెనీపై క్రిమినల్ కేసులు పెట్టనున్నట్లు అడ్వకేట్ కమిషనర్ రాజారత్నం తనకు చెప్పారన్నారు. పోలవరం ప్రాజెక్టులో 64 వాహనాలను సీజ్ చేయాల్సి ఉండగా మూడింటినే సీజ్ చేశామని చెప్పారు. జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ మోహన్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.సుధాకర్ సూచనల మేరకు జిల్లా కలెక్టర్ అనుమతి కోసం జిల్లా కేంద్రానికి వెళ్లామని, ఆయన అందుబాటులో లేకపోవడంతో ఫోన్లో సంప్రదించామని తెలిపారు. ఈ నెల 8న మాట్లాడడానికి అవకాశం ఇచ్చారన్నారు. ఈలోపు సీజ్ చేసిన వాహనాలను వాడుతున్నారని, ఈ విషయం తేలేవరకూ వాహనాలను వాడనివ్వబోమని సంతోష్‌కుమార్ స్పష్టం చేశారు.

ఎపిజిబి మేనేజర్ సజీవ దహనం

గ్యాస్ లీకేజీతో కారు దగ్ధం

ప్రజాశక్తి - బనగానపల్లె

కర్నూలు జిల్లా బనగానపల్లె మండలం దద్దణాల ప్రాజెక్టు సమీపంలో కారులో మంటలు చెలరేగి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు(ఎపిజిబి) గార్లదిన్నె మేనేజర్ రాజేష్ (30) సజీవ దహనమయ్యారు. ప్రత్యక్ష వివరాల ప్రకారం.. శనివారం నంద్యాల నుంచి రాజేష్ కారులో గార్లదిన్నెకు బయల్దేరారు. మార్గమధ్యలో దద్దణాల ప్రాజెక్టు సమీపంలో కారులో గ్యాస్ లీకేజీతో మంటలు చెలరేగాయి. మేనేజర్ రాజేష్ కారులోనే ఇరుక్కుపోయారు. కారులో మంటలు చెలరేగడం గమనించిన ద్విచక్ర వాహన చోదకులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. మంటలు అదుపు కాలేదు. కారులో ఇరుక్కున్న మేనేజర్ రాజేష్ సజీవ దహనమయ్యారు. వాహన చోదకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సిఐ శ్రీనివాసులు, ఎస్ఐ రాకేష్ సంఘటనా స్థలానికి చేరుకుని కారు ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. బనగానపల్లె అగ్నిమాపక సిబ్బంది వెళ్లి మంటలను ఆర్పారు. అప్పటికే బ్యాంకు మేనేజర్ పూర్తిగా కాలి బూడిదయ్యారు. మృతుడికి భార్య సాహిత్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ శ్రీనివాసులు తెలిపారు.



కాలిపోతున్న కారు (ఇన్‌సెట్‌లో) రాజేష్

అంగరంగ వైభవంగా ప్రజా ఉత్సవాలు

ప్రజాశక్తి - యానాం, తాళ్లరేవు

యానాం 16వ ప్రజా ఉత్సవాలు అంగరంగ వైభవంగా శనివారం ప్రారంభమయ్యాయి. యానాం జిఎంసి బాలయోగి క్రీడాప్రాంగణంలో ఈ ఉత్సవాలను పుదుచ్చేరి ముఖ్యమంత్రి నారాయణసామి ప్రారంభించారు. అనంతరం మంత్రి మల్లాడి కృష్ణారావు అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ సభలో సిఎం మాట్లాడారు. మల్లాడి యానాం, పుదుచ్చేరికి మాత్రమే పరిమితమవ్వకూడదని, ఆయన ఢిల్లీ రావాలని అన్నారు. అనంతరం ప్రముఖ గాయకులు ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, సినీ దర్శకులు సుకుమార్, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్‌లను ఘనంగా సత్కరించారు. అలాగే 19వ ఫలపుష్ప ప్రదర్శనను సిఎం ప్రారంభించారు.

ప్రత్యేకం

వంటమ్మల నోట్లో మట్టి!

- కోడి గుడ్ల లెక్కల్లో మాయ
- బిల్లుల్లో కోత
- కాంట్రాక్టర్లకు లాభాలు
- నష్టాల్లో మధ్యాహ్న భోజన కార్మికులు

ప్రజాశక్తి - చిత్తూరు ప్రతినిధి

ఈ చిత్రం చిత్తూరు జిల్లా కేంద్రంలోని డిఇఒ కార్యాలయం పక్కన ఉన్న ప్రాథమిక పాఠశాలలోనిది. ఇక్కడ 66 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరందరికీ ఇక్కడి వంటమ్మ లక్ష్మమ్మ వండి పెడుతున్నారు. జూలై నెలలో ఆమె అక్కడున్న పిల్లలకు 1,274 భోజనాలు పెట్టింది. దీనికి ప్రభుత్వం మెను ఛార్జీల కింద రూ.8,556 చెల్లించింది. అయితే గత నెలలో ఇంతే మందికి భోజనాలు పెట్టారు. అయితే ఆమెకు రూ.5,262 మాత్రమే బిల్లు వచ్చింది. రూ.3,294 కోత పెట్టి ఆ డబ్బు కోడిగుడ్లు సరఫరా చేసే కంట్రాక్టరుకు ఇచ్చారు. ఇక్కడ వారానికి మూడు రోజులు కోడి గుడ్లు పెడితే.. ఆరు రోజుల డబ్బులు వంటమ్మలకు ఇచ్చే బిల్లుల్లో నుంచి కోత కోసి కాంట్రాక్టరుకు ఇస్తున్నారు.

ఇలా ఈ ఒక్క పాఠశాలలోనే కాదు.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వంట వండి వార్చుతున్న వంటమ్మల కడుపుకోత ఇది. మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్ల పంపిణీ వ్యవహారంలో వంటమ్మల కడుపుగొట్టి కాంట్రాక్టర్లకు పెడుతోంది. భారాన్ని తాను భరించకుండా మధ్యాహ్న భోజన కార్మికులకు వచ్చే బిల్లుల్లో కోత కోసి కాంట్రాక్టర్లకు ఇస్తోంది.

గతేడాది జూలై వరకూ మధ్యాహ్న భోజనంలో వారంలో మూడు గుడ్లను వంటమ్మలు వడ్డించేవారు. నిత్యావసర వస్తువుల ధరలు ఎలా ఉన్నా దీనివల్ల వంటమ్మలు నెట్టుకొచ్చేవారు. అయితే ఆగస్టు నుంచి కోడి గుడ్ల సరఫరాను ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ప్రయివేటు కాంట్రాక్టర్లకు అప్పగించింది. ఇలా ఒక్కో జిల్లాలో ఒక్కొక్కరికి ఇచ్చింది. చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు శ్రీధర్ బాబు అనే కాంట్రాక్టరు అప్పగించింది. ప్రభుత్వం ఒక్కో గుడ్డును రూ.2.36 లెక్కన సంబంధిత కాంట్రాక్టర్లకు ఇస్తోంది. ఈ మొత్తాన్నీ ప్రభుత్వం భరించకుండా వంటమ్మలకు ఇస్తున్న మెనూ బిల్లులోంచి కోతకోసి ఇస్తోంది. ఉదాహరణకు ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం రూ.6.48 ఇస్తోంది. ఇందులో గుడ్డుకు రూ.2.38 కట్ చేసి సంబంధిత ఏజెన్సీకి ఇస్తోంది. మిగిలిన రూ.4.10ను వంటమ్మలకు ఇస్తోంది. ఇక్కడ కోడి గుడ్లు వారానికి మూడు మాత్రమే ఇస్తే.. బిల్లు మాత్రం ఆరు రోజులకు వంటమ్మలకు ఇస్తున్న మెనూ ఛార్జీల్లో నుంచి కోత పెడుతున్నారు.

ఇచ్చే సొమ్ముకూ, మర్కెట్ ధరలకూ పొంతనేది?

మార్కెట్లో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటున్నాయి. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలకు ఇస్తున్న మెనూ ఛార్జీలు ఏమాత్రం చాలడం లేదు. కోడిగుడ్ల డబ్బులు కోత పెట్టకుండా ఇచ్చినప్పుడు ఎలాగోలా సర్దుబాటు చేసి వండి వార్చే వారు. ఇప్పుడు ఈ మొత్తాన్ని కోత కోయడం వల్ల వంటమ్మలు నష్టాల్లో కూరుకుపోతున్నారు. ప్రభుత్వం ఇస్తున్న డబ్బులకు, అంగడి దుకాణాల్లో అవుతున్న బిల్లులు రెట్టింపు అవుతున్నాయి. కోడి గుడ్లు వంటమ్మలే వడ్డిస్తారు. వారికే ఇవ్వాలి.

- నాగరాణి, మధ్యాహ్నభోజన కార్మికుల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి

మధ్యాహ్న భోజన పథకం అమలయ్యే పాఠశాలివే

ఏ పాఠశాల	సంఖ్య	విద్యార్థులు
ప్రాథమిక	36,289	3,26,092
అపర్‌ప్రైమరీ	5,546	12,88,906
ఉన్నత పాఠశాలలు	5,344	7,23,756
మదర్సాలు	225	17,284
మోడల్ స్కూళ్లు	150	36,000
వయోజన స్కూళ్లు	81	4,607
మొత్తం	**47,635**	**43,94,665**

సంక్షిప్తం

ఇండిగో ఎయిర్‌లైన్స్ ప్రారంభం

రేణిగుంట: రేణిగుంట విమానాశ్రయంలో శనివారం విమానశాఖ మంత్రి శ్రీ అశోక్ గజపతి రాజు సమక్షంలో నూతనంగా ఇండిగో ఎయిర్‌లైన్స్ సర్వీస్ ప్రారంభించారు. ఈ సర్వీసులు తిరుపతి నుంచి హైదరాబాదు, బెంగుళూరుకు వెళ్లనున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన కుటుంబ సమేతంగా తిరుపతికి బయల్దేరి వెళ్లారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ నిషాంత్‌కుమార్, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ సిహెచ్‌పుల్లా, సిఎస్ఒ దేవేంద్ర, అసిస్టెంట్ కమాండటెడ్ మానీష్‌లు పాల్గొన్నారు.

వృద్ధురాలు సజీవ దహనం

నర్సీపట్నం రూరల్, విశాఖ: నర్సీపట్నం మండలం చెట్టుపల్లి గ్రామంలో అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో వద్ధురాలు మతి చెందింది. నర్సీపట్నం ఎస్ఐ టి.శ్రీను వివరాలు ప్రకారం.. చెట్టుపల్లి గ్రామానికి చెందిన గంగిరెడ్ల అప్పలనర్స అలియాస్ అప్పలరాజు (62) తాటాకుల పాకలో నివసిస్తుంది.. 5వ తేదీ రాత్రి మతురాలు అప్పలనర్సమ్మ చలికి మంచం కింద ఏర్పాటు చేసుకున్న కుంపటిలో ఒక్కసారిగా నిప్పులు చెలరేగడంతో మంచంతో పాటు పాక కూడా కాలిపోయింది.ఈ ఘటనలో వృద్ధురాలి సజీవ దహనమైంది. సంఘటనా స్థలాన్ని ఎఎస్‌పి ఆరిఫ్ ఆఫీజ్, నర్సీపట్నం రూరల్ సిఐ రేవతమ్మ పరిశీలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్వీ జూలో అడవి దున్న మృతి

తిరుపతి రూరల్: ఎస్వీ జూ పార్క్‌లో శనివారం అడవి దున్న మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. ఎస్వీ జూ పార్క్ సిబ్బంది వివరాల మేరకు...గత కొంత కాలంగా అడవి దున్న అనారోగ్యంతో బాధపడుతోంది. వయసు మీరడంతో నడవడానికి ఇబ్బందులు పడుతోంది. కొన్ని రోజులుగా తినటానికి కూడా అవస్థలు పడే స్థితికి వచ్చింది. ఈ నేపథ్యంలో ఆరోగ్య కారణాల రీత్యా శనివారం 12 గంటలకు అడవి దున్న మృతిచెందింది. జూ పార్క్ అధికారుల ఆధ్వర్యంలో అడవి దున్నకు పోస్టుమార్టం నిర్వహించి పంచనామా చేశారు.

సంపాదకీయం

చమత్కారం

చమత్కారం, ఛలోక్తి, విసురు, చెణుకు, హాస్యోక్తి ఇత్యాది రసస్ఫోరకాలన్నీ హాస్యరసానికి చెందినవే. వాతలు పెట్టేవి, ఏడుపు తెప్పించేవి మాత్రమే కాదు... దెబ్బతిన్నవాడికి సైతం నవ్వు తెప్పించేవి కూడా ఉత్తమ ఛలోక్తులే. 'చదువది ఎంతకల్గిన రసజ్ఞత యించుక చాలకున్న ఆ చదువు నిరర్థకంబు' అన్న భాస్కర శతక కర్త హితవచనం తలకెక్కితే తప్ప ఈ రసజ్ఞతలోని ఛలోక్తి బోధపడదు. చమత్కారంగా మాట్లాడడం అందరికీ చేతకాదు. చమత్కారంగా మాట్లాడేవారు ప్రత్యేకించి ప్రతిభావంతులూ, పండితులే కానక్కర్లేదు కూడా. 'ఈ ప్రపంచం ఆలోచనా పరులకు సుఖదాయకం, అనుభూతి పరులకు దుఃఖదాయం' అని హొరేస్ వాల్‌పోల్ అనే రచయిత చెప్పినట్లుగా చమత్కరించేవారు మొదటి రకానికీ, ఆ చమత్కారానికి గురయ్యేవారు రెండో రకానికీ చెందుతారేమో. అసలు చమత్కారంలోనే గొప్ప చమత్కారం వుంటుంది. ఎదుటివారికి 'పంచ్' వేశామని ఆనందించేలోపే 'రివర్స్ పంచ్' పడే ప్రమాదమూ వుంటుంది. మునిమాణిక్యం నరసింహారావు అన్నట్లు 'చమత్కారంగా మాట్లాడటానికి వక్రదృష్టి వుండాలి'. 'కాదేదీ కవిత కనర్హం' అని శ్రీశ్రీ చెప్పినట్లుగా వక్రదృష్టి వుండాలేగాని చమత్కారానికి అర్హం కాని వస్తువేదీ వుండదు. 'కొందరు మనుషులు డిక్షనరీల్లాంటివాళ్లు. వాళ్లను ఎప్పుడైనా చూడొచ్చు. కానీ సరదాగా మాట్లాడటానికి పనికిరారు' అని విలియం పెన్ వాఖ్యానించినట్లుగా వక్రదృష్టి లేని చమత్కారం వెగటు పుట్టిస్తుంది. సాహిత్యంలో ప్రతీ ప్రక్రియలోనూ హాస్యానికి, చమత్కారానికి ప్రత్యేక స్థానం, గుర్తింపు ఉంది. హాస్యం, చమత్కారాలు చూసినప్పుడు, చదివినప్పుడే కాకుండా గుర్తొచ్చిన ప్రతిసారీ మనల్ని నవ్వుల్లో ముంచెత్తి ఆనందాన్ని చేకూరుస్తాయి. 'నవ్వడం ఒక భోగం/ నవ్వించడం ఒక యోగం/ నవ్వకపోవడం ఒక రోగం' అని ప్రముఖ హాస్య రచయిత, దర్శకుడు జంధ్యాల నవ్వు ప్రాధాన్యతను తనదైన శైలిలో చమత్కారంగా చెబుతాడు. అంతేకాదు... మనం ఆంగ్లానికిస్తున్న ప్రాధాన్యతను 'ఇంగ్లీషురాదా నీకు/ ఆశ్చర్యం/ మనం పుట్టింది/ ఆంధ్రాలోనే కదా!' అంటూ చమత్కరిస్తారు పెల్లకూరి జయప్రద. అలాగే.. సోమేపల్లి వెంకటసుబ్బయ్య తన కవితలో... 'కుక్కలున్నాయి జాగ్రత్త/ ఫర్వాలేదు/ మనుషులున్నారేమో/ అదేభయం!' అంటాడు. కుక్కలకన్నా మనుషులే ప్రమాదకరమని హెచ్చరించడంలో కవి చమత్కారం దాగి వుంది.

ఈ ప్రక్రియ మొత్తంలో వేళాకోళం, వ్యంగ్యం, వెటకారం లేకుండా ఛలోక్తులుండవు. ఎవరోకరిని కించపరిచే గుణం ఈ ఛలోక్తులకు సహజంగానే వుంటుంది. కానీ... దాన్ని అవమానంగానో, ధిక్కారంగానో, పరువునష్టంగానో భావించడం సహృదయత లోపించడమే. చమత్కారం, ఛలోక్తి, జోకు, హాస్యోక్తి, చతురోక్తి వంటివాటికి ఏ పేరు పెట్టినా... జీవితంలో హాస్యరసాన్ని చిలికించేవారు మనకు అరుదుగా కనిపిస్తూంటారు. ధీరగంభీరులూ, తాత్త్వికులైన వారు సైతం ఏదోక సందర్భంలో వికసించిన నవ్వు ముఖంతో కనిపించక మానరు. శ్రీశ్రీ వంటి మహాకవిని విమర్శకులు 'విదూషకుడు' అని ఆడిపోసుకోవడం వెనక ఆయనలోని వ్యంగ్య లక్షణాలను కారణంగా చూపించారు. చమత్కారమంటే... ఓ సరదా ప్రశ్నకు అంతకంటే సరదాగా.. ఇంకాస్త లోనికి వెళుతూ జవాబివ్వటం. సాహిత్యంలోనూ ఇది ఎంతో ప్రసిద్ధిగాంచిన ప్రక్రియ. ఒకరినొకరు నొప్పించుకోడానికో... లేక ఇబ్బంది పెట్టడానికో కాక హాస్య చతురతతో తరతరాలకు వారసత్వ సంపదగా

ఉపయోగపడుతుంది. ఈ హాస్య ప్రక్రియ రూపాలు మార్చుకుంటూ.. వెటకారం, ఎగతాళి కూడా సాధారణ విషయాలైపోయాయి. హేళన చేయడం కూడా అందులోని భాగమే అనుకునేంతగా మారిపొయ్యాయి. ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తోన్న జన్మభూమి కార్యక్రమంలో 'రాష్ట్రాన్ని బోల్డంత అభివృద్ధి చేశాను. ఓట్లు వేయకపోతే ప్రజలే సిగ్గుపడాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించడం కూడా ఒక చమత్కారంగా మారిపోయింది. ఆయన అనుకూల మీడియా సంస్థలు 'సరదాగా చమత్కరించారు' అంటూ ముక్తాయింపు నిచ్చారు. కోపం, ఏడుపు, ప్రేమ, భయం, సిగ్గు- ఇటువంటి భావోద్వేగాలు మనలను ఆవరించినపుడు మాటలు రావు. వచ్చిన మాటలు కూడా సహేతుకంగా ఉండవు. ఎందుకంటే ఆ సమయాల్లో ఆలోచన ఉండదు... ఉద్వేగమే తప్ప. మనం మాట్లాడే మాటల్లోని చెణుకు, హాస్యోక్తి చతురత చురుక్కుమని గిలిగింతలు పెట్టాలే తప్ప... కలుక్కుమని గాయపరచ కూడదు. చక్కని సంభాషణా చాతుర్యం గల వారి సమక్షాన్ని, స్నేహాన్ని అందరూ ఆపేక్షిస్తారు.

ఇదీ విషయం




హిందుత్వ'పు అంధత్వమే
కాషాయపు క్రూరాకృతి...
నడుస్తున్న చరిత్రంత
దళితులపై దమన నీతి!

మనిషిని ప్రేమించడమే
ప్రకృతి నేర్పిన తత్వం...
రక్తమంత ఒక్కటేగ
ఎందుకింత నీచత్వం!

- కొల్లూరు వెంకట్

విశ్లేషణ

రాజకీయ తెరపై రజనీబాబా



తెలకపల్లి రవి

ఇప్పటికి 175 చిత్రాల్లో నటించి దక్షిణ భారత దేశంలో శిఖరాగ్ర కథానాయకుడుగా వున్న రజనీకాంత్ ఒక చిత్రంలో 'నేను ఒక్కసారి చెబితే వందసార్లు చెప్పినట్టే' అంటారు. రాజకీయ రంగంలో మాత్రం వంద రకాలుగా మాట్లాడి చివరకు ఏడాది ముగింపు రోజున రాజకీయ రంగంలో ప్రవేశిస్తున్నట్టు ప్రకటించారు. స్వంత పార్టీని పెడతాననీ మొత్తం 234 స్థానాల్లో పోటీ చేస్తాననీ వెల్లడించారు. అవినీతిపై పోరాటం, వాగ్దానాల అమలు ప్రధానాంశాలుగా 'ఆధ్యాత్మిక రాజకీయాలు' నడుపుతానని కొత్త పదం తీసుకొచ్చారు. తన పార్టీ గుర్తుగా తను నటించిన 'బాబా' చిత్రం బొమ్మ తీసుకున్నారు. రాష్ట్రం గురించి తప్ప దేశం గురించి మాట్లాడలేదు. పార్లమెంటు ఎన్నికలపై ఆలోచిస్తానని మాత్రమే అన్నారు. తన పార్టీకి కార్యకర్తలు వుండరనీ, స్వయం సేవకులు (వలంటీర్లు) వుంటారని మరో మాట చెప్పారు. ఒకో నియోజకవర్గంలో కోటి రూపాయలు ఖర్చు పెట్టుకోగలిగిన వారు అభ్యర్థులుగా ముందుకు రావాలని ఆయన అన్నట్టు వార్తలు వచ్చాయి. ఒకో దానిలో కనీసం 25 మంది వీరాభిమానులు వుండే యాభై వేల అభిమాన సంఘాలు రజనీ కొత్త పార్టీకి పునాదిగా వుండబోతున్నాయని తెలుస్తుంది.

ఇరవై ఏళ్ల కిందటే రాజకీయాల్లోకి వచ్చేశానంటున్న రజని 1996లో ఆయన అప్పటి ముఖ్యమంత్రి జయలలితను ఓడించాలని పిలుపునివ్వడం ద్వారా పరోక్షంగా డిఎంకె విజయానికి దోహదం చేశారు. 1998 లోనూ, 2001 లోనూ అదే పిలుపునిచ్చినా జయ గెలిచారు. అప్పటి నుంచి రాజకీయాల్లోకి ఇదిగో వస్తారు అదిగో వస్తారని అంటున్నా ఇప్పటికి గాని వాస్తవం కాలేదు. రజని సమకాలికుడైన కమల్ హాసన్ కాస్త ముందుగానే రాజకీయ ప్రవేశం ప్రకటించారు గాని ఇంకా స్పష్టమైన సంస్థాగత ప్రకటన రాలేదు. కర్ణాటకలో నటుడు ఉపేంద్ర అన్ని చోట్లా పోటీ చేస్తానని చెప్పేశారు. ఎపిలో పవన్ కళ్యాణ్ 2014లోనే జనసేనగా టిడిపి బిజెపిలను బలపర్చి గత ఏడాదిగా సమస్యలపై తనదైన శైలిలో పర్యటనలు, వ్యాఖ్యలు చేస్తున్నారు. మరో నటుడు ప్రకాశ్ రాజ్ 'గౌరీ లంకేశ్ హత్య'ను ఖండించిన తర్వాత అనేక వ్యాఖ్యలతో రాజకీయ కోణాలు వెల్లడిస్తున్నారు. ఇప్పుడు రజని రంగ ప్రవేశంతో వారి అవకాశాల పైనా దృష్టి పెరిగింది.

తమిళనాడులో కరుణానిధి, ఎంజిఆర్, శివాజీ గణేశన్, జయలలిత, భాగ్యరాజా, శరత్ కుమార్, విజయకాంత్, విశాల్, కుష్బూ వంటి చాలా మంది తమ తమ జయాపజయాలతో రాజకీయ పాత్రలు పోషించిన వారే. కరుణ, ఎంజిఆర్, జయలలితలు దీర్ఘకాలం పాటు ముఖ్యమంత్రులుగా వెలిగారు. తమిళనాడుకే స్వంతమైన మరో ప్రత్యేకత ఏమంటే ఇప్పటికి అర్ధ శతాబ్దిగా అక్కడ ఏ జాతీయ పార్టీ విజయం సాధించింది లేదు. హేతువాద బ్రాహ్మణేతర ఉద్యమ పునాదులపై పెరిగిన ద్రావిడ పార్టీలే పాలన చేస్తున్నాయి. 1916 నవంబరులో పెరియార్ ఇవి రామస్వామి నాయకర్ తదితరుల నాయకత్వంలో ఏర్పడిన సౌత్ ఇండియన్ లిబరల్ ఫెడరేషన్ (ఎస్ఐఎల్ఎఫ్), ఉత్తరోత్తరా జస్టిస్ పార్టీ దీనికి పునాదులు వేశాయి. పెరియార్ రాజకీయాలు వద్దనడంతో అన్నాదురై డిఎంకెను స్థాపించి కాంగ్రెస్‌ను ఎదుర్కొన్నారు. 1953లో ఎంజిఆర్ కాంగ్రెస్ నుంచి డిఎంకె లోకి వచ్చారు. అప్పటి డిఎంకె సభల్లో ఎంజిఆర్, కరుణానిధి ఆకర్షణగా వుండేవారట. 1967లో ముఖ్యమంత్రి అయిన అన్నాదురై 1969లో మరణించగా కరుణానిధి ఆ స్థానంలోకి వచ్చారు. ఆ దశలో హిందీ రుద్దడానికి వ్యతిరేకంగానూ కేంద్రం పెత్తనానికి నిరసనగానూ బలమైన పాత్ర పోషించారు. 1972 నాటికి ఎంజిఆర్‌తో విభేదాలు పెరిగి ఆయనను బహిష్కరించడంతో అన్నా డిఎంకె ఏర్పాటు చేశారు. 1977లో అధికారంలోకి వచ్చారు. మరో అయిదేళ్లకు జయలలిత ప్రవేశించారు. ఇప్పటి వరకూ 26 ఏళ్లు అన్నా డిఎంకె, 12 ఏళ్లు డిఎంకె పాలించాయి. ద్రవిడ రాజకీయాలతో పాటు విస్తార సంక్షేమ పథకాలు వారి రాజకీయ సంస్కృతిలో భాగంగా మారాయి. మరోవైపున అవధులు లేని అవినీతి, అవతలి వారి ఉనికిని సహించలేని అసహనం కూడా తిష్ట వేశాయి.

జయ మరణంతో రాజకీయ శూన్యం ఏర్పడింది గనక రజనీకాంత్‌కు అవకాశముంటుందని, నిజానికి ద్రావిడోద్యమ అనంతర దశ ప్రారంభం అవుతుందని చెప్పడం వూహే తప్ప ఆధారం లేదు. ఆధ్యాత్మిక రాజకీయాలు అన్న మాట బిజెపి సంఘ పరివార్ రాజకీయాలను తలపించడం వాస్తవం. రజనీ ప్రకటన ఏ ఒక్కరి కన్నా మాకే దగ్గరగా వుందని ఆరెస్సెస్ సిద్ధాంత కర్త గురుమూర్తి చెప్పేశారు కూడా. 'మెర్సెల్' సినిమా విషయంలో తప్ప ఆయన లౌకిక ప్రజాస్వామిక భావాలు వెలిబుచ్చింది లేదు. ఈ విషయంలో కమల్ హాసన్ వంటి వారు మెరుగ్గా వున్నా రాష్ట్రంలో వారు వామపక్ష భావాలకు దగ్గరగా వున్నట్టు మీడియా చెబుతున్నది పాక్షిక సత్యం.

ఈ ప్రకటనకు ముందే ఆర్కే నగర్ ఉప ఎన్నికల్లో స్వతంత్రుడుగా పోటీ చేసిన శశికళ బంధువు దినకరన్ ఘన విజయం రజనీ వంటి వారిని హతాశులను చేసింది. అనేక ఆరోపణల వూబిలో కూరుకుని జైలుకు కూడా వెళ్లివచ్చిన దినకరన్ చేతిలో డిఎంకె ఓడిపోవడమే గాక మొదటి సారి చెన్నై పరిధిలో డిపాజిట్ కూడా తెచ్చుకోలేకపోయింది. ప్రస్తుత పరిస్థితుల్లో డిఎంకె గెలుపు నల్లేరు మీద బండి అనుకున్నది తలకిందులైంది. ఓటర్లు డిఎంకెను తిరస్కరించడం రజనీకాంత్‌లో ఆశలు పెంచి వుండొచ్చు. కాని ఆ తీర్పులో ప్రధాన కోణం కేంద్ర బిజెపి కుట్రల పట్ల ఆగ్రహం. మొదట శశికళను తర్వాత పన్నీరు సెల్వంను ఆపైన పళనిస్వామిని ఇలా రకరకాలుగా వ్యూహం మారుస్తూ తమ పట్టు పెంచుకోవడానికి బిజెపి ప్రయత్నించడం రాష్ట్ర ప్రజలకు రుచించలేదు. మరి ఇప్పుడు రజనీకాంత్ కూడా అదే బిజెపితో మంచిగా వుండాలనుకుంటే ప్రజలు హర్షిస్తారా అనేది ప్రశ్న. తమిళనాడులో ఓట్లు, సీట్లతో నిమిత్తం లేకుండా వామపక్షాలు, సామాజిక న్యాయ శక్తులు పోరాడుతూనే వున్నాయి. రజనీ ప్రకటనలో ఆ వూసే లేదన్న విమర్శ కూడా వుంది. రెండేళ్ల కిందట వరదలు వస్తే చిన్న చితక నటుల కన్నా రజని ఇచ్చిన విరాళం తక్కువగా వుండటంపైనా విమర్శలు వచ్చాయి.

మొదట శశికళను తర్వాత పన్నీరు సెల్వంను ఆపైన పళనిస్వామిని ఇలా రకరకాలుగా వ్యూహం మారుస్తూ తమ పట్టు పెంచుకోవడానికి బిజెపి ప్రయత్నించడం రాష్ట్ర ప్రజలకు రుచించలేదు. మరి ఇప్పుడు రజనీకాంత్ కూడా అదే బిజెపితో మంచిగా వుండాలనుకుంటే ప్రజలు హర్షిస్తారా అనేది ప్రశ్న.




ఎంజిఆర్, జయలలిత వంటి వారికే ఓట్ల శాతం 33-38 మధ్యనే వుంటూ వచ్చింది (ఒక్కసారి తప్ప). దాని కోసం ఎంజిఆర్ చిత్రాలలోనూ బయిట కూడా ఎన్నో జాగ్రత్తలు తీసుకునేవారు. మేకప్ లేకుండా ఒక్కసారి కూడా కనిపించేవారు కాదు. చిత్రాలలో ఆయన పాత్రలు కూడా ఎలాంటి వ్యస నాలు గాని అమ్మాయిల వెంటపడి కలలు గనడం గాని చేయవు. ఒక ముసలి రోగిష్టి తల్లి పాత్రతో సెంటిమెంటు తప్పనిసరి. వీలైనప్పుడల్లా పేదల గురించి డైలాగులుంటాయి. ఈ విధంగా తనను తల్చుకోగానే ఒక సజ్జన నాయకుడు గుర్తుకు వచ్చేలా ఎంజిఆర్ శ్రద్ధ తీసుకున్నారు. పదవిలోకి రాకముందే పేదలకు దాన ధర్మాలు చేస్తూ ముఖ్యమంత్రి అయ్యాక సంక్షేమ పథకాలపై శ్రద్ధ పెట్టారు. ఎంజిఆర్‌ను మించిన రాజకీయ సంచలన విజయం సాధించిన ఎన్టీఆర్ సంక్షేమ వాగ్దానాలు చేయడం వెనక సత్యమిదే. అయితే పాత్రల పరంగా మాత్రం ఎన్టీఆర్ అన్ని రకాలవీ పోషించారు. నిజానికి ఆయనకు కృష్ణుడే గాక దుర్యోధన, రావణ వంటి ప్రతికూల పాత్రలు గొప్ప పేరు తెచ్చాయి. ఏమైనా ఈ ఇద్దరి విజయాలతో దక్షిణాదిన సినీ రాజకీయ రంగాల కలయిక స్థిరపడింది. ఆ కోవలో చిరంజీవి మరో ప్రయోగం చేసి చివరకు కాంగ్రెస్‌లో కలిశారు.

రజనీ పాత్రలు కూడా ఎంజిఆర్‌తో పోలిస్తే చాలా తేడాగా వుంటాయి. దూకుడుతో పాటు స్టైల్ ప్రధానంగా చూపిస్తూ రజని ప్రేక్షకులకు దగ్గరయ్యారు. తను ఒక నటుడుగా కన్నా స్టైల్‌నే గుర్తు చేస్తాడు. ఆయన రాజకీయాల్లోకి రావడం అంటే ఈ అవాస్తవ ఇమేజీతో భ్రమలు పెంచడమే నని కొందరి వాదన. ఇది సినిమా ప్రమోషన్‌కు అనేవారూ వున్నారు. అందుకు తగినట్టే ఇప్పుడు ఆయన '2.0' సినిమా రావలసి వుంది కూడా. నిజానికి అలాటి వ్యాఖ్యలే పవన్ పైనా వున్నాయి గాని తను ఏదో మేరకు ప్రజల్లో సంచరిస్తూ సమస్యలు తెలుసుకుంటున్నారు. మోడీని ముందే బలపర్చినా ప్రధాని అయ్యాక పవన్ కలిసింది లేదు. రజని మాత్రం అవకాశం దొరికితే మోడీని కీర్తిస్తుంటారు. ఇవన్నీ తేడాలు. తమ పార్టీలో చేరాలనే బిజెపి వత్తిడి తట్టుకోలేకే ఆయన రాజకీయాల్లోకి వచ్చారని ఒక వాదన వుంది. జయలలిత మరణం తర్వాత ధనాఢ్య వర్గాలు ఆయనకు బాగా మద్దతు ఇవ్వడమే గాక వనరులు సమకూర్చడానికి కూడా సిద్ధంగా వున్నాయట.


ఘన విజయం తర్వాత, మూడు మాసాల్లో ప్రభుత్వాన్ని పడగొడతానని చెప్పిన దినకరన్ ఏం చేస్తారనేదానిపై తదుపరి ఘట్టం ఆధారపడి వుంటుంది. అనర్హత వేటు పడిన ఆయన అనుయాయులైన 18 మంది ఎంఎల్ఎలపై హైకోర్టు జనవరి 9న తీర్పు నిస్తుంది. ఆ తీర్పునుబట్టి ఇతరులు బయిటకు వస్తారా లేదా అనేది తేలిపోతుంది. వారు బయిటకు వస్తేనే ప్రభుత్వం పడిపోయి శాసనసభ ఎన్నికలు వస్తాయి.. లేదంటే 2019 లోక్‌సభ ఎన్నికలే బల పరీక్షకు సందర్భమవుతాయి. రజని అప్పుడేం చేస్తారన్నది కూడా అస్పష్టమే. ఇప్పుడు ఆయన చేసిన ప్రకటన కథ మధ్యలో విశ్రాంతి వంటిది తప్ప పతాక సన్నివేశం కాదు. మొత్తం పరిణామాలూ సమీకరణాలు స్పష్టమైతే గాని భవిష్యత్తును అతిగా వూహించడం వల్ల ప్రయోజనం వుండదు.అందుకే ప్రముఖ మీడియా వ్యాఖ్యాతలూ మేధావులు కూడా రజనీ రాకడపై ఆచితూచి స్పందిస్తున్నారు. ఆయన తదుపరి అడుగు ఎలా వుంటుందో చూద్దాం. అలాగే ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్‌ను ప్రత్యేకంగా కలసి ప్రశంసలు కురిపించిన పవన్ కళ్యాణ్ విషయమైనా వేచి చూడవలసిందే. కెసిఆర్ చేసే మంచి పనులను ప్రధాని మోడీ దృష్టికి తీసుకువెళతానని ఆయన చెప్పారట. మరి ఇద్దరు చంద్రులనూ మోడీని కూడా సానుకూలంగా చూసేట్టయితే ఆయన ఎవరిపై పోరాడతారనే ప్రశ్న వస్తుంది. తారామయ రాజకీయంలో పతాక సన్నివేశం ఎలాగైనా వుండొచ్చు.

సోషల్ మీడియా

నాకనిపిస్తుంది...!



నాకనిపిస్తుంది...!
తెల్ల దొరతనం పోయి..నల్ల దొరతనం వచ్చిందని.
నాకనిపిస్తుంది...!
స్వదేశీకరణ పోయి..విదేశీకరణ వచ్చిందని.
నాకనిపిస్తుంది...!
భిన్నత్వంలో ఏకత్వం పోయి..ఏకత్వమే మిగులుతుందని.
నాకనిపిస్తుంది...!
లౌకిక భావాలు పోయి..హిందూ అస్థిత్వ భావాలు రుద్దబడుతున్నాయని.
నాకనిపిస్తుంది...!
న్యాయం అందరికి పోయి..
కొందరికి చుట్టం అవుతుందని.
నాకనిపిస్తుంది...!
పేదల సొమ్ము...పెద్దలకు దోచిపెట్టబడు తుందని.
నాకనిపిస్తుంది...!
కార్మిక చట్టాలు పోయి..కార్పొరేట్ చట్టాలు వస్తున్నాయి.
నాకనిపిస్తుంది...!
రాజకీయాలను తెల్ల డబ్బు పోయి..నల్ల డబ్బు శాసిస్తుందని.
నాకనిపిస్తుంది...!
మనుషులు రక్షణ పోయి..గోరక్షణ చేయబడుతుందని.
నాకనిపిస్తుంది...!
పొరుగు దేశాలతో స్నేహం పోయి..ఘర్షణలు పెరిగాయని.
నాకనిపిస్తుంది...!
రాజ్యాంగాన్ని ఇక ఉంచరని..దాన్ని
మనుస్మృ తిగా మార్చేస్తారని.
నాకనిపిస్తుంది...!
నా సమాజం ఈ పరిణామాలు చూసి ఏడవడం మాని.. ఎదిరిస్తుందని.
(రచయిత ఎవరో కానీ ... వాట్సప్ లో హల్‌చల్ చేస్తున్న కవిత)



స్వర్ణాంధ్ర చూడాలి



(కోర్టులో ఒక ఖైదీకి జడ్జి ఉరిశిక్ష వేసారు)

జడ్జి : మిస్టర్... నీ ఆఖరి కోరిక ఏమిటి చెప్పండి ?

ఖైదీ : ప్రపంచ స్థాయి రాజధాని అమరావతి, స్వర్ణాంధ్రప్రదేశ్ చూడాలని ఉంది.....

జడ్జి : ఎవరక్కడ...ఇతని ఉరిశిక్ష రద్దు చేస్తున్నాను. మన నేతలు స్వర్ణాంధ్ర సాధించాకే శిక్ష అమలు చేద్దాం.

ఖైదీ : ధన్యవాదాలు జడ్జి గారూ.

జన వాక్యం

నైతిక విలువలు ముఖ్యం



నేటి మన విద్యా విధానం చూస్తుంటే భవిష్యత్తుపై భయం వేస్తోంది. ఎంత సేపటికీ నాలుగు గోడల మధ్య విద్యార్థులను నలుపుతూ సృజన, ప్రతిభ పక్కన పెట్టి కేవలం బట్టీ చదువుల వేటలో, మార్కుల పోరాటంలో వారిని హింసించే కార్యక్రమం జరుగుతోంది. కొఠారి కమిషన్, ఈశ్వరీబాయి కమిటీ, మొదలగు వాని సిఫార్సులన్నీ కింది స్థాయిలో అమలు జరగడం లేదు. ప్రభుత్వాలు ఎన్ని మారినా ప్రయివేటు విద్యాసంస్థల్లో మాత్రం ఎటువంటి మార్పు తేలేకపోతున్నాయి. విద్యార్థులను నైతిక విలువల వైపు పయనించేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై వుంది. సమాజంలో వారినీ భాగస్వాములను చేయాలి.

శేషసాయి,
ఇమెయిల్ ద్వారా.


వ్యాసాలు, ఉత్తరాలు పంపించాల్సిన చిరునామా
editpageps@gmail.com

సందర్భం

కుప్పకూలిన శరీరం-నింగి దాటిన జ్ఞాన శిఖరం!

'**అ**ర్థమయ్యేట్లు చెప్పాలంటే అసలు దేవుడు లేడు. ఈ విశ్వాన్ని ఎవరూ సృష్టించలేదు. నేను ప్రగాఢంగా విశ్వసించేదేమంటే, స్వర్గ నరకాలు లేవు. మరణానంతర జీవితం కూడా లేదు. అద్భుతమైన ఈ విశ్వ రహస్యాల్ని తెలుసుకోవాలంటే మనకు ఉన్నది ఒక్క జీవితం మాత్రమే'-అని అంత బలంగా చెప్పిన డాక్టర్ స్టీఫెన్ హాకింగ్‌కు ఆ ఒక్క జీవితం కూడా ఎంతో దారుణంగా గడపాల్సి వచ్చిందని చాలా మందికి తెలిసి వుండకపోవచ్చు. ఆయన తన గురించి ఇలా చెప్పుకున్నారు. 'నా శరీరం నిస్సత్తువగా కుర్చీలో కూలబడి పోవచ్చు. కానీ, నా మెదడు విశ్వాంతరాళాల్ని శోధిస్తుంది'-అని ఎంతో ఆత్మ విశ్వాసంతో చెప్పుకున్న భౌతిక శాస్త్రవేత్త హాకింగ్.





డా॥ దేవరాజు మహారాజు

1942 జనవరి 8న ఇంగ్లండులోని ఆక్స్‌ఫర్డ్‌లో జన్మించిన హాకింగ్ ముప్పయ్యేళ్లు కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పని చేసి, పదవీ విరమణ చేశారు. హాకింగ్ తల్లి బ్రిటీష్ కమ్యూనిస్ట్ పార్టీ సభ్యురాలు. అందువల్ల స్టీఫెన్‌కు చిన్నప్పటి నుండి ప్రగతిశీల భావాలు అబ్బాయి. తండ్రి ఫ్రాంక్ మెడికల్ డాక్టరు, పరిశోధకుడు. విద్యార్థి దశలో పరిచయమైన జేన్ వైల్డ్‌తో పరిచయం ప్రేమగా మారి పెళ్లి చేసుకున్నాడు. అప్పటికే అతనికి మోటార్ న్యూరోసిస్ వ్యాధి సోకింది.

ఫైనల్ ఇయర్‌లో ఉండగా స్టీఫెన్‌లో ఎఎల్ఎస్ వ్యాధి లక్షణాలు కనిపించాయి. ఇది ఒక మోటార్ న్యూరాన్ వ్యాధి. ఈ వ్యాధి బయట పడినప్పుడు ఆయన కేవలం రెండు సంవత్సరాలు మాత్రమే బతకగలడని డాక్టర్లు చెప్పారు. అంటే ఆయన తన 23వ యేట చనిపోవాల్సింది. కానీ ఇప్పుడాయన వయసు 76.

బ్లాక్ హోల్స్‌పై పరిశీలనలు చేస్తున్న సమయంలోనే 1965లో గాన్‌విల్లి కైస్ కాలేజీవారి ఫెలోషిప్ దొరికింది. దాంతో అప్లయిడ్ మాథమెటిక్స్, థియరటికల్ ఫిజిక్స్-కాస్మోలజీలో పిహెచ్‌డి తీసుకున్న స్టీఫెన్, మొదట్లో క్లచస్ ఉపయోగిస్తూ మెల్లగా నడిచేవారు. హాకింగ్ తన శారీరక లోపాల గురించి ఎవరితోనూ ఎక్కువగా చర్చించేవారు కాదు. విధి రాత, దైవం వంటి వాటిని నమ్మేవారు కాదు-కాబట్టి వాస్తవ స్థితి ఎదుర్కోవడానికి సిద్ధపడేవారు. తన వైకల్యానికి సానుభూతి ప్రకటిస్తూ సహాయపడడానికి వచ్చే వారిని వారించేవారు. ఆయన తనను మొదట సైంటిస్ట్‌గా గుర్తించాలనుకునే వారు. తరువాత పాపులర్ సైన్స్ రచయితగా, ఆ తరువాత కొన్ని ఆలోచనలతో, భావాలతో, ఆశలతో, కోర్కెలతో ఉన్న ఒక మామూలు మనిషిగా గుర్తించాలని కోరుకునే వారు. 'ఆయనది గొప్ప ధ్యేయమని' కొందరంటే-'పిచ్చి పట్టుదల' అని మరి కొందరనే వారు.

భౌతిక శాస్త్రవేత్త వెర్నర్ ఇస్రయిల్ 'మోజట్ కంపోజింగ్ సింఫనీ' తెచ్చి స్టీఫెన్ తలకు అమర్చాడు. దాని వల్ల ఆయనకు తనను తాను వ్యక్తీకరించుకునే అవకాశం కలిగింది. దాన్ని అభ్యసించడానికి ఆయనకు కొంత సమయం పట్టినా, తర్వాత కాలంలో అది ఎంతో ఉపయోగపడుతూ వచ్చింది. 1970 నాటికి మాట పూర్తిగా పడిపోయింది. అతని హావభావాలు కుటుంబ సభ్యులకు, అతి సన్నిహితులకు మాత్రమే అర్థమయ్యేవి. 1985లో ఆయనకు నిమోనియా పట్టుకుంది. తీవ్ర అస్వస్థత ఎదుర్కోవాల్సి వచ్చింది. ఫలితంగా ట్రాఖియోటొమి వచ్చింది. దాంతో ఇరవై నాలుగు గంటలూ వైద్య పర్యవేక్షణలోనే ఉండేవారు.

ఆ దశలో అమెరికన్ ఫౌండేషన్ ముందుకొచ్చి ఖర్చు భరించింది. మూడు షిఫ్టుల్లో నర్సుల్ని ఏర్పాటు చేసి పర్యవేక్షించారు. కంప్యూటర్ ఇంజనీర్ డేవిడ్, ఒక చిన్న కంప్యూటర్‌ని స్టీఫెన్ హాకింగ్ వీల్‌ఛైర్‌కు అమర్చాడు. అందులోని సింథసైజర్ విషయాన్ని మాటగా మార్చి ఎదుటి వారికి వినిపిస్తుంది. అందుకోసం తన గొంతునే వాడమన్నాడు స్టీఫెన్. మాట పడిపోక ముందున్న తన గొంతు ధ్వనిని అందులో ఉపయోగించమన్నాడు. దాని వల్ల స్టీఫెన్ హాకింగ్ సాంకేతిక సంభాషణ సహజ సంభాషణలా మారిపోయేది.

స్పెల్లింగ్ కార్డ్ మీద అక్షరాల్ని ఎంపిక చేసుకోవడానికి మొదట ఆయన తన కనుబొమలు కదిలించేవారు. తర్వాత 1986లో 'ఈక్వలైజర్' కంప్యూటర్ ప్రోగ్రాం ద్వారా అమర్చిన సాఫ్ట్‌వేర్ వల్ల 2,500-3,000 వరకు అక్షరాలు, పదాలు, వాడుక మాటలు అన్నీ ఒక చిన్న మీట నొక్కితే అందుబాటులోకి వచ్చే విధంగా ఉండేవి. నిమిషానికి పదిహేను పదాలు టైపు చేయగల సామర్థ్యం ఆ సాఫ్ట్‌వేర్‌కి ఉండడం వల్ల, ఆయన ఉపన్యాసాలు, వ్యాసాలు, రచనలు అన్నీ తయారవుతూ ఉండేవి. ఉపన్యసించాల్సిన చోట ఆ విషయాల్ని ముందుగానే స్పీచ్ సింథసైజర్‌కు పంపి సిద్ధంగా ఉంచుకొనేవారు. దీంతో అక్కడ ఆయనే స్వయంగా మాట్లాడుతున్నట్లు ఉండేది. స్టీఫెన్ హాకింగ్ కేవలం మనిషి ఆత్మ విశ్వాసాన్ని నమ్మిన శాస్త్రవేత్త. మేధావి. ఆయనను కాపాడుకోవడానికి కుటుంబమే కాదు సమాజమే కదిలి వచ్చింది. మనిషి కోసం మనుషులు కదిలి వచ్చి నట్టయ్యింది. అంతటి దయనీయ స్థితిలో కూడా ఆయన దేవుణ్ణి తలవలేదు. ముడుపులు కట్టలేదు. పైగా 'వైజ్ఞానిక శాస్త్ర పరిశోధనల్లో దేవుడి ప్రమేయమే లేద'ని అన్నారు. మనిషి చేస్తున్న ఆవిష్కరణలు, సాధిస్తున్న విజయాలు-లేని దేవుడి-ఖాతాలో వేస్తూ బతికే పలాయన వాదులున్నంత కాలం మార్పు రాదు. ఈ విషయం చెప్పడానికే స్టీఫెన్ హాకింగ్ శారీరక బలహీనత గూర్చి, ఆయన అచంచల ఆత్మ విశ్వాసం గూర్చి ఇక్కడ వివరించాను. 2005లో ఆయన తన పరికరం వాడడానికి చెంప కండరాలు కదిలించేవాడు. నిమిషానికి అది ఒక పదం మాత్రమే తీసుకునేది. అది ఇబ్బందిగా అనిపించడం వల్ల ఇన్‌టెల్ పరిశోధకుల సహకారంతో లండన్‌లోని షిఫ్ట్ కీ కంపెనీ ముందుకొచ్చింది. అంతకు ముందు స్టీఫెన్ హాకింగ్ రాసిన పరిశోధనా పత్రాల్లోని పదాల్ని, వాక్యాల్ని, విషయాల్ని తరచుగా వాడే వాడుక మాటల్ని అది గుర్తుపెట్టుకొని టైప్ చేసేది ఈ పద్ధతి మనం రోజూ వాడే స్మార్ట్ ఫోన్‌లలో కూడా చూస్తున్నాం.

2009 నాటికి ఆయన తన వీల్ ఛైర్‌ను నడుపుకోలేని స్థితి వచ్చింది. మళ్లీ హాస్పిటల్లో కూడా చేరాల్సి వచ్చింది. అలాంటి స్థితిలో కూడా ఆయన మానవ జాతి గురించే ఆలోచించారు. 'రాజకీయంగా, సామాజికంగా, పర్యావరణపరంగా ధ్వంసమౌతున్న ఈ సమాజంలో మానవజాతి మరో వందేళ్లు కొనసాగేదెట్లా?' అని బెంగ పెట్టుకున్నారు. యవ్వన దశలోనే వైద్యపరమైన శారీరక సమస్యలకు గురైన స్టీఫెన్, తన జీవితంలో నిశ్శబ్దంగా అనేక పోరాటాలు చేస్తూ వచ్చారు. నిస్సత్తువగా మారిన తన శరీరంతో తాను పోరాడుతూ, జ్ఞాన కాంక్ష కోసం పోరాడుతూ, డెబ్భై ఆరేళ్ల వయసులో కూడా అచంచల ఆత్మవిశ్వాసంతో ఒక జ్ఞాన శిఖరంగా నిలబడడం ఆయన ప్రత్యేకత! మెదడు ఒక్కటి తప్ప మిగతా శరీరమంతా కుప్పకూలి ఉన్న హాకింగ్, తన ధ్యేయాన్ని క్షణ కాలమైనా మరువ లేదు. విశ్వ విజ్ఞానానికి తన వంతుగా కొత్త విషయాలను అందిస్తూనే వచ్చారు.

మృత్యువు అంచుమీద శ్వాసిస్తూ కూడా, మనిషి విజయ పరంపర గూర్చి మాత్రమే ఆలోచించారు డా॥ స్టీఫెన్ హాకింగ్. ఒక రకంగా చెప్పాలంటే ఆరోగ్యంగా కనిపిస్తున్న దుర్బలులైన కోట్లాది జనం కంటే హాకింగ్ దృఢ సంకల్పుడు. మానసిక బలశాలి. ఆయన ఆకాశమే హద్దు అనుకోలేదు. ఆ ఆకాశాన్ని ఇంకొంచెం పైకి ఎదగమని ..విసరకనే సవాల్ విసిరారు!

రేపు డా॥ స్టీఫెన్ హాకింగ్ పుట్టినరోజు

(రచయిత సుప్రసిద్ధ సాహితీవేత్త, సైన్స్ ప్రొఫెసర్ సెల్ : 9908633949)



ఈ కోసం



పాలు విరుగుతాయని అనుమానం వస్తే చిటికెడు వంట సోడా వేయండి.

అర్ధరాత్రి ఆడపిల్ల ఒంటరిగా తిరిగినప్పడే దేశానికి స్వాతంత్ర్యం వచ్చినట్లని గాంధీజీ చెప్పారు. కానీ నేటి స్త్రీ మాత్రం మిట్ట మధ్యాహ్నం ఒంటరిగా ఉండగలిగినా స్వాతంత్ర్యం లభించినట్లే. ఎందుకంటే పట్టపగలు, నలుగురూ పనిచేసుకుంటున్న స్థలంలోనే స్త్రీలు లైంగిక వేధింపులకు గురవుతున్నారు. బంగారు భవిష్యత్తును ఊహించుకుంటూ మంచి చదువులు చదువుకుని, కష్టపడి ఉద్యోగం చేసుకుంటుంటే.. కలలుగన్న అభివృద్ధిని సాధించాలని ప్రయత్నిస్తుంటే.. పనిచేస్తున్న చోటే.. అధికారాన్ని.. దర్పాన్ని ఆసరాగా చేసుకుని లైంగికంగా తెగబడుతున్నారు. పెద్దమనుషులనే ముసుగేసుకుని పాశవికంగా ప్రవర్తిస్తున్నారు. ఇటీవల గజల్ శ్రీనివాస్‌పై వచ్చిన ఆరోపణలే దీనికి సాక్ష్యం. ఈ కేసుకు సంబంధించిన ఆధారాలే దీన్ని నిరూపిస్తున్నాయి. దేశంలో ఇలాంటివి ఎన్నో... కొందరు బాధితులు ధైర్యంగా ముందుకొచ్చి పోరాడుతున్నారు. సమాజానికి ఓ విన్నపమూ చేస్తున్నారు. దీనిపైనే ప్రత్యేక కథనం 'జీవన'లో..

ఆమెకు అండగా..

గజల్ శ్రీనివాస్ అధికారం చెలాయిస్తున్న ఆలయవాణీ కేంద్రంలో ఇటీవల జరిగిన సంఘటన ఇది... ఆధ్యాత్మిక సేవలు అందించడానికి ఏర్పడిన సేవ్ టెంపుల్ సంస్థలో భాగంగా ఉన్న ఈ కేంద్రంలో 2017 జూన్ 3వ తేదీన రేడియో జాకీగా చేరింది ఆమె. సంస్థకు అంబాసిడర్‌గా ఉన్న గజల్ శ్రీనివాస్ అప్పటివరకూ అందరి దృష్టిలో గౌరవప్రదమైన వ్యక్తి. అయితే అతని పరిధిలో పనిచేసేవారికి అతనో రాక్షసుడు. ఇది అతనిలోని మరో కోణం. ఈ విషయం ఆమె చాలా తక్కువ సమయంలోనే తెలుసుకుంది. ఏదో ఒక పనిచెప్పి ఆమె ఒక్కతే కార్యాలయంలో ఉండేటట్లు చేయడం.. అసందర్భమైన మాటలు.. వెకిలి చేష్టలు చేసే అతని అసలు రూపాన్ని సమాజం ముందుంచింది. ఆ వీడియో క్లిప్పింగులు చూసిన ప్రజలంతా విస్తుపోయారు. అవి చూసిన మీడియాకూ మైండ్ బ్లాక్ అయ్యింది. పోలీసులు జాగ్రత్తగా పరిశీలించారు.. నిర్ధారించుకున్నారు.. నిర్ణయం తీసుకున్నారు. ఇప్పుడు సదరు పెద్దమనిషి గజల్ శ్రీనివాస్ కస్టడీలో ఊసలు లెక్కపెడుతున్నాడు. ఇలాంటి కథలు ఇంతకు ముందూ చాలానే ఉన్నాయి. ఇదంతా సరే, అసలు ఇలాంటి పరిస్థితిని గుర్తించడం, స్పందించడం గురించి స్త్రీలుగానీ, సమాజంగానీ తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తున్నారా? అంటే చాలా తక్కువనే చెప్పాలి.

నిజాన్ని దాచకూడదు

లైంగికంగా వేధించేవారి ప్రవర్తన చెడ్డదని తెలియడానికి పెద్దగా సమయం పట్టదు. అయితే అంతకుముందు అతని ద్వారా లైంగిక వేధింపులు ఎదుర్కొన్న వారెవ్వరూ అతని అసలు బుద్ధి బయటపెట్టకపోవడం వల్లే ఈ పరిస్థితి మరొకరి వరకూ వస్తుంది. అలాంటి సందర్భంలో ఉద్యోగం వదిలి వెళ్లిపోవడం మాత్రమే సమస్యకు పరిష్కారం అనుకోవడం పొరపాటే. అలా అనుకుంటే పెద్దమనుషుల ముసుగును తొలగించేదెవరు? అధికారం చేతుల్లో ఉంది గనుక బెదిరింపులకు పాల్పడడం సహజం. ఎటూ వెళ్లనీయకుండా బంధించడం, భవిష్యత్తు లేకుండా చేస్తాననీ, వేరే ఉద్యోగం రాకుండా చేస్తాననీ, దొంగతనం తదితర తప్పుడు కేసులుపెట్టి జైలుకు పంపుతాననీ బెదిరించడం సర్వసాధారణం. ఇలాంటి మాటలు చెబుతూనే అతను కోరికను తీర్చుకోవడానికి ఎంత కాలమైనా ఎదురుచూస్తాడు. కానీ ఆమెని తన పరిధి నుండి పారిపోకుండా కట్టడిచేస్తాడు. ఇలాంటి పరిస్థితుల్లోనే స్త్రీలు ఆత్మహత్య చేసుకోవడానికి సిద్ధపడతారు. దీనికి కారణం లేకపోలేదు. బయట పెద్దమనిషిగా వ్యవహరిస్తూన్న అతనిపై సదాభిప్రాయాన్ని తొలగించలేమనే అపనమ్మకం. అయితే "నేను పడిన హింస మరో అమ్మాయి పడకూడదు" అనే ఆలోచన వస్తే ఆ భయాలన్నీ పటాపంచలై ఆత్మస్థైర్యం నిలువెత్తున నిలుస్తుంది. సాక్ష్యాలతో అతని నిజస్వరూపం బయటపెట్టడానికి ఎంతటి సాహసానికైనా వెనుకాడరు.

సాక్ష్యాన్నైనా నమ్మండి

సాక్ష్యాలు కళ్ల ముందున్నప్పుడు న్యాయం జరుగుతుందని నమ్మాలి. అలా నమ్మింది కాబట్టే ఆ యువతి గజల్ శ్రీనివాస్ నిజస్వరూపం బయటపెట్టింది. "నేను ఇప్పుడు ఇంత ధైర్యంగా నిలబడటానికీ, చట్టం ముందు అందరూ సమానమేనని నమ్మకం కుదిర్చి, సహకరించిన పోలీసులేకారణం. వారికి నా సెల్యూట్!!" అంటున్న ఆమె మాటలు ఎందరికో స్ఫూర్తివంతం. అయితే ఇలాంటి పెద్దమనుషుల రాక్షసత్వం బయటపెట్టిన తర్వాతా కొందరు అభిమానుల పేరుతో బాధితులపైనే గురిపెడతారు. మాటలతో అనుమానిస్తూ అవమానిస్తారు. వీళ్లంతా సాక్ష్యాలను పరిశీలించకుండా మాట్లాడతారని అందరికీ తెలుసు. బలమైన సాక్ష్యం చూపించినప్పటికీ చాలామంది 'ఆయన ఇలాంటివాడు కాదు!' అని గట్టిగా దబాయిస్తారు. దీనివల్ల భవిష్యత్తులో మహిళలు తమపై జరిగే అఘాయిత్యాల్ని బయటకు చెప్పడానికి వెనకడుగేస్తారు. అలా మాట్లాడేవారికి ఇలాంటి పరిస్థితి రాకపోయి ఉండొచ్చుకానీ సాటి స్త్రీలూ అర్థం చేసుకోలేక పోవడం బాధితుల్ని మరింత బాధకు గురిచేస్తుంది.

సంఘటితం కావాలి

ఒక సెలబ్రిటీకి ఎంతమందైనా అభిమానులు ఉండొచ్చు. కానీ ఆ వ్యక్తి అమ్మాయిల్ని లైంగికంగా వేధిస్తున్నాడని తెలిసినప్పుడు.. అది ఆ అమ్మాయి చేస్తున్న తప్పుడు ప్రచారమంటూ.. అతన్ని వెనకేసుకు రావడం ప్రమాదం. దీనివల్ల జరిగే విపరిణామాలు భవిష్యత్తులో ఎందరో స్త్రీలను నిరాశావాదులుగా మారుస్తుంది. ఒకచోట పనిచేసేటప్పుడు అందరికీ ఒకే సమస్య వస్తే, కలిసి ఎదుర్కోవడానికి ముందుకొస్తారు. అదే ఒకరికి మాత్రమే సమస్య వస్తే మిగతావారు మనకెందుకులే అని మౌనంగాఉంటారు. అనుకుంటారు. ఇలాంటి పరిస్థితిలో మార్పు రావాలి. సాటి మహిళ వేదనను తోటివారంతా అర్థం చేసుకోవాలి. మానవత్వంతో సమాజమంతా ఇలాంటి స్త్రీలకు అండగా నిలవాలి. అప్పటివరకు ఎన్ని మహిళా సంఘాలు గొంతెత్తి పోరాడినా, స్త్రీ అభివృద్ధికి ఎందరు వేదికలపై హోరెత్తినా ఫలితం ఉండదు. నిజాన్ని నిర్భయంగా బయటపెట్టే స్త్రీలను ప్రోత్సహించాలి. వారి స్ఫూర్తితో మరింత మంది స్త్రీలు గౌరవనీయులనే ముసుగులో బతుకుతున్న కీచకుల నిజస్వరూపాన్ని బయటపెట్టాలి. ఈ సందర్భంగా గజల్ శ్రీనివాస్ బాధితురాలి మాటలే మనందరికీ కనువిప్పు కావాలి.

- జీవన డెస్క్



తెహల్కా ఎడిటర్ తరుణ్ తేజ్‌పాల్

ఎందరో బాధితులు

దేశంలో పెద్దమనుషులుగా పేరున్న చాలా మంది లైంగిక వేధింపుల కేసుల్లో ముద్దాయిలుగా ఉన్నారు. సంఘటనలు చెప్పుకుంటూ పోతే కోకొల్లలు. ప్రఖ్యాత 'తెహల్కా' వార్తాపత్రిక ఎడిటర్, జర్నలిస్టుగా సమాజంలో మంచి పేరున్న 50ఏళ్ల తరుణ్ తేజ్‌పాల్ పాశవిక చర్యలు అప్పట్లో బయటపడ్డాయి. అతనితో పనిచేసే జూనియర్ జర్నలిస్టును లైంగికంగా వేధించాడనే ఆరోపణలతో అరెస్ట్ చేశారు. ఈ కేసులోనూ తరుణ్ కొంతకాలంగా ఆమెకు పంపిన ఇ-మెయిల్స్ ఆధారమయ్యాయి. గోవాలో వార్తలు సేకరించడానికి వెళ్లిన వీళ్లు నివసించిన హోటల్ సిసిటీవీ ఫుటేజ్‌లూ ఈ కేసులో కీలకమయ్యాయి. నాలుగేళ్ల క్రితం నమోదైన ఈ కేసు ఇంకా కొనసాగుతూనే ఉంది. ఇక సినిమా పరిశ్రమలో ఇలాంటి వేధింపుల విషయం బహిరంగ రహస్యమే. ఇటీవల మళయాళం సినీ పరిశ్రమలో ప్రముఖ హీరో ఎదుర్కొన్న ఆరోపణలకు అక్కడి పరిశ్రమ మొత్తం విస్తుపోయింది. అంతెందుకు ఎంతో అభివృద్ధి చెందాయనుకునే హాలీవుడ్‌లోనే నటీమణులపై లైంగిక హింస కొనసాగుతూనే ఉంది. ఇందులో భాగంగానే 'మీ టూ' అనే క్యాంపెయిన్ ప్రారంభమై పెద్దఎత్తున కొనసాగుతోంది. ఈ వేదికను గమనిస్తే 'నేనూ ఇలాంటి లైంగిక హింసకు బాధితురాలినే' అంటున్న ఎందరో మహిళలు తారసపడతారు. అందులో సెలబ్రిటీల నుంచీ సామన్య మహిళలూ ఉన్నారు. విద్యార్థినులూ ఉన్నారు. మరి వీళ్లంతా చెబుతున్న మాట వాస్తవం కాదని అనుకోవడం సమంజసమేనా? దేశంలో ప్రతి పావుగంటకో స్త్రీ అత్యాచారానికి గురవుతుందనే వాస్తవం దాచిపెట్టగలమా?



జీవన సౌరభం

ఒకరికి మేలు చేసిన ఎప్పుడూ జ్ఞాపకం పెట్టుకోవద్దు. కానీ ఒకరు మనకు మేలు చేస్తే మాత్రం ఎప్పుడూ మరిచిపోవద్దు.

రమణుల రంగవల్లి




కె. దీపిక
కాశీబుగ్గ
శ్రీకాకుళం




15 చుక్కలు
మధ్యచుక్క
ఒకేవరుస
1వచ్చేవరకు



కె. విజయలక్ష్మి
జి.కొత్తపల్లి
అనంతపురం



27 చుక్కలు
9వరుసలు
9వచ్చేవరకు
సరిచుక్క



కె. దివ్య
లక్కవరపుకోట
విజయనగరం

18 చుక్కలు
2 వరుసలు
2 వచ్చేవరకు





కె. మంజుల
పామూరు
ప్రకాశంజిల్లా


30 చుక్కలు
4 వరుసలు
4 వచ్చేవరకు
సరిచుక్క

మా చిరునామా:
జీవన,'రమణుల రంగవల్లి', జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇమెయిల్: jeevanapageps@gmail.com
ఫోన్ నెం. 9490099006



తగ్గిన పసిడి ధర

న్యూఢిల్లీ : అంతర్జాతీయ బలహీన పరిణామాలకు తోడు స్థానిక వర్తకుల నుంచి పసిడికి డిమాండ్ పడిపోవడంతో ఈ లోహం ధర స్వల్పంగా దిగి వచ్చింది. శనివారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం, 99.5 శాతం స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.50 తగ్గి వరుసగా రూ.30,450, రూ.30,300గా పలికింది. ఇంత క్రితం సెషన్‌లో అపరంజి ధర రూ.135 పెరిగింది. కాగా కిలో వెండి ధర యథాతథంగా రూ.40,000గా నమోదయ్యింది. 100 వెండి నాణేల ధర రూ.73,000గా ఉంది. అంతర్జాతీయంగా న్యూయార్క్‌లో ఒక్క ఔన్స్ పసిడిపై 0.24 శాతం ధర తగ్గి 1,318 డాలర్లుగా నమోదయ్యింది.



క్రెడాయ్ ప్రాపర్టీ షో

రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ క్రెడాయ్ '6వ ఎడిషన్ హైదరాబాద్ ప్రాపర్టీ షో'ను నిర్వహిస్తున్నట్లు ప్రకటించింది. వచ్చే మార్చిలో 2 నుంచి 4వ తేది వరకు మాదాపూర్‌లోని హైటెక్స్‌లో ఈ ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నామని ఆ సంస్థ ప్రతినిధులు ఎస్ రామ్‌రెడ్డి, రామక్రిష్ణా రెడ్డి, కె రాజేశ్వర్ తెలిపారు.

అత్యాధునిక ప్లాంట్‌పై దృష్టి

నాల్కో సిఎండి టికె చంద్ వెల్లడి

భువనేశ్వర్ : దేశంలో అత్యాధునిక అల్యూమినియం ఉత్పత్తుల ప్లాంట్ ఏర్పాటుకు నేషనల్ అల్యూమినియం కంపెనీ (నాల్కో) కసరత్తు చేస్తుంది. భవిష్యత్తులో రానున్న బుల్లెట్ ట్రెయిన్, విమానాల తయారీ, విద్యుత్ వాహనాల కోసం కావాల్సిన అల్యూమినియం తయారీపై దృష్టి పెట్టినట్లు నాల్కో ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ టికె చంద్ తెలిపారు. దేశంలో ఇప్పటి వరకు అత్యంత ఆధునికత కలిగిన అల్యూమినియం తయారీ ప్లాంట్లు లేవని అన్నారు. ఈ టెక్నలాజీ అమెరికా, రష్యాల్లో ఉందని, ఈ స్థాయి సాంకేతికతను అందిపుచ్చుకోవడానికి సరఫరాదారులతో సంప్రదింపులు చేస్తున్నామన్నారు. ఒక వేళ తాము అనుకున్న టెక్నలాజీ లభిస్తే అంగూల్ అల్యూమినియం పార్కు లేదా దగ్గరలో నూతన ప్లాంట్‌ను ఏర్పాటు చేసే యోచనలో ఉన్నామని తెలిపారు. ఇక్కడి అల్యూమినియం పార్కును నాల్కో, ఒడిస్సా ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంయుక్తంగా అభివృద్ధి చేస్తున్నాయి. ఇందుకోసం 240 ఎకరాల స్థలాన్నీ సేకరించాయి. విద్యుత్ వాహనాల్లో అల్యూమినియంను ఉపయోగించడం ద్వారా ఉద్గారాలను తగ్గించడానికి వీలుంది. ఇప్పటికే రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన పిఎస్‌యు మిశ్ర దాతు నిగమ్ లిమిటెడ్ (మిధాని)కి అత్యంత నాణ్యమైన అల్యూమినియంను అందించడానికి ఒప్పందం చేసుకుంది.

త్రైమాసిక ఫలితాలే కీలకం

ముంబయి : వచ్చే వారంలో దేశీయ స్టాక్ మార్కెట్లను కార్పొరేట్ కంపెనీల ఆర్థిక ఫలితాలు ప్రభావితం చేయనున్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. అదే విధంగా పలు సూక్ష్మ గణంకాలను మదుపర్లు కీలకంగా తీసుకోనున్నారు. అదే విధంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను వృద్ధి రేటు 6.5 శాతానికే పరిమితం కానుందన్న కేంద్ర గణంకాల ముందస్తు అంచనాలు మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని బ్రోకర్లు పేర్కొంటున్నారు. 2016-17లో భారత్ 7.1 శాతం వృద్ధి సాధించింది. జనవరి 8తో ప్రారంభం కానున్న వారంలో ఇన్ఫోసిస్, టిసిఎస్, ఇండుస్‌ఇండ్ తదితర సంస్థలు డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3) ఆర్థిక ఫలితాలను వెల్లడించనున్నాయి. జనవరి 12న ఇన్ఫోసిస్ నూతన సిఇఒ సలీల్ పరేక్ ఆ కంపెనీ ఆర్థిక ఫలితాలను ప్రకటించనున్నారు. దేశంలోనే అతిపెద్ద ఐటి కంపెనీ టిసిఎస్ జనవరి 11న క్యూ3 ఫలితాలను వెల్లడించనుంది. ఈ కంపెనీల లాభ, నష్టాలను బట్టి ముఖ్యంగా ఐటి కంపెనీల సూచీలు ప్రభావితం కానున్నాయి. అదే విధంగా ఇండుస్‌ఇండ్ కూడా జనవరి 11న ఫలితాలు వెల్లడించనున్నట్లు తెలిపింది. ఈ బ్యాంకు బ్యాలెన్స్ షీట్ ఇతర బ్యాంకుల ఆదాయాల అంచనాలకు దారి తీయనుంది.

స్మార్ట్‌రన్ బోర్డులోకి అనిర్బన్



హైదరాబాద్ : గ్లోబల్ ఒఇఎం, ఐఒటి బ్రాండ్ స్మార్ట్‌రన్ కంపెనీ ప్రముఖ గోల్ఫ్ ఆటగాడు అనిర్బన్ లహిరిని తన బోర్డులోకి అహ్వానించింది. అదే విధంగా ఆయన ఆ కంపెనీకి బ్రాండ్ ఎండార్సర్‌గా వ్యవ హరించనున్నారు. ఇందుకోసం స్మార్ట్‌రన్ అనిర్బన్‌తో ఐదేళ్ల ఒప్పందాన్ని కుదుర్చుకుంది. కాగా ఇదే సమయంలో ఆయన ప్రధాన స్పాన్సర్‌గా వ్యవహరించనుంది. ఇది వరకు ఈ కంపెనీ బోర్డులో క్రికెట్ దిగ్గజం సచిన్ టెండుల్కర్‌ను భాగస్వామ్యం చేసుకుంది. స్ట్రాటజిక్ వాటా దారునిగా ఉండటంతో పాటు ప్రచారకర్తగా ఉన్నారు. తమ స్మార్ట్‌రన్ కుటుంబంలో అనిర్బన్ భాగస్వామ్యం కావడంతో ఎంతో సంతోషంగా ఉందని ఆ కంపెనీ ఛైర్మన్ మహేష్ లింగారెడ్డి పేర్కొన్నారు.

తీరు మారింది..

చిన్న పట్టణాల్లో స్మార్ట్‌ఫోన్ల దూకుడు

'మెట్రో'ల్లో కంటే ఎక్కువ అమ్మకాలు

టైర్1, టైర్2 విక్రయాల్లో 55% వృద్ధి

పెద్ద నగరాల్లో 15% పెరుగుదల

పరిశోధన సంస్థల వెల్లడి

న్యూఢిల్లీ : మెట్రో నగరాలు, ప్రథమశ్రేణి నగరాలతో పోల్చితే పట్టణాలు, చిన్న పట్టణాల్లోనే స్మార్ట్‌ఫోన్లు భారీగా అమ్ముడు పోతున్నాయి. 2016 సంవత్సరంతో పోల్చితే గతేడాది ఫోన్ల మార్కెట్ తీరు మారిందని పలు పరిశోధన ఏజెన్సీలు విశ్లేషించాయి. 2018లోనూ ఇదే పరిస్థితి కొనసాగవచ్చని పేర్కొంటున్నాయి. జియోమీ, లెనొవొ, ఒప్పో, వివో, మైక్రోమాక్స్ లాంటి బ్రాండ్లు అత్యధికంగా చిన్న పట్టణాలు, పట్టణాల్లో అమ్మకాలపై దృష్టి పెట్టాయి. స్మార్ట్‌ఫోన్ల ధరలు దిగిరావడానికి తోడు వీటిపై వినియోగదారులకు పెరుగుతున్న ఆసక్తి నేపథ్యంలో పట్టణ మార్కెట్లో విశేష ఆధరణ లభిస్తుందని ఇటి ఒక కథనం వెల్లడించింది.

ఇంటర్నేషనల్ డాటా కార్పొరేషన్ (ఐడిసి) ఇండియా దేశంలోని ముఖ్యమైన 30 పట్టణాల్లోని ఫోన్ల అమ్మకాలను విశ్లేషిస్తుంది. కాగా చిన్న పట్టణాల్లో స్మార్ట్‌ఫోన్ల అమ్మకాల్లో 53 శాతం వృద్ధి చోటు చేసుకుందని ఐడిసి తెలిపింది. అదే పెద్ద నగరాల్లో వీటి అమ్మకాల్లో కేవలం 15 శాతం పెరుగుదల ఉందని పేర్కొంది. చిన్న పట్టణాలకు ఆన్‌లైన్ సేవలు విస్తరించడం కూడా స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌కు కలిసి వస్తుందని కౌంటర్‌పాయింట్ అసోసియేట్ డైరెక్టర్ తరుణ్ పథక్ పేర్కొన్నారు. అదే విధంగా తక్కువ స్థాయి స్మార్ట్‌ఫోన్ల నుంచి వినియోగదారులు మధ్యస్థ విలువ చేసే ఫోన్లకు బదిలీ అవుతున్నారన్నారు. హాంగ్‌కాంగ్ కేంద్రంగా పని చేసే కౌంటర్‌పాయింట్ టెక్నలాజీ మార్కెట్ రీసెర్చ్ సంస్థ దేశ వ్యాప్తంగా జరిగే ఫోన్ల అమ్మకాలను ఈ సంస్థ సేకరిస్తుంది.

రూ.6వేల లోపు ఫోన్లకు డిమాండ్

2017లో మొత్తం స్మార్ట్‌ఫోన్ అమ్మకాల్లో స్థూలంగా 13 శాతం పెరుగుదల మాత్రమే ఉందని పథక్ తెలిపారు. అదే 2016లో ఈ రంగం 18 శాతం వృద్ధిని కనబర్చింది. 2015లో ఏకంగా 23 శాతం వృద్ధి సాధించిందన్నారు. కాగా గతేడాది బేసిక్ ఫోన్ల అమ్మకాలు 7 శాతం పెరిగాయన్నారు. 2016 ఈ రంగం ఫోన్లు 3.4 శాతం



పెరుగుదలను నమోదు చేసింది. మొత్తంగా రూ.6,400 దిగువ విలువ చేసే ప్రతీ నాలుగు స్మార్ట్ ఫోన్లలో మూడు యూనిట్లు చిన్న పట్టణాల్లోనే అమ్మకాలు అవుతున్నాయని అన్నారు. పట్టణీకరణ వేగవంతంగా మారడంతో స్మార్ట్‌ఫోన్ల అమ్మకాలకు ఈ ప్రాంతాలు కొత్త హబ్బుగా మారాయని ఐడిసి ఇండియా సీనియర్ అనలిస్టు జైపాల్ సింగ్ పేర్కొన్నారు. ద్వితీయ శ్రేణీ పట్టణాలు కొత్త పెట్టుబడులుకు గమ్య స్థానాలుగా మారడంతో పాటు కనెక్టివిటీ పెరుగుతుందని, దీంతో ఉపాధి కల్పన కూడా మెరుగు అవుతుందన్నారు. ఈ నేపథ్యంలోనే ఈ ప్రాంతాల్లో స్మార్ట్‌ఫోన్మ అమ్మకాలు దూసుకు పోతున్నాయన్నారు.

ఆకర్షిస్తున్న ఆఫర్లు..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులై నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో భోపాల్, గుర్‌గావ్, జైపూర్ లాంటి టైర్2 పట్టణాల్లో స్మార్ట్‌ఫోన్ల అమ్మకాలు 40 శాతం పెరిగాయి. జీరో డౌన్‌పేమెంట్ ప్లాన్స్, వడ్డీ లేని ఇఎంఐ ఆఫర్‌లకు తోడు ఆన్‌లైన్ వేదికల్లో క్యాష్ బ్యాక్ ప్రోత్సాహకాలు స్మార్ట్‌ఫోన్ మార్కెట్ దూసుకు పోవడానికి దోహదం చేస్తున్నాయి. ముఖ్యంగా స్మార్ట్‌ఫోన్ల ధరలు దిగిరావడం కూడా ప్రధాన కారణం. మరోవైపు పట్టణాల్లోని పెద్ద, చిన్న రిటైల్ స్టోర్ల యాజమానులు ఆన్‌లైన్ పోర్టళ్లకు ధీటుగా ధరలు ప్రకటించడంతో స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌కు మద్దతు లభిస్తుంది.

అదరగొడుతున్న ఆన్‌లైన్..

ఆన్‌లైన్ పోర్టళ్లు పోటాపోటీగా అందిస్తున్న ఆఫర్ల వల్ల స్మార్ట్‌ఫోన్ల అమ్మకాలు భారీగా పెరుగుతున్నాయని ఇ-కామర్స్ వర్గాలు పేర్కొంటున్నాయి. గతేడాది టైర్2, టైర్3 పట్టణాల్లో స్మార్ట్‌ఫోన్ల అమ్మకాలు 70 శాతం పెరిగాయని అమెజాన్ ఇండియా కేటగిరీ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ నూర్ పటేల్ పేర్కొన్నారు. రూ.25,000 పైబడిన ఫోన్ల అమ్మకాలు 45 శాతం వృద్ధిని నమోదు చేశాయన్నారు. 2018లో ఇదే ట్రెండ్ కొనసాగనుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతీ మూడు ఫోన్లలో రెండు ఫోన్లు రూ.6,000 లోపు విలువ చేసేవి అమ్మకాలు అవుతున్నాయని తెలిపారు. భవిష్యత్తులో గ్రామీణ ప్రాంతాల్లోని 7 కోట్ల మంది వినియోగదారులు అప్‌గ్రేడ్ ఫోన్లకు మళ్లే అవకాశం ఉందన్నారు. కాగా మార్కెట్‌లో రూ.6,400-12,800 మధ్య స్మార్ట్‌ఫోన్లు అత్యధికంగా అమ్ముడు అవుతున్నాయని పథక్ తెలిపారు.

భారత్‌లోని చిన్న పట్టణాల్లో చైనా బ్రాండ్లు 43 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉన్నాయన్నారు. ఈ కంపెనీలు మొత్తం స్మార్ట్‌ఫోన్ మార్కెట్లో 50 శాతం వాటాతో కొనసాగుతున్నాయని పథక్ పేర్కొన్నారు. చిన్న పట్టణాలు, పట్టణాల్లో స్మార్ట్‌ఫోన్ల అమ్మకాలకు భలే డిమాండ్ ఉందని ఐడిసి ప్రతినిధి సింగ్ పేర్కొన్నారు. మొబైల్ కంపెనీలు ఈ విస్తృతావకాశాలు అందిపుచ్చుకోవడానికి వీలుందన్నారు.



జెట్ ఎయిర్‌వేస్ మరో ఆఫర్

ముంబయి : దేశీయ విమానయాన రంగంలో నెలకొన్న పోటీ నేపథ్యంలో జెట్ ఎయిర్‌వేస్ ప్రీమియర్ వన్ వే టికెట్లపై రాయితీ ఆఫర్‌ను ప్రకటించింది. ఎంపిక చేసిన విమానాలు, రూట్లలో ప్రీమియం టికెట్లను రూ.2320 ప్రారంభ ధరతో అందిస్తున్నట్లు తెలిపింది. ఎంపిక చేసుకున్న బుకింగ్ తరగతులకు, ఎలాంటి ప్రయాణ ఆంక్షలు లేకుండా డిస్కౌంట్ ఆఫర్ అందిస్తున్నట్లు తెలిపింది. బుక్ చేసుకున్న అనంతరం 12నెలల పాటు ఈ టికెట్లు చెల్లుబాటు అవుతాయని పేర్కొంది. అయితే కనీసం ప్రయాణానికి నెల రోజులు ముందుగా ఈ టికెట్లను కొనుగోలు చేసుకోవాలి. ఎకానమీ క్లాస్ కంటే తక్కువ రేటు విమాన టికెట్లతో ప్రయాణించండి, అదనపు సౌలభ్యాలను ఆస్వాదించడంటూ అనే నినాదంతో ఈ ప్రయాణాన్ని అందిస్తుంది. ప్రయాణానికి కనీసం 30 రోజులు ముందు టికెట్లు బుక్ చేసుకోవాలని తెలిపింది. ఇండియాలో జెట్ ఎయిర్వేస్ నిర్వహిస్తున్న విమానాల్లో ఎంపిక చేసిన ప్రీమియర్లో వన్-వే ప్రయాణాలకుఈ రేట్లు వర్తిస్తాయి. ఏ సమయంలో అయినా, ఆఫర్‌ను, పూర్తిగా లేదా పాక్షికంగా ఉపసంహరించుకునే అధికారం తమకుందని జెట్ ఎయిర్‌వేస్ స్పష్టం చేసింది.

టెట్ పరీక్ష - ప్రిపరేషన్



కె.ఎస్ లక్ష్మణరావు,
శాసనమండలి మాజీ సభ్యులు
సెల్ : 9440262072

శిశువికాసం - అధ్యాపనం (నమూనా ప్రశ్నలు)

1. కింది వానిలో బోధన యొక్క లక్షణం కాదు?
ఎ. బోధన ఒక త్రిమితీయ ప్రక్రియ
బి. బోధన ఒక పరస్పర ప్రక్రియ
సి. బోధన ఒక కళ
డి. బోధన ఒక స్థిరమైన ప్రక్రియ

2. కింది వాటిలో ఒకటి బోధనలోని పూర్వక్రియాశీల దశకు చెందదు?
ఎ. లక్ష్యాలను స్థిరపరచడం
బి. విషయం గురించి నిర్ణయాలు తీసుకోవడం
సి. నిర్ధారించిన లక్ష్యాలు సరిపోవునో లేదో అంచనా వేయడం
డి. బోధనా వ్యూహాలను అభివృద్ధి చేయడం

3. కిందివాటిలో ఒకటి మానసిక వైకల్యంగల పిల్లలకు సంబంధించిన సాంఘిక పునర్బలనము?
ఎ. చిరునవ్వు బి. ధనం
సి. ఆహారం డి. నిద్ర

4. వినికిడిలోపం గల పిల్లల భాషణను అభివృద్ధి చేసేటప్పుడు శిక్షణను ఇచ్చేవారు చేయకూడనిది ?
ఎ. ఎల్లప్పుడూ ఒకే భాష ఉపయోగించడం
బి. పిల్లవాని ముఖంవైపు దృష్టి ఉంచడం
సి. చిన్న పదాలు మాట్లాడటం
డి. చాలా గట్టిగా అరవడం

5. ఆర్‌టిఇ-2009 ప్రకారం ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకూ పాటించాల్సిన కనీస పనిదినాలు ?
ఎ. 220 బి. 200
సి. 180 డి. 224

6. కిందివానిలో అనిర్దేశిత మంత్రణమునకు చెందనిది ?
ఎ. సహాయార్థిక తన సమస్యలు చెప్పడానికి తక్కువ స్వేచ్ఛ ఉంటుంది
బి. దీనిని సహాయార్థి కేంద్రిత కౌన్సెలింగ్ అంటారు
సి. ఈ మంత్రణంలో సహాయార్థి పాత్ర ఎక్కువ
డి. కౌన్సెలర్ ఒక సమన్వయకర్తగా వ్యవహరిస్తాడు

7. కిందివాటిలో ఒకటి ప్రాథమిక పాఠశాలలో కంప్యూటర్ ఆధారిత అభ్యసనకు చెందదు?
ఎ. సిడిల ద్వారా పిల్లల అభ్యసనను పెంపొందించడం
బి. అభ్యసనను ఒక ఆహ్లాదకరమైన కృత్యంగా చేయడం
సి. విద్యా ప్రమాణాలు పెంపొందించడం
డి. ఉపాధ్యాయుని పనిభారాన్ని తగ్గించడం

8. సీతారాం అనే ఒక ఉపాధ్యాయుడు ఎప్పుడూ ఇతరుల అభిప్రాయాన్ని తీసుకోడు. నిర్ణయాలు తానే తీసుకుంటాడు. తరగతి పిల్లలను వాటిని పాటించమని సూచనలిస్తాడు. సీతారాం ఒక...
ఎ. జోక్య రహిత నాయకుడు
బి. అనుమతించే నాయకుడు
సి. సహభాగి నాయకుడు
డి. అధికారపూర్వక నాయకుడు

9. ప్రాజెక్టుకు ఉండకూడనిది ...
ఎ. ఉద్దేశ్యం బి. ప్రణాళిక
సి. కృత్రిమ వాతావరణం డి. కృత్యం

10. గోపాల్ గాత్ర సంగీతం నేర్చుకున్నాడు. అతను ఇప్పుడు ఈత నేర్చుకోదలచాడు. ఇక్కడ అభ్యసన బదలాయింపు...
ఎ. శూన్య బదలాయింపు
బి. ధనాత్మక బదలాయింపు
సి. ఋణాత్మక బదలాయింపు
డి. ద్విపార్శ్వ బదలాయింపు

11. కింది పుస్తకాలలో ఒకటి ప్రయోగాత్మక మనోవిజ్ఞాన శాస్త్రంలో మైలురాయిగా భావించబడుతుంది?
ఎ. ఎంక్వయిరీ ఇన్‌టు హ్యూమన్ ఫ్యాకల్టీస్ అండ్ ఇట్స్ డెవలప్‌మెంట్
బి. ఆన్ మెమొరీ
సి. ఫర్‌గెట్టింగ్
డి. ఎనిమల్ ఇంటెలిజన్స్

12. ఒక పాఠశాలలో విద్యార్థులు తమంతట తాము ప్రయోగాలు చేస్తూ సైన్సు నేర్చుకుంటున్నారు. ఆ పిల్లల స్మృతి...
ఎ. తక్షణ స్మృతి బి. బట్టీ స్మృతి
సి. నిష్క్రియాత్మక స్మృతి డి. క్రియాత్మక స్మృతి

13. నిశాంత్ పరీక్షలకు సన్నద్ధుడవుతూ మొదట హిందీని తరువాత సంస్కృతాన్ని చదివాడు. అతను హిందీ పరీక్ష రాస్తుండగా అతనికి సంస్కృతం మాత్రమే గుర్తుకొచ్చింది. దీనికి కారణం....
ఎ. దమనం
బి. పురోగమన అవరోధం
సి. తిరోగమన అవరోధం
డి. జైగార్నిక్ ప్రభావం

14. మానవ మనుగడకు తప్పనిసరి అయిన అవసరాలను మాస్లోవ్ ఇలా అన్నాడు...
ఎ. రక్షణ అవసరాలు బి. ఆత్మగౌరవ అవసరాలు
సి. శారీరక అవసరాలు డి. ఆత్మ సాఫల్యం

15. ఒక చిలుక జ్యోతిష్కుడు తన కుడిచేయి కదిపినప్పుడు చిలుక కార్డును తీసేలా శిక్షణ ఇచ్చాడు. అయితే ఆ చిలుక ఎవరు కుడిచేయి కదిపినా కార్డు తీయసాగింది. దీనికి కారణం...
ఎ. ఉద్దీపనా సామాన్యీకరణ
బి. ఉద్దీపనా విచక్షణ
సి. అయత్న సిద్ధ స్వాస్థ్యము
డి. విరమణము

16. పరిశీలనాభ్యసనలో మూడో సోపానం...
ఎ. అవధానం బి. నిష్పాదన
సి. ధారణ డి. పునర్బలనం

17. కింది పునర్బలన పద్ధతులలో స్కిన్నర్ ప్రతిపాదించినది?
ఎ. స్థిరకాల వ్యవధులలో పునర్బలనం
బి. స్థిర నిష్పత్తిలో పునర్బలనం
సి. నిరంతర పునర్బలనం
డి. సాంఘిక పునర్బలనం

18. వైగోట్స్కీ ప్రకారం కింది వానిలో ఒకటి వ్యక్తుల 'స్వయం క్రమీకరణ'కు దోహద పడుతుంది?
ఎ. ఉన్నత మానసిక ప్రకార్యాలు
బి. సాంఘిక సహాయ సహకారాలు
సి. నిమ్న మానసిక ప్రకార్యాలు
డి. సహయోగ సమూహం

19. 'ది వైన్ ల్యాండ్ సోషియల్ మెచ్యూరిటీ స్కేల్' దీనిని అంచనా వేస్తుంది?
ఎ. వైఖరి
బి. సహజ సామర్థ్యం
సి. మూర్తిమత్వం
డి. ప్రజ్ఞ

20. శంకర్ ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్నలకు సమాధానాలు తెలియక ఇంటర్వ్యూ గదిలో చిన్నపిల్లవాడిలా ఏడ్వడం మొదలు పెట్టాడు. ఇది ఈ రక్షక తంత్రానికి చెందినది?
ఎ. విస్థాపనము బి. ప్రతిచర్యా నిర్మితి
సి. తాదాత్మీకరణం డి. ప్రతిగమనం

21. వైష్లర్ పిల్లల ప్రజ్ఞామాపనిలోని ఉపపరీక్షలలో లేని పరీక్ష?
ఎ. బ్లాక్ డిజైన్ పరీక్ష బి. వస్తు సమాఖ్య
సి. డ్రా ఎ పర్సన్ పరీక్ష డి. అవబోధము


22. పది సంవత్సరాల వయస్సు గల నారాయణ మానసిక వయస్సు ఆరు సంవత్సరాలు. ప్రజ్ఞాలబ్ధి ప్రకారం అతను....
ఎ. మూఢుడు బి. బుద్ధిహీనుడు
సి. అల్ప బుద్ధిహీనుడు డి. సగటు ప్రజ్ఞావంతుడు

23. ప్రయోగ పద్ధతిలో 'నియంత్రణ సమూహం' అనగా...
ఎ. ప్రయోగాన్ని నియంత్రించే సమూహం
బి. ప్రయోగ పరిస్థితులకు గురికాని సమూహం
సి. ప్రయోగాన్ని నిర్వహించే సమూహం
డి. ప్రయోగం నుంచి దూరంగా ఉంచబడే సమూహం

24. ఒక ఉపాధ్యాయుడు శిక్షించడం వల్ల రెండో తరగతి విద్యార్థి పాఠశాల పట్ల భయం పెంచుకున్నాడు. ఈ ఉదాహరణకు సంబంధించిన అభ్యసనం...
ఎ. సామాజిక అభ్యసనం
బి. సాంప్రదాయక నిబంధనం
సి. అంతర్‌దృష్టి అభ్యసనం
డి. సంజ్ఞానాత్మక అభ్యసనం

25. శిశు కేంద్రీకృత బోధనా భావన అనగా...
ఎ. పిల్లల మానసిక వికాసంపై ప్రణాళిక రూపొందించడం
బి. పిల్లల ఉపాధ్యాయుల ప్రశ్నలకు సమాధానాలు చెప్పేలా బలవంతపెట్టడం
సి. పిల్లవాడి అనుభవాలకు అవకాశం ఇవ్వకుండుట
డి. పిల్లలు పుస్తకజ్ఞానాన్ని యథాతథంగా చెప్పేలా చేయడం

26. జాతీయ విద్యా ప్రణాళికా చట్రం - 2005 ప్రతిపాదించిన ప్రధాన మార్పు...



ఎ. విస్తృత సామాజిక పరిసరాలలో అభ్యసనం
బి. పుస్తకాల ద్వారా అభ్యసనం
సి. తరగతిలో అభ్యసనం
డి. ఉపాధ్యాయుని పర్యవేక్షణలో అభ్యసనం

27. కింది వానిలో విద్యాహక్కు చట్టం -2009 ప్రకారం సరికానిది?
ఎ. పిల్లవాడికి వాడి వయస్సుకు తగిన తరగతిలో ప్రవేశం కల్పించడం
బి. పిల్లవాడికి బదిలీపత్రం లేదని పాఠశాల ప్రవేశాన్ని నిరాకరించడం
సి. ఆరు నుంచి 14 సంవత్సరాల వయస్సుగల పిల్లలందరికీ ఉచిత నిర్బంధవిద్యను అందజేయడం
డి. ఏ పిల్లవాడికి జననధృవీకరణ పత్రం లేదని పాఠశాల ప్రవేశం నిరాకరించకూడదు

28. కింది వానిలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలను అధ్యయనం చేయడానికి దోహదపడే పద్ధతి ?
ఎ. వ్యక్తి అధ్యయన పద్ధతి
బి. అంతఃపరీక్షణ పద్ధతి
సి. పరిపృచ్ఛ పద్ధతి
డి. ప్రయోగాత్మక పద్ధతి

29. ఉద్వేగాల ప్రకటన, భావాల నిర్వహణల అభ్యసనమునకు సంబంధించిన రంగం?
ఎ. జ్ఞానాత్మక రంగం
బి. మానసిక చలనాత్మక రంగం
సి. భావావేశ రంగం
డి. సిమాంటిక్ రంగం

30. మనస్సుకు వస్తువులను వ్యవస్థీకరించే గుణం ఉంది. ఈ ప్రాథమిక ఆలోచన దీనికి సంబంధించినది ?
ఎ. సంధాన మాదము బి. ప్రవర్తనా వాదము
సి. సాంప్రదాయక నిబంధనము
డి.నిర్మాణాత్మక వాదము

సమాధానాలు : 1.డి, 2.డి, 3.ఎ, 4.డి, 5.ఎ, 6.ఎ, 7.డి, 8.డి, 9.సి, 10.ఎ, 11.బి, 12.డి, 13.సి, 14.సి, 15.ఎ, 16.డి, 17.బి, 18.బి, 19.సి, 20.డి, 21.బి, 22.సి, 23.సి, 24.బి, 25.ఎ, 26.ఎ, 27.బి, 28.ఎ, 29.సి, 30.బి. ★

ఉద్యోగాలు

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో 44 పోస్టులు

హైదరాబాద్‌లోని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (యూఓహెచ్).. 44 బోధన ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదల చేసింది.
పోస్టులు-ఖాళీలు : ప్రొఫెసర్-11, అసోసియేట్ ప్రొఫెసర్-25, అసిస్టెంట్ ప్రొఫెసర్-8.
వేతనశ్రేణి : ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్-రూ.37,400-రూ.67,000, అసిస్టెంట్ ప్రొఫెసర్-రూ.15,600-రూ.39,100.
బోధనాంశాల వారీ ఖాళీలు : మ్యాథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్-5, ఫిజిక్స్-1, ఎర్త్, ఓషియన్ అండ్ అట్మాస్ఫియరిక్ సైన్సెస్-2, కెమిస్ట్రీ-2, ఏనిమల్ బయాలజీ-1, సిస్టమ్స్ బయాలజీ-3, ప్లాంట్ సైన్సెస్-1, ఇంజనీరింగ్ సర్వీసెస్ అండ్ టెక్నాలజీ-2, మెడికల్ సైన్సెస్-1, హెల్త్ సైకాలజీ-1, ఎకనమిక్స్-2, ఎడ్యుకేషన్-3, ఇంగ్లీష్-4, ఇంగ్లీష్ లాంగ్వేజ్ స్టడీస్-3, ఫిలాసఫీ-1, హిందీ-1, తెలుగు-1, సంస్కృతం-2, ఉర్దూ-2, కంపారిటివ్ లిటరేచర్-1, అప్లైడ్ లాజిస్టిక్స్ అండ్ ట్రాన్స్‌లేషన్ స్టడీస్-2, నృత్యం-1, మేనేజ్‌మెంట్ స్టడీస్-2.
అర్హతలు : సంబంధిత పోస్టులు, బోధనాంశాలను అనుసరించి పీహెచ్‌డీ/ మాస్టర్స్ డిగ్రీ/ డిగ్రీ/ తత్సమాన విద్య. అలాగే నిబంధనల మేరకు బోధనానుభవం, జర్నల్స్ ప్రచురణ, మార్కుల శాతం, నెట్/స్లెట్/సెట్ (అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు), అకడమిక్ రికార్డు తదితర అర్హతలుండాలి.
ఎంపిక : ప్రీవియస్ రికార్డ్, ఇంటర్వ్యూ (సెమినార్/ కొల్లోకియం/..).
దరఖాస్తు ఫీజు : రూ.1,000 (జనరల్/ ఓబీసీ/ టీజీ (థర్డ్ జెండర్)), రూ.300 (ఎస్సీ/ ఎస్టీ/ వికలాంగులు).
ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రారంభం : డిసెంబర్ 21, 2017.
దరఖాస్తు విధానం : ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు హార్డ్‌కాపీ ప్రింటవుట్‌కు సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు, ఫొటోలు, డీడీ తదితర అవసరమైన వాటిని జతచేసి 'ది అసిస్టెంట్ రిజిస్ట్రార్ (రిక్రూట్‌మెంట్ సెల్), రూమ్ నెం.221, ఫస్ట్ ఫ్లోర్, అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, ప్రొఫెసర్ సీఆర్.రావ్ రోడ్, సెంట్రల్ యూనివర్సిటీ పీ.వో., గచ్చిబౌలి, హైదరాబాద్-500046, తెలంగాణ' చిరునామాకు పోస్టు/ కొరియర్ ద్వారా గడువులోగా చేరేలా పంపాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ : జనవరి 24, 2018.
దరఖాస్తు హార్డ్‌కాపీ చేరడానికి చివరి తేదీ : జనవరి 31, 2018.
పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు
వెబ్‌సైట్ : www.uohyd.ac.in

'ఉక్కు' సాధనకు 25న హర్తాళ్

ప్రజాశక్తి - కడపఅర్బన్

జిల్లాలో ఉక్కు పరిశ్రమ సాధన కోసం పోరాటాలు మరింత ఉధృతం చేస్తామని ఉక్కు సాధన ఐక్య వేదిక నాయకులు హెచ్చరించారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఉక్కు సాధన ఐక్య వేదిక సమావేశం నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ బైరెడ్డి రామకృష్ణారెడ్డి అధ్యక్షత జరిగింది. ఈ సందర్భంగా ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ బి.నారాయణ మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలోనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పరిశ్రమ సాధనకు ఎంతటి త్యాగానికైనా సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. జిల్లా ప్రజల ఆకాంక్షలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు.



సిఆర్‌డిఎ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు అమలు చేస్తారా? లేదా?

రైతుల ప్రశ్నలతో దద్దరిల్లిన మందడం సిఆర్‌డిఎ కార్యాలయం

ప్రజాశక్తి-తుళ్ళూరు (గుంటూరు)

గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు అమలు చేస్తున్నారో? లేదో? చెప్పకుండా వాగులను అభివృద్ధి చేస్తున్నామంటారేమిటి? పాలవాగును ఎందుకు పూడ్చారు అంటూ రైతులు సిఆర్‌డిఎ అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. గుంటూరు జిల్లాలోని రాజధాని ప్రాంతమైన తుళ్ళూరు మండలం మందడం సిఆర్‌డిఎ కార్యాలయంలో కన్సల్టేషన్ వర్క్‌షాప్‌ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ప్రపంచ బ్యాంకు బృందం వస్తోందని, రెండు గ్రామాల్లో సభలుంటాయని చెప్పి ఇప్పుడు నాలుగు గ్రామాలంటున్నారేమిటని సిఆర్‌డిఎ స్ట్రేటజీ డైరెక్టర్ జెఎస్ఆర్‌కె శాస్త్రిని ప్రశ్నించారు. రైతుల అభిప్రాయాలను మినిట్స్ బుక్ రాయాలని పట్టుబట్టారు. కొండవీటివాగు, పాలవాగు, ఇతర వాటివల్ల వరద ముంపు నివారణకు చర్యలు తీసుకునే క్రమంలో 96 కుటుంబాలు ప్రభావితమవుతున్నాయని, వారి అభిప్రాయాల సేకరణకు సభ నిర్వహిస్తున్నామని అధికారులు చెప్పగా వారిని పిలవకుండా మాకెందుకు నోటీసులిచ్చారని ప్రశ్నించారు. వాగుల యథాతథ స్థితిని కొనసాగించాలనే గ్రీన్ ట్రిబ్యునల్ ఉత్తర్వులను అమలు చేస్తున్నారా? లేదా? స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. పొలాలు రూ.కోట్లు పలుకుతున్నాయని ప్రలోభ పెడుతున్నారని, రైతుకు ఐదెకరాలుంటే గర్వకారణంగాని, రూ.ఐదు కోట్లుంటే కాదని కుండబద్ధలు కొట్టారు. ఇప్పటికి 33 వేల ఎకరాలు తీసుకున్నారు. ఇంకా ఎంత కావాలని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా సిపిఎం

- బిజెపి అన్నింటా విఫలం
- విడవలూరు సభలో వి.శ్రీనివాసరావు
- ఉత్సాహంగా ప్రారంభమైన నెల్లూరు, విశాఖ, గుంటూరు జిల్లాల సిపిఎం జిల్లా మహాసభలు

ప్రజాశక్తి -నెల్లూరు/ విశాఖ/ గుంటూరు ప్రతినిధులు

సిపిఎం నెల్లూరు, విశాఖ, గుంటూరు జిల్లాల మహాసభలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లా విడవలూరులోనూ, విశాఖ జిల్లా అచ్యుతాపురంలోనూ భారీ ప్రదర్శనలు జరిగాయి. అనంతరం జరిగిన బహిరంగసభల్లో.. విడవలూరులో సిపిఎం కేంద్రకార్యదర్శి వర్గ సభ్యులు వి.శ్రీనివాసరావు, అచ్యుతాపురంలో కేంద్ర కమిటీ సభ్యులు డాక్టర్ కె.హేమ లత ప్రసంగించారు. గుంటూరు జిల్లా మహాసభను సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.క్రిష్ణయ్య ప్రారంభిం చారు. విడవలూరులో జరిగిన సభలో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. బిజెపి, కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా సిపిఎం ఎదగాలని ఆకాంక్షించారు.

కామ్రేడ్ ఎస్. మురళీకృష్ణ నగర్, కామ్రేడ్ అన్నే అనసూయ ప్రాంగణంలో రెండ్రోజుల పాటు జరిగే నెల్లూరు జిల్లా 23వ మహాసభలను ఆయన ప్రారంభించారు. మహానాయకుడు సుందరయ్య జన్మస్థలమైన నెల్లూరు జిల్లాలో 1975లో రాష్ట్రానికే తలమానికంగా పోరాటాలు నిర్వహించారన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వ్యవసాయ కార్మిక, ఉద్యోగ, యువజన, విద్యార్థి ఉద్యమానికి పునాది వేశారన్నారు. రాజకీయ శక్తిగా తీర్చిదిద్దారన్నారు. దేశంలో కమ్యూనిస్టు ఉద్యమం అనేక ఆటు, పోట్లు ఎదుర్కొందన్నారు. దేశంలో బిజెపి, ఆర్ఎస్ఎస్ వంటి సంస్థలు పుంజుకున్నాయన్నారు. ప్రజల్లోని అసంతృప్తిని మతోన్మాదం వైపు లాక్కుపోతున్నారని విమర్శించారు. బిజెపి జాతీయ వాదం, మతోన్మాదం పేరుతో రాజకీయం చేస్తోందన్నారు. దేశంలోని 97శాతం ఉన్న నల్లధనాన్ని వెలికితీసి ప్రతి వ్యక్తికీ రూ.15లక్షలు బ్యాంకు ఖాతాలో వేస్తామని ప్రధాని



విశాఖలో అభివాదం చేస్తున్న నేతలు



గుంటూరు జిల్లా మహాసభలో మాట్లాడుతున్న వి కృష్ణయ్య

చెప్పారన్నారు. రూపాయి కూడా వారి ఖాతాలో వేయలేదన్నారు. పెద్ద నోట్ల రద్దు బడా కార్పొరేట్ శక్తులకు, బిజెపి నేతలకు ఉపయోగపడ్డాయన్నారు. అవినీతి సొమ్మును వెలికితీస్తామని చెప్పిన బిజెపి ప్రభుత్వం రూపాయి కూడా బయటతీయలేక పోయిందన్నారు. జిఎస్‌టి కారణంగా చిన్న మధ్యతరగతి వ్యాపారులు దెబ్బతిన్నారన్నారు. ఈ మూడున్నరేళ్లలో చైనా కోటి, 30 లక్షల ఉద్యోగాలిస్తే, దేశంలో కేవలం 85 వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారన్నారు. ప్రారంభ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, సిపిఎం సీనియర్ నాయకులు జక్కా వెంకయ్య, పిడిఎఫ్ ఎంఎల్‌సి విటపు బాలసుబ్రమణ్యం, రాష్ట్ర కమిటీ సభ్యులు మిరియం వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు విడవలూరు ప్రాంత కమ్యునిస్టుల ర్యాలీతో ఆ మండల కేంద్రం ఎరుపెక్కింది. జిల్లా నలుమూలల నుంచి సిపిఎం కార్యకర్తలు భారీగా తరలొచ్చారు.

కార్మికులను కట్టు బానిసలు మార్చే యత్నాలు : హేమలత

పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను సవరించి, కార్మికులను కట్టు బానిసులుగా మార్చడానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఐక్య పోరాటాల ద్వారా తిప్పికొట్టాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డాక్టర్ కె.హేమలత పిలుపునిచ్చారు. అడవులు, సముద్ర జలాలు, భూములను దేశ, విదేశీదారులకు కట్టబెట్టి వారికి లాభాలు చేకూర్చేందుకు కార్మిక చట్టాలను మార్చే దేశద్రోహి బిజెపి అని అభివర్ణించారు. శనివారం సాయంత్రం విశాఖ జిల్లా అచ్యుతాపురం మండల కేంద్రంలో జరిగిన సిపిఎం విశాఖ జిల్లా 22వ మహాసభల సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. కార్మిక చట్టాలను సవరించి, సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె చేసే అవకాశం లేని పరిస్థితులను సృష్టించి యజమానులకు లాభాలను చేకూర్చడమే మోడీ పనిగా ఉందని చెప్పారు. సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ నర్సింగరావు, డాక్టరు మిడియం బాబూ రావు, పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాధం తదితరులు పాల్గొన్నారు. సభకు ముందు అచ్యుతాపురంలో భారీ ప్రదర్శన జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దాదాపు 2వేల మందితో జరిగిన ప్రదర్శనలో వివిధ వృత్తులకు చెందినవారు పనిముట్లుతో పాల్గొన్నారు. ప్రదర్శనకు అగ్రభాగాన పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు హేమలత, డాక్టరు మిడియం బాబూరావు, పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాధం తదితరులు ఉన్నారు.


కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై భ్రమలు తొలిగాయి : వి.కృష్ణయ్య

ప్రజల అభ్యున్నతే కేంద్రంగా అభివృద్ధి ఉండాలని, సారవంతమైన భూములను రైతుల నుండి సేకరించడం సరికాదని పేర్కొంటూ, భూ బ్యాంక్ విధానానికి స్వస్తి చెప్పాలని సిపిఎం గుంటూరు జిల్లా మహాసభ తీర్మానించింది. జిల్లా మహాసభ స్థానిక గడ్డిపాటి కళ్యాణ మండపం (సింహాద్రి శివారెడ్డి నగర్)లో శనివారం ప్రారంభమైంది.

తొలుత ఆ పార్టీ జెండాను ఆ పార్టీ సీనియర్ నాయకులు పోపూరి రామారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా సమగ్రాభివృద్ధిపై పిడిఎఫ్ పూర్వ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. జిల్లా జనాభా, వ్యవసాయం, విద్య, వైద్య, పారిశ్రామిక రంగాల్లో పరిస్థితి, తీసుకోవాల్సిన చర్యలను తీర్మానంలో పేర్కొన్నారు. వెనుకబడిన పల్నాడుకు ప్రత్యేక నిధులు కేటాయించడంతోపాటు వెనకబడ్డ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తీర్మానంలో పేర్కొన్నారు. అంతకుముందు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు వి.కృష్ణయ్య మహాసభను ప్రారంభిస్తూ.. హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైన నేపథ్యంలో ఆ పార్టీలపై ప్రజల్లో భ్రమలు తొలగాయని అన్నారు. సిఎం చంద్రబాబు సైతం కార్పొరేట్ రాజధానిని నిర్మిస్తున్నార న్నారు. రేషన్ పంపిణీని రిలయన్స్‌కు అప్పగిస్తున్నారని, ఊరికి ఒక ఉద్యోగమైనా ఇవ్వలేదని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సి.హెచ్.బాబూరావు, డి.రమాదేవి, జిల్లా కార్యదర్శి పాశం రామారావు, నాయకులు జొన్నా శివశంకర్ తదితర నేతలు పాల్గొన్నారు.

తూర్పు గోదావరి (రాజమహేంద్రవరం)

సిపిఎం జిల్లా కమిటీ కార్యదర్శిగా టి.అరుణ్ ఎన్నిక



సిపిఎం తూర్పుగోదావరి (రాజమండ్రి) జిల్లా 22వ మహాసభలలో శుక్రవారం రాత్రి 23 మంది సభ్యులతో సిపిఎం జిల్లా కమిటీ ఎన్నికైంది. జిల్లా కార్యదర్శిగా టి.అరుణ్, కార్యదర్శివర్గ సభ్యులుగా ఎస్-ఎస్ మూర్తి, టిఎస్ ప్రకాష్, కుంజా సీతారామయ్య, మర్లపాటి నాగేశ్వరరావు, లోతా రాంబాబు ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ సభ్యులుగా 17 మంది ఎన్నికయ్యారు.



ప్రముఖ రచయిత జివి.రత్నాకర్ రచించిన 'ముసిబాస (దీర్ఘ కవిత) పుస్తకావిష్కరిస్తున్న ఎం.వి.ఎస్ శర్మ,లక్ష్మయ్య, వొరప్రసాద్ ఆంధ్రమాల్యాద్రి,చల్లపల్లి స్వరూపారాణి

గ్రామీణాన్ని కళ్లకు కట్టిన 'ముసిబాస'

పుస్తకావిష్కరణలో మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

గ్రామీణ ప్రాంతం గురించి చక్కగా వివరించిన పుస్తకం 'ముసిబాస' అని మాజీ ఎమ్మెల్సీ, ప్రజాశక్తి చీఫ్ జనరల్ మేనేజర్ ఎంవిఎస్.శర్మ అన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యాన విజయవాడ స్వరాజ్య మైదాన్‌లో జరుగుతున్న 29వ పుస్తక మహోత్సవ్‌లో ప్రతిభా వేదికపై శనివారం రాత్రి ప్రముఖ రచయిత జివి.రత్నాకర్ రచించిన 'ముసిబాస (దీర్ఘ కవిత) పుస్తకావిష్కరణ జరిగింది. ఈ పుస్తకాన్ని ఎంవిఎస్.శర్మ ఆవిష్కరించారు. అనంతరం శర్మ మాట్లాడుతూ.. ప్రకాశం జిల్లా కొండేపి మండలం పెరిదేపి గ్రామం గురించి రాసినదే ఈ పుస్తకమన్నారు. ఓ గ్రామం ఆత్మకథలో గ్రామీణ ప్రాంత వాసుల గురించి చక్కగా రాశారని పేర్కొన్నారు. ముసిబాస పుస్తకం చదవితే పల్లెల్లోని మట్టివాసన తెలుస్తుందన్నారు. పల్లెల్లో వర్షం పడిన తరువాత వచ్చే మట్టివాసన కమ్మదనం, పట్నంలో సెంట్లు, అత్తర్లు పూసుకుని తిరిగే వారికి తెలియదన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపారాణి మాట్లాడుతూ.. రచయిత రత్నాకర్ చిన్ననాటి నుండే కవితలను రాసేవారని తెలిపారు. మట్టిపలక, అట్లేటి అల వంటి పుస్తకాలు ఎంతో ఆదరణ పొందాయన్నారు. ముసిబాస పుస్తకంలో శేషయ్య అనే ఉద్యమకారుడి గురించి చక్కగా రాశారని తెలిపారు. ముప్పరాజు శేషయ్య ఆ గ్రామానికి ఎలా సేవలు చేశారనే దాని గురించి రచయిత చక్కగా చెప్పారన్నారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న శాసన మండలి సభ్యులు బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సమాజ పరిస్థితుల గురించి ముసబాసలో చక్కగా వివరించారని కొనియాడారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి వొరప్రసాద్, ప్రజాశక్తి బుక్‌హౌస్ జనరల్ మేనేజర్, విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వినతుల అప్‌లోడ్‌పై సిఎం అసంతృప్తి

జన్మభూమి టెలీ కాన్ఫరెన్సు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జన్మభూమిలో స్వీకరించిన వినతులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంలో నిర్లక్ష్యంపై ముఖ్యమంత్రి చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. నాలుగు రోజుల్లో 4,68,063 వినతులు స్వీకరించగా కేవలం 1,52,444 వినతులను మాత్రమే అప్‌లోడ్ చేశారు. అనంతపురం జిల్లాలో 85 శాతం అప్‌లోడ్ పూర్తయ్యాయని, మిగిలిన జిల్లాలూ ఆ స్థాయికి చేరాలని, జన్మభూమిపై తన నివాసం నుంచి శనివారం ఉదయం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో సిఎం ఆదేశించారు. ఇంతవరకు 34,060 పశువైద్యశిబిరాల్లో 6.24 లక్షల పశువులకు చికిత్స చేశారని, ఆయా గ్రామాల్లో ఏ వ్యాధి ఎక్కువగా ఉందో గుర్తించి కారణాలు విశ్లేషించాలని సూచించారు. ఉపాధి పథకం ఏళ్ల తరబడి ఉన్నా రాష్ట్రంలో సరిగ్గా వినియోగించుకోలేక పోయారని, ఇప్పుడు కన్వర్జెన్స్ విధానంలో 22 శాఖల్లో అద్భుత ఫలితాలు సాధించామని తెలిపారు. జన్మభూమికి అధికారులు హాజరవుతున్నారని 95 శాతం, సమస్యలపై అధికారులు స్పందన బాగుందని 73 శాతం, చర్చల సారాంశాన్ని గ్రహించామని 87 శాతం, జన్మభూమి ఉపయోగకరంగా ఉందని 86 శాతం, పింఛన్లు అందుతున్నాయని 69 శాతం, రేషన్ కార్డులు వచ్చాయని 67 శాతం, చంద్రన్న బీమాపై సంతృప్తిగా ఉన్నామని 71 శాతం, వైద్య శిబిరాలు ఉపయోగంగా ఉన్నాయని 56 శాతం, అర్జీల పరిష్కారంపై సంతృప్తిగా ఉన్నామని 50 శాతం నాలుగో రోజు ప్రజాభిప్రాయ సేకరణలో సమాధానాలుగా వచ్చినట్లు తెలిపారు. నాలుగో రోజు ఆచంట, ముమ్మిడివరం, పెద్దాపురం, రాజోలు, వెలిగోడు, చాగల్లు, తణుకు, అనపర్తి, రాయవరం, కొండాపురం, బి.కొత్తకోట, ములకలచెరువు, లక్ష్మీనరసంపేట, బ్రహ్మంగారి మఠం మండలాలు, నిడదవోలు, గరిసపూడి, కశింకోట, కలిగిరి, బొమ్మన, కొండూరు, రాచర్ల, సంతమాగులూరు, తంగెడమల్లి గ్రామాలు జన్మభూమిలో ముందున్నాయని తెలిపారు. టెలికాన్ఫరెన్స్‌లో ప్రణాళిక, విద్యుత్తు, ఐటి, రియల్‌టైం గవర్నెన్స్ శాఖల ఉన్నతాధికారులు, కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జన్మభూమిలో 11లోగా ఆర్థికేతర సమస్యలన్నీ పరిష్కరించండి

జన్మభూమిలో ఈనెల 11లోగా ఆర్థికేతర సమస్యలన్నీ పరిష్కరించలని, నెలరోజుల్లోగా ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేషన్ సొసైటీని ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. 'జన్మభూమి-మా ఊరు' అయిదో రోజు కార్యక్రమంపై శనివారం క్యాంపు ఆఫీస్‌లో ఉన్నతాధికారులతో సమీక్షించారు. నాలుగో విడత జన్మభూమికంటే ఈ విడత జన్మభూమిలో ఎక్కువ శాతం ప్రజలు పాల్గొన్నారని చెప్పారు. డిజిటల్ లిటరసీని పెద్దఎత్తున ప్రోత్సహించాలని, అందరం ఎప్పటికప్పుడు తాజా సమాచారంతో సిద్ధమవ్వాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ కార్యక్రమంతో సమస్యలు పరిష్కారమవుతున్నాయన్న భరోసా ప్రజల్లో వచ్చిందన్నారు. గత ఐదు రోజులుగా వచ్చిన ప్రజా స్పందనను పరిశీలించారు. వివిధ స్థాయిల్లో ప్రజల నుంచి వ్యక్తమైన సంతృప్తి శాతాన్ని కచ్చితంగా అంచనా వేయాలన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజల నుంచి వచ్చిన వినతులను 24 గంటల్లోగా ఆన్ లైన్‌లో తాజా సమాచారంతో ఉంచాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. గణాంకాలను పరిశీలిస్తే గత ఏడాదికంటే ప్రజల భాగస్వామ్యం 30 శాతం అధికంగా ఉందని చెప్పారు. సమస్యలను ఆన్‌లైన్‌లో ఉంచడంలో, డిజిటలైజేషన్‌లో డ్వాక్రా మహిళల భాగస్వామ్యం తీసుకోవాలని సూచించారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్, సిఎంఒ ముఖ్యకార్యదర్శి సతీష్ చంద్ర, ఆర్టీజీ సిఇఒ బాబు ఎ, ముఖ్యమంత్రి కార్యదర్శి ఎ.వి రాజమౌళి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తలు లబ్ధిదారులే

పరకాల ప్రభాకర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ సంక్షేమ పథకాలకు టిడిపి కార్యకర్తలు లబ్ధిదారులేనని ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్ అన్నారు. రాష్ట్రంలో అన్ని పార్టీల కంటే టిడిపికి కార్యకర్తల సంఖ్య అధికంగా ఉందని, అందుకే లబ్ధిదారుల్లో టిడిపి కార్యకర్తలు ఎక్కువగా ఉండటానికి అవకాశం ఉందన్నారు. గృహనిర్మాణ పథకంలో టిడిపి కార్యకర్తలే అధికంగా ఉన్నారనే ప్రశ్నకు సమాధానమిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. విజయవాడలోని సిఎం క్యాంపు కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్మభూమిలో శుక్రవారం వరకూ 5,24,370 వినతులు అందాయని, 27,14,685 మంది ప్రజలు హాజరైనట్లు చెప్పారు. 89,897 రేషన్ కార్డులు, 50,585 పింఛన్లు పంపిణీ చేశామని, 8,704 వైద్య శిబిరాల్లో 5.25 లక్షల మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లుచెప్పారు. 5వ తేదీన 1,41,755 వినతులు అందాయని, 8,27,902 మంది ప్రజలు హాజరయ్యారని, 22,541 రేషన్ కార్డులు, 13,984 పింఛన్లు పంపిణీ చేశామన్నారు. 6వ తేదీ సాయంత్రం వరకూ అందిన సమాచారం మేరకు 50,217 వినతులు అందాయని, 2,47,967 మంది ప్రజలు హాజరయ్యారని, 9,225 రేషన్‌కార్డులు, 5,702 పింఛన్లు, 825 టూల్ కిట్స్ పంపిణీ చేసినట్లు తెలిపారు.

దళితులపై దాడులను పట్టించుకోని బిజెపి, టిడిపి

ప్రజాశక్తి - గాంధీనగర్ (విజయవాడ)

దళితులపై దాడులు పెరిగిపోతున్నా కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న బిజెపి, టిడిపి ప్రభుత్వాలు పట్టనట్లు వ్యవహరిస్తున్నాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. దేశవ్యాప్తంగా మతోన్మాదులు దళితులపై దాడులకు తెగబడి పలువురిని పొట్టన పెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యాన శనివారం 'దళితులపై దాడులకు అంతం లేదా' అన్న అంశంపై విజయవాడ గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సదస్సు నిర్వహించారు. సదస్సులో రామకృష్ణ మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్, భజరంగదళ్, విహెచ్‌పి వంటి మతోన్మాద శక్తులు దళితులపై దాడులకు పాల్పడుతున్నాయని పేర్కొన్నారు.

ప్రజ్ఞ — జవాబులు

1. సామ్యూలో బౌబెయే మైగా
2. ఆపరేషన్ అలెర్ట్
3. సిద్ధాపూర్ గ్రామం (కర్నాటక)
4. మేఘాలయ
5. రాజకీయ రంగం

అన్ని ట్రేడ్ యూనియన్లు ఏకం కావాలి

'సేవ్ పబ్లిక్ సెక్టార్-డెవలప్ విశాఖ' పుస్తకావిష్కరణలో హేమలత

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకునేందుకు అన్ని ట్రేడ్ యూనియన్లు ఏకం కావాలని సిఐటియు అఖిల భారత అధ్యక్షురాలు డాక్టర్ కె.హేమలత పిలుపునిచ్చారు. శనివారం విశాఖలోని ఎన్‌పిఆర్ భవన్‌లో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు (ఇంగ్లీషు బుక్) రాసిన 'సేవ్ పబ్లిక్ సెక్టార్-డెవలెప్ విశాఖ' పుస్తకాన్ని హేమలత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇది కేవలం కార్మికుల సమస్యగా చూడకూడదని, ఈ పోరాటంలోకి ప్రజా సంఘాలు, అభ్యుదయ శక్తులు కలిసిరావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వరంగ సంస్థలు ప్రయివేటుపరమైతే విశాఖ అభివృద్ధి కుంటుపడుతుందని, లక్షలాది మంది నగరవాసుల జీవనోపాధి కోల్పోతారని అన్నారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ.. పరిశ్రమలను నాశనం చేయడానికే బిజెపి ప్రభుత్వం ప్రయివేటుపరం చేస్తోందన్నారు. డిసిఐని నూరుశాతం అమ్మేందుకు కేంద్ర కేబినెట్ తీర్మానించిందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో 10 శాతం వాటాలను అమ్మాలని నిర్ణయించినట్లు 2018 జనవరి 3న రాజ్యసభలో స్టీల్ శాఖ మంత్రి ప్రకటించారని తెలిపారు. వీటిపై పోరాటాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ సెక్టార్ కో ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పాల్గొన్నారు.



లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు వేయాలి

గజల్ శ్రీనివాస్‌ను కఠినంగా శిక్షించాలి - ఐద్వా, వర్కింగ్ ఉమెన్ రౌండప్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

లైంగిక వేధింపులకు పాల్పడ్డ గజల్ శ్రీనివాస్‌ను కఠినంగా శిక్షించాలని, పని ప్రదేశాలల్లో లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు వేయాలని రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఐద్వా, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో శనివారం జరిగింది. ఐద్వా విజయవాడ తూర్పు కార్యదర్శి లక్ష్మి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. లైంగిక వేధింపులకు పాల్పడిన గజల్ శ్రీనివాస్‌ను కఠినంగా శిక్షించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం గాకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలపైన పెరుగుతున్న వేధింపులు అరికట్టాలని, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు వేయాలని డిజిపి, మహిళా కమీషనర్‌కు వినతిపత్రాలు ఇవ్వాలని శ్రామిక మహిళా రాష్ట్ర నాయకురాలు కె స్వరూపరాణి ముందుగా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.

తిరుపతిలో ప్రజా సంఘాల ఆందోళన

లైంగిక వేధింపులకు పాల్పడిన గజల్ శ్రీనివాస్‌పై నిర్భయ చట్టం కింద కేసు నమోదు చేయాలని ప్రజా సంఘాలు డిమాండు చేశాయి. స్థానిక కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఐద్వా, డివైఎఫ్ఐ, కెవిపిఎస్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు.

అమానవీయం

దళితులపై దాడులు అమానవీయం

- దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలి
- సిపిఎం, సిపిఐ డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం జిల్లా డెంకాడ మండలం మోదవలస దళితులపై దాడి చేసిన తెలుగుదేశం నాయకుడు (ఎంపిటిసి భర్త) కాగితాల సత్యనారాయణ, ఎర్నింటి శ్రీను, ఎర్నింటి రాము, ముని పైడయ్య తదితరులను తక్షణమే అరెస్టు చేయాలని సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు తమ్మినేని సూర్యనారాయణ, పి.కామేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం టిడిపి నాయకుల దాడిలో గాయపడి జిల్లా కేంద్రాసుపత్రిలో చికిత్స పొందుతున్న దళితులను శనివారం సిపిఎం, సిపిఐ నాయకులు పరామర్శించారు. దాడికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మోదవలస వెళ్లి దళితుల కుటుంబాలతో మాట్లాడారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ విజయనగరం జిల్లాలో ఎన్నడూ లేని విధంగా దళితుల భూములను కాజేయడమే లక్ష్యంగా పాలకులు వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇప్పటికే నెల్లిమర్ల ఎమ్మెల్యే పతివాడ నారాయణ స్వామినాయుడు కుమారుడు కొవ్వాడలో దళితుల భూములను లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. మోదవలసలో దళితులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాల కోసం సర్వేనెంబర్ 186లో 12 ఎకరాలు భూమిని గతంలో ఇచ్చిందని, ఆ భూమిని ఎలాగైనా తీసుకోవాలనే ఉద్దేశంతోనే దళితులపై దాడులకు తెగబడుతున్నారని అన్నారు. దళితులపై దాడులు చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా దళితులను, ప్రజా సంఘాల నాయకులను ఐక్యం చేసి ప్రజా పోరాటాన్ని నిర్వహిస్తామని వారికి భరోసా ఇచ్చారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ స్పందించి దళితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దళితులను పరామర్శించిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, సిపిఎం నాయకులు ఎ.జగన్మోహనరావు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆర్.ఆనంద్ ఉన్నారు.





టిడిపి కార్యకర్తల దాడిలో ధ్వంసమైన దళిత నాయకుడి ఇంట్లో సామాగ్రి (ఇన్‌సెట్లో) చికిత్స పొందుతున్న మోదవలస దళితులను పరామర్శిస్తున్న సిపిఎం,సిపిఐ నాయకులు

దళిత నాయకుడి ఇంటిపై రాళ్ల దాడి

ఇదిలాఉండగా, దళిత నాయకుడు గంద్రేటి అప్పన్న ఇంటిపై టిడిపి కార్యకర్తలు శుక్రవారం రాత్రి మరోసారి దాడి చేశారు. ఇంట్లో ఉన్న కుర్చీలు, కిటికీలను పగులగొట్టారు. అడ్డొచ్చిన అప్పన్నను, ఆయన కుమార్తయిన నెల రోజుల బాలింతపైనా దాడి చేశారు. గాయపడిన అప్పన్న, ఆయన కుమార్తెను జిల్లాకేంద్రాసుపత్రిలో చేరారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారందరినీ వైసిపి జిల్లా సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు, కనకలరామారావు, తదితరులు పరామర్శించారు.

జన్మభూమిని జరగనివ్వం

పలు జిల్లాల్లో మహిళలు, గ్రామస్తుల హెచ్చరిక

ప్రజాశక్తి - యంత్రాంగం

రాష్ట్రంలో జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని జరగనివ్వమని శనివారం పలుచోట్ల మహిళలు, ఆయా గ్రామాలు ప్రజలు హెచ్చరించారు. కర్నూలు జిల్లా ఆదోని మండలం పాండవగల్లులో జన్మభూమి కార్యక్రమాన్ని గ్రామస్తులు అడ్డుకున్నారు. దాదాపు గంటసేపు గ్రామ పొలిమేరలో అధికారులు, నాయకులను అడ్డుకున్నారు. ఓర్వకల్లు మండలం నన్నూరులో నిర్వహించిన కార్యక్రమాన్ని స్థానిక మహిళలు, సిపిఎం నాయకులు అడ్డుకున్నారు. మద్యం షాపు తొలగించాలని డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా తెనాలిలో నిర్వహించిన సభలో సమస్యలపై స్థానికులు నిలదీశారు. 19వ వార్డు సభలో స్టేజీపై ఆడుకుంటూ కిందపడ్డంతో నిఖిల్ అనే చిన్నారి తలకు గాయాలయ్యాయి. అక్కడే ఉన్న వైద్యులు ప్రాథమిక చికిత్స చేసి వైద్యం కోసం ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. కృష్ణాజిల్లా మొవ్వ మండలం పెదముత్తేవి సభలో పామర్రు ఎమ్మెల్యే ఉప్పులేటి కల్పన మాట్లాడుతుండగా మినుము గిట్టుబాటు ధరపై స్పష్టత ఇవ్వాలని రైతులు, కౌలు రైతులు ఆందోళన చేశారు. విజయనగరం జిల్లా బొబ్బిలిలో 21వ వార్డు ఐటిఐ కాలనీకి చెందిన శ్మశాన వాటిక కోసం టిడిపిలోని ఇరుగ్రూపుల వారు ఘర్షణకు దిగారు. కొత్తవలస మండలంలోని మంగళపాలెంలో ఫ్లోరైడ్ సమస్య వల్ల తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మహిళలు ఆగ్రహం వ్యక్తంచేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో పూర్తిముంపులో ఉన్న 11 గ్రామాలకు పరిహారం చెల్లించాలంటూ సిపిఎం నాయకులు కుక్కునూరు సభలో అధికారులను నిలదీశారు. ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం మారెళ్ల, జమ్ములమడక గ్రామాలలో సర్పంచుల ఎస్సీ రుణాల బ్యాంకు అధికారి అక్రమాలపై సిపిఎం నాయకులు వెల్లంపల్లి ఆంజనేయులు అధికారులను ప్రశ్నించారు. అనంతపురం జిల్లా పుట్టపర్తి మండలంలో సిఐటియు, సిపిఎం నాయకులు ప్రజాసమస్యలను పరిష్కరించాలని అధికారులను నిలదీశారు. కడప జిల్లా రాయచోటి మండలం కొత్తపేట రామాపురంలో మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి, ప్రస్తుత వైసిపి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిల మధ్య వాదోపవాదాలు జరిగాయి. శ్రీకాకుళం జిల్లాలోని ఆమదాలవలస మండలం అక్కులపేటలో సభ ఎందుకు నిర్వహిస్తున్నారని అధికారులను నిలదీశారు.

Dwaraka

ఒకే వేదికను పంచుకున్న కమల్, రజనీ

కౌలాలంపూర్ : రాజకీయ రంగ ప్రవేశంపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో తమిళ సూపర్‌స్టార్లు కమల్‌హాసన్, రజనీకాంత్ శనివారం ఇక్కడ జరుగుతున్న ఒక చారిటీ కార్యక్రమంలో వేదిక పంచుకున్నారు. రాజకీయాల్లోకి వస్తున్నట్లు రజనీకాంత్ ఇప్పటికే ప్రకటించగా, కమల్ హాసన్ మాత్రం ఆ మేరకు గట్టి సంకేతాలు పంపుతున్నారు. దక్షిణ భారత చలనచిత్ర కళాకారుల సమాఖ్యకు కొత్త భవనాన్ని నిర్మించేందుకు నిధులు సేకరణ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వీరిద్దరు పాల్గొన్నారు. నటీనటులు, సంగీతదర్శకులతో సహా 200మందికి పైగా ఇందులో పాల్గొన్నారు.



దిగ్గజాల కలయిక

మలేసియాలోని కౌలాలంపూర్‌లో శనివారం తమిళ సినీ తారలు నిర్వహించిన ఓ ఛారిటీ షోకు హాజరైన దక్షిణాది సూపర్ స్టార్లు కమలహాసన్, రజనీకాంత్

కాశ్మీర్‌లో ఉగ్రపంజా.. నలుగురు పోలీసులు మృతి

శ్రీనగర్: జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాదులు రెచ్చిపోయారు. పెట్రోలింగ్ బృందమే లక్ష్యంగా బాంబు పేల్చారు. బారాముల్లా జిల్లాలో చోటు చేసుకున్న ఈ ఘటనలో నలుగురు పోలీసులు ప్రాణాలు కోల్పోగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. రిమోర్ట్ సాయంతో బాంబు పేల్చినట్టు పోలీసు ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. బారాముల్లా జిల్లా సోపోర్ పట్టణంలోని ఛోటా బజార్-బడా బజార్ లైన్‌లో ఉగ్రవాదులు ఇదివరకే ఐఈడీ బాంబు అమర్చారు. కాగా.. పోలీసు బృందం రోజువారీ విధుల్లో భాగంగా శనివారం ఉదయం పెట్రోలింగ్‌కు బయలు దేరింది. వారు ఛోటా బజార్-బడా బజార్ లైన్‌కు రాగానే ఉగ్రవాదులు రిమోర్ట్‌తో బాంబును పేల్చివేశారు. ఘటనలో నలుగురు పోలీసులు చనిపోయారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. పేలుడు ధాటికి ఘటనా స్థలిలో మూడు షాపులు ధ్వంసమయ్యాయి. పేలుడు నేపథ్యంలో ఆ ప్రాంతంలో షాపులను యజమానులు మూసివేసి ఉంచారు. ఘటన పట్ల జమ్మూకాశ్మీర్ సీఎం మెహబూబా ముఫ్తీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరు పోలీసులు త్వరగా కోలుకోవాలని ఆమె ఆకాంక్షించారు. ముష్కరుల దుశ్చర్యను తీవ్రంగా ఖండించారు.

మరోవైపు దాడికి తమదే బాధ్యత అని జైషే మహమ్మద్ ఉగ్రవాద సంస్థ ప్రకటించింది. అంతేకాక.. భవిష్యత్తుల్లో ఇలాంటి దాడులు మరిన్ని చేస్తామని హెచ్చరించింది. పుల్వామాలో సీఆర్‌పీఎఫ్ క్యాంప్‌పై ఉగ్రదాడి జరిగిన కొద్ది రోజులకే ఈ ఘటన చోటు చేసుకోవడం గమనార్హం. ఆనాటి దాడిలో ఐదుగురు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. ముగ్గురు ఉగ్రవాదులను సైన్యం మట్టుబెట్టింది. ఈ దాడికి తమదే బాధ్యత అంటూ జైషే వెల్లడించిన సంగతి తెలిసిందే. గతనెలలో జరిగిన జైషే టాప్ కమాండర్ నూర్ తంత్రాయ్ ఎన్‌కౌంటర్‌కు ప్రతీకారంగానే ఈ దాడులు జరుగుతున్నట్టు తెలుస్తున్నది.

సహకారం పెంపునకు చర్యలు

ఆసియాన్ మేథో సంస్థలను కోరిన సుష్మా స్వరాజ్



జకార్తా (ఇండోనేషియా) : సముద్ర తీరప్రాంత సహకారాన్ని మెరుగుపరుచుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలను సూచించాలని, చర్చల క్రమాన్ని బలోపేతం చేయాలని ఆసియాన్ దేశాల మేథో చింతనా సంస్థలను భారత విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ కోరారు. ఆసియాన్ 5వ రౌండ్ టేబుల్ సమావేశాన్ని శనివారం ఇక్కడ ఆమె ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతూ ఆమె, మరో మూడు వారాల్లో ఆసియాన్-భారత్ సదస్సుకు భారత్ ఆతిథ్యం ఇవ్వనున్న నేపథ్యంలో ఈ సమావేశం జరుగుతోందని పేర్కొన్నారు. భారత్-ఆసియాన్ సంబంధాలు ఏర్పడి 25ఏళ్ళు పూర్తయిన సందర్భంగా సదస్సును ఏర్పాటు చేయనున్నారు. ఈనెల 25న ఢిల్లీలో జరగనున్న సదస్సులో ముఖ్యమైన అంశాలపై చర్చ జరుగుతుందని అన్నారు. వాణిజ్య, విద్యా సాంస్కృతిక రంగాల్లో సహకారం పెంపునకు చర్యలు సూచించాలని ఆమె కోరారు. భారత గణతంత్ర దినోత్సవం రోజున 10మంది ఆసియాన్ నేతలు అతిథులుగా హాజరవడం తమకు గౌరవప్రదమని సుష్మా వ్యాఖ్యానించారు. అంతకుముందు ఆమె ఆసియాన్ ప్రధాన కార్యదర్శితో భేటీ అయ్యారు.

మీసా భారతిపై రెండో ఛార్జిషీటు

ఫిబ్రవరి 5న ఢిల్లీ హైకోర్టులో విచారణ

పాట్నా : లాలూ ప్రసాద్ కుమార్తె మీసా భారతిపై మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడి) శనివారం రెండో ఛార్జిషీటు దాఖలు చేసింది. దీనిపై ఫిబ్రవరి 5వ తేదీన కోర్టు పరిశీలించనుంది. 2017 డిసెంబర్ 23వ తేదీన ఈడి మీసా భారతి, ఆమె భర్త శైలేష్‌కుమార్‌పై మొదటి ఛార్జీషీటును దాఖలు చేసింది. ఢిల్లీలోని బిజాస్వాన్ ప్రాంతంలో ఉన్న వారి ఫామ్‌హౌస్‌ను ఎటాచ్ కూడా చేసింది. భారతి, కుమార్‌లు మిషైల్ ప్యాకర్స్ అండ్ ప్రింటర్స్ పేరుతో సంస్థను నిర్వహించారని, 2008-09లో రు.1.2 కోట్లను మళ్లించారని తెలిపారు. అలాగే సురేంద్రకుమార్‌జైన్, వీరేంద్ర జైన్ అనే ఇద్దరు డమ్మీ కంపెనీలతో డబ్బును మళ్లించారని ఈడి పేర్కొంది. ఛార్టర్డ్ ఎకౌంటెంట్ అగర్వాల్‌నూ అరెస్టు చేసింది. మిషైల్ కంపెనీలో జైన్ సోదరులు రు. 90 లక్షలు షేర్ల రూపంలో పెట్టుబడులు పెట్టారని తెలిపారు. సంస్థను తుగ్లక్ రోడ్ అడ్రస్‌తో నమోదు చేయించారని, కానీ బిజాస్వాన్‌లోని వారి సంస్థలోనే మీసా భారతి కార్యకలాపాలు నిర్వహించారని తెలిపారు. ఈ కేసులో ఇద్దరి స్టేట్‌మెంట్లను దర్యాప్తు సంస్థ నమోదు చేసింది. ఈ వ్యవహారంలో జైన్ బ్రదర్స్, అగర్వాల్ కీలక పాత్ర పోషించారని దర్యాప్తు సంస్థ తెలిపింది.

17న స్కీం వర్కర్ల దేశవ్యాప్త సమ్మె

- పిలుపునిచ్చిన కార్మిక సంఘాలు
- 30న జైల్ భరో ఆందోళన

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జైల్ భరో ఆందోళన (సామూహిక అరెస్టులు) చేపట్టాలని పలు కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. న్యూఢిల్లీలోని ఎఐటియుసి భవన్‌లో శనివారం ఢిల్లీ స్థాయిలో కార్మిక సంఘాల ఉమ్మడి సమావేశం జరిగింది. ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ న్యూఢిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్‌లో ఈ నెల 30న సామూహిక అరెస్టులకు కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి.

దాదాపు 10 కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 17న దేశ వ్యాప్తంగా స్కీం వర్కర్లు తమ డిమాండ్ల సాధనకై సమ్మె జరపనున్నారు. ఈ సమ్మెలో 50 లక్షల మందికి పైగా స్కీం వర్కర్లు పాల్గొననున్నారు.



న్యూఢిల్లీలో కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగులు ఇటీవల నిర్వహించిన ధర్నాలో ప్రసంగిస్తున్న సిఐటియు అఖిల భారత ప్రధానకార్యదర్శి తపన్ సేన్

స్కీం వర్కర్ల డిమాండ్లు

1. స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి వారికి వర్తించే హక్కులు కల్పించాలి
2. సామాజిక భద్రత కింద ఇపిఎఫ్, ఇఎస్‌ఐ వంటి పథకాలను వర్తింప చేయాలి. నెలకు రూ.3 వేలు తక్కువ కాకుండా పెన్షన్ వర్తింప చేయాలి
3. కనీస వేతనం నెలకు. రూ. 18 వేలు తక్కువ కాకుండా ఉండాలి
4. పథకాలను ప్రైవేటీకరణ చేయకూడదు

తదితర డిమాండ్లతో స్కీం వర్కర్లు సమ్మెబాట పట్టనున్నారు.

స్కీమ్ వర్కర్లు జరపనున్న సమ్మెకు ఈ సందర్భంగా కార్మిక సంఘాలు మద్దతు ప్రకటించాయి. అంగన్వాడి, మిని-అంగన్వాడీలు, సమగ్ర శిశు అభివృద్ధి సేవల పథకం(ఐసిడిఎస్ఎస్), మధ్యాహ్న భోజన పథకం, జాతీయ ఆరోగ్య మిషన్, నేషనల్ రూరల్ లైవ్లీహుడ్స్ మిషన్, జాతీయ బాల కార్మికుల ప్రాజెక్టు, సర్వశిక్ష అభియాన్, చిన్నమొత్తాల పొదుపు పథకం తదితర పథకాలకు చెందిన కార్మికులందరూ ఈ నెల 17న జాతీయ స్థాయిలో సమ్మెలో పాల్గొంటున్నారు. . అత్యధిక కార్మికులకు భాగస్వామ్యం కల్పిస్తూ జిల్లా స్థాయిలో కూడా జైల్ భరో కార్యక్రమాలు జరుగుతాయని, అదే క్రమంలో స్కీం వర్కర్ల సమ్మె కూడా కొనసాగుతుందని సిఐటియు అఖిల భారత ప్రధానకార్యదర్శి తపన్‌సేన్ తెలిపారు. ఉమ్మడి కార్మిక సంఘాల కేంద్ర కమిటీ నిర్ణయించిన మేరకు నిరవధిక సమ్మెకు వెళ్ళడానికి ముందు దేశ వ్యాప్తంగా మరిన్ని ఆందోళనలు, సమ్మెలు జరుగుతాయని ఆయన తెలిపారు.

ఈ మొత్తం వ్యవస్థకు ఆషా, మధ్యాహ్న భోజన పథకం కింద పనిచేస్తున్న హెల్పర్లు వెన్నెముకలాంటి వారని, ఈ పథకాలను ముందుకు తీసుకెళ్ళడంలో వారు కీలక పాత్ర పోషిస్తున్నారని, అటువంటి వారికి చాలా చోట్ల కేవలం నెలకు రూ.15 వందలు మాత్రమే వేతనంగా చెల్లిస్తున్నారని, ఇది చాలా అన్యాయమని ఎఐసిసిటియుకు చెందిన శ్వేతరాజ్ తెలిపారు. వారికి వేతనంగా నెలకు రూ.18 వేలు చెల్లించాలన్నది తమ డిమాండని పేర్కొన్నారు. హింద్ మజ్దూర్ సభ (హెచ్ఎమ్ఎస్)కు చెందిన నారా యణసింగ్ మాట్లాడుతూ మహాపడవ్ కార్మికులు నిర్వహించిన మూడు రోజుల సమ్మె మోడి ప్రభుత్వాన్ని వణికించిందన్నారు. గత ఏడాది డిసెంబరులో లక్షలాది మంది కార్మికులు ఢిల్లీ చేరుకుని మహాపడవ్‌లో పాల్గొన్నారన్నారు. వేతనాల పెంపుపై తక్షణమే దృష్టి సారించాలని, ధరలు నియంత్రించాలని, విదేశీ పెట్టుబడులను ఆహ్వానించడం, సంక్షేమం పథకాల్లో కోతలు తదితరాలపై దృష్టి సారించాలని, ప్రైవేటీకరణ విధానాలను నిలిపివేయాలని డిమాండ్‌చేస్తు న్నట్లు ఆయన చెప్పారు. కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలని, ఉద్యోగాలు కోల్పోకుండా చూడాలని కూడా డిమార్ చేస్తున్నట్లు ఆయన చెప్పారు. దీనిపై తపన్‌సేన్ మాట్లాడుతూ ప్రధాన మీడియా ఛానల్స్ పూర్తిగా అడ్డుకున్నప్పటికీ, మహాపడవ్ సందేశం దేశ వ్యాప్తంగా విస్తరించిందన్నారు. ఈ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్ళడానికి కార్మికులు ఎంతో ఉత్సాహం ప్రదర్శించారన్నారు.

సిఐటియు, ఎఐసిసిటియు, ఎఐటియుసి, హెచ్ఎమ్ఎస్‌తో పాటు ఇతర కార్మిక సంఘాలు ఎఐయుటియుసి, టియుసిసి, ఐఎన్‌టియుసి, ఎస్ఇడబ్ల్యుఎ, యుటియుసి, ఎల్‌పిఎఫ్, ఎంఇసి ఢిల్లీలో జరిగిన సమావేశంలో పాల్గొన్నాయి.

లాలూకు మూడున్నరేళ్లు జైలు శిక్ష

న్యూఢిల్లీ : పశుగ్రాసం కుంభకోణం కేసులో బీహార్ మాజీ ముఖ్యమంత్రి, ఆర్‌జెడి లాలూ ప్రసాద్ యాదవ్‌కు సిబిఐ ప్రత్యేక కోర్టు శనివారం మూడున్నర ఏళ్ల జైలుశిక్ష విధించింది. ప్రజా పద్దుల కమిటీ (పిఎసి) మాజీ ఛైర్మన్ జగదీష్ శర్మ, ఆర్‌జెడి మాజీ నేత ఆర్‌కె రాణాలకు వరుసగా ఏడేళ్లు, మూడున్నర ఏళ్ల జైలు శిక్ష విధించింది. ఐఎఎస్ అధికారులు ఫూల్ చంద్ సింగ్, బెక్ జులియస్, మహేష్ ప్రసాద్, సబీర్ భట్టాచార్జీలకు మూడున్నర ఏళ్లు, డాక్టర్ క్రిష్ణ కుమార్‌కు ఏడు సంవత్సరాలు జైలు శిక్ష విధించింది. సరఫరా, రవాణాదారులు రాజా రామ్ జోషి, సునీల్ కుమార్ సిన్హా, సుశీల్ కుమార్ సిన్హాలకు మూడున్నర సంవత్సరాలు జైలు శిక్ష విధించగా, ఈ కేసులో మిగిలిన ఐదుగురు దోషులు త్రిపురారి మోహన్ ప్రసాద్, సంజయ్ అగర్వాల్, సునీల్ గాంధీ, జ్యోతి ఝా, గోపినాథ్ దాస్‌లకు ఏడున్నర ఏళ్ల జైలు శిక్ష విధించింది. లాలూ ప్రసాద్ యాదవ్‌కు భారత శిక్షాస్మృతి కింద రూ 5 లక్షలు, అవినీతి నిరోధక చట్టం కింద మరో రూ. 5 లక్షలు మొత్తం రూ. 10 లక్షలు జరిమానా కూడా విధించారు. జరిమానా చెల్లించకపోతే మరో ఆరు నెలల జైలు శిక్ష అమలు చేస్తారు. ఈ కేసుకు సంబంధించిన 16 మంది దోషులకు కూడా సిబిఐ న్యాయమూర్తి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శిక్ష విధించారు. లాలూ ప్రసాద్ యాదవ్‌తో సహా దోషులంతా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా న్యాయమూర్తి ఎదుట హాజరయ్యారు. శనివారం సాయంత్రం దోషులకు శిక్ష ఖరారు చేశారు. మధ్యాహ్నం రెండు గంటలకు శిక్షలను ఖరారు చేయాల్సి వుంగడా, వాద ప్రతివాదాలు మధ్నాహ్నం వరకు కొనసాగాయి. ఈ కేసులో లాలూతో సహా 16 మందిని దోషులుగా ప్రకటిస్తూ గత నెల 23న సిబిఐ ప్రత్యేక కోర్టు తీర్పు ఇచ్చింది. ఈ నెల 3న శిక్షలను ఖరారు చేయాల్సి వుంది, అయితే ఒక న్యాయవాది మృతి చెందడంతో దానిని వాయిదా వేశారు. తరువాత మరో రెండు సార్లు తీర్పును వాయిదా వేశారు. హైకోర్టులో బెయిల్ కోసం పిటిషన్ వేస్తామని లాలూ ప్రసాద్ తనయుడు తేజ్ ప్రతాప్ యాదవ్ తెలిపారు.



'బిజెపి చాలా సులువైన న్యాయాన్ని అనుసరిస్తోంది. మమల్ని ఫాలో అవ్వండి లేదా మిమ్మల్ని ఇరికిస్తాం అన్నదే దాని నియమం. సామాజిక న్యాయం, సామరస్యం, సమానత్వాలను వారు సులువుగా కాలరాస్తారు.'

- తీర్పు అనంతరం ట్విట్టర్‌లో లాలూ విమర్శ

ఆర్థిక సంక్షోభానికి మోడి, జైట్లీలే కారణం

రాహుల్



న్యూఢిల్లీ : దేశంలో ఆర్థిక సంక్షోభానికి కారణమైన కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ శనివారం దాడికి దిగారు. జిడిపిని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అనుసరిస్తున్న "గ్రాస్ డివిజన్ పాలిటిక్స్(స్థూల విభజన రాజకీయాలు)గా అభివర్ణించారు.

పెట్టుబడులు, బ్యాంకు రుణాలలో వృద్ధి, ఉపాధి కల్పన, వ్యవసాయ వృద్ధి తదితరాల మందగించడంపై ప్రధాన మంత్రి మోడి, ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. "13 ఏళ్ళ దిగువకు కొత్త పెట్టుబడులు, 63 ఏళ్ళ దిగువకు బ్యాంకు రుణాల వృద్ధి, 8 ఏళ్ళ దిగువకు ఉపాధి కల్పన, వ్యవసాయ జివిఎ వృద్ధి 1.7 శాతం దిగువకు, 8 ఏళ్ళ ముందునాటి స్థితికి ఆర్థిక లోటు చేరుకోవడంతోపాటు అర్ధంతరంగా నిలిచిపోయిన ప్రాజెక్టు లను దేశానికి ఇచ్చేందుకు ఆర్థిక మంత్రి జైట్లీ మేధస్సు మోడీ స్థూల విభజన రాజకీయాలు (జిడిపి)తో చేతులు కలిపింది" అని రాహుల్ ట్వీట్ చేశారు. గత ఏడాది సాధించిన 7.1 శాతం కంటే దిగువకు ఈ ఏడాది ఆర్థిక వృద్ధి రేటు ఉండనున్నదని సెంట్రల్ స్టాటిస్టిక్స్ ఆఫీస్ (సిఎస్ఓ) పేర్కొన్నట్లు వెలువడిన ఒక వార్తా కథనాన్ని కూడా రాహుల్ ట్వీట్ చేశారు. జిఎస్‌టి అమలు, అటు తరువాత తయారీ రంగంలో ఏర్పడిన మందగమనం భారత వృద్ధి రేటును 2017-2018లో 6.5 శాతానికి దిగజారుతుందని భావిస్తు న్నట్లు అధికార గణాంకాలు శుక్రవారం వెల్లడించాయి.

రాహుల్‌పై ప్రివిలైజ్ నోటీసు లోక్‌సభకు..

న్యూఢిల్లీ : రాజ్యసభ ఛైర్మన్ ఎం. వెంకయ్య నాయుడు శనివారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీపై ప్రివిలైజ్ నోటీసును లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్‌కు పంపారు. రాహుల్‌పై తదుపరి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆయన నోటీసు పంపారు. రాహుల్ గాంధీ దిగువ సభ సభ్యుడైనందున ఆయనపై తదుపరి చర్య తీసుకోవా లని కోరుతూ వెంకయ్య నాయుడు నోటీసు పంపినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. రాహుల్ గాంధీపై ఇప్పటికే ఒక ఫిర్యాదు లోక్‌సభ ఎథిక్స్ కమిటీ వద్ద పెండింగ్‌లో ఉంది. రాజ్యసభ అధికారాన్ని, దాని నిర్ణయాన్ని ప్రశ్నిస్తూ రాహుల్ గాంధీ ఒక ట్వీట్‌చేశారు. దీనిపై బిజెపి నేత, రాజ్య సభ సభ్యుడు భూపిందర్ యాదవ్ రాహుల్‌కు ప్రివిలైజ్ నోటీసు జారీ చేశారు. రాహుల్ గాంధీ ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీని కించపరిచే విధంగా మాట్లాడారని ఇది సభా హక్కుల ఉల్లంఘనే అని యాదవ్ పేర్కొన్నారు.

హిమపాతంతో ఆరుగురు మృతి

శ్రీనగర్ : ఉత్తర కశ్మీర్ కుప్వారా జిల్లాలో ఓ వాహనంపై భారీ మంచు చరియ విరిగి పడిన ఘటనా స్థలం నుండి ఆరుగురి మృతదేహాలను గుర్తించినట్లు శనివారం పోలీసు అధికారి పేర్కొన్నారు. సాధ్నా టాప్ ప్రాంతంలో కుప్వారా - తంగదర్ రోడ్డులో శుక్రవారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. సహాయక చర్యలు ప్రారంభించామని, గత రాత్రి నుండి మొత్తం ఆరు మృతదేహాలు లభ్యమయ్యాయని డిప్యూటీ కమిషనర్ ఖలీద్ జహంగీర్ పేర్కొన్నారు. ఈ ఘటనాస్థలి నుండి ముగ్గురుని రక్షించామని, సహాయక చర్యలు కొనసాగుతున్నాయని అధికారి పేర్కొన్నారు.

వెలువడిన త్రిపుర తుది ఓటర్ల జాబితా

అగర్తలా : త్రిపుర తుది ఓటర్ల జాబితా ప్రచురితమైంది. 25,69,216 ఓటర్ల పేర్లతో ఈ జాబితాను వెలువరించినట్లు ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఓ) టి.శ్రీరామ్ తెలిపారు. మొట్టమొదటిసారిగా స్త్రీ, పురుషులు కాకుండా థర్డ్ జెండర్ (హిజ్రా)కు అవకాశాన్ని కూడా ఈ జాబితాలో పొందుపరిచామన్నారు. ఈ కేటగిరీలో 11మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారని చెప్పారు. మిగిలిన 25,69,205 మందిలో పురుషులు 13,03,420 కాగా, మహిళలు 12,65,785మంది. రాష్ట్రంలోని వివిధ వర్గాల నుండి వచ్చిన అభ్యంతరాలన్నీ పరిశీలించిన మీదట శుక్రవారం తుది జాబితాను ప్రచురించారు. ఈ ఏడాది మొదటి అర్ధ భాగంలో త్రిపుర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఓటర్ల జాబితా సవరణ సందర్భంగా 98,064మంది ఓటర్లను తొలగించారు. మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకునేవారు 47,800మంది వున్నారు. మొత్తంగా 60 స్థానాల్లో బాదర్‌ఘాట్ అసెంబ్లీ నియోజకవర్గంలో గరిష్ట సంఖ్యలో 57,394మంది ఓటర్లుండగా, కార్బక్ నియోజకవర్గంలో అత్యల్పంగా కేవలం 34,699మందే వున్నారు. రాష్ట్రంలోని 3,214 పోలింగ్ కేంద్రాల్లో, తహసిల్ కార్యాలయాల్లో, ఓటర్ల నమోదు కార్యాలయాల్లో ఈ ఓటర్ల జాబితా అందుబాటులో వుంటుందని సిఇఓ తెలిపారు. ఓటర్ల ఫోటో గుర్తింపు కార్డులు అందరికీ అందేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

ఉత్తర ప్రదేశ్‌లో మహిళపై సామూహిక అత్యాచారం

బండా (ఉత్తరప్రదేశ్) : బండా ప్రాంతంలోని భదవాల్ గ్రామ సమీపంలోని అడవిలో ఒక మహిళ సామూహిక అత్యాచారానికి గురైంది. ముగ్గురు సాయుధులు ఆమెపై అత్యాచారం జరిపారు. ఆమె భర్తను, మరిదిని తుపాకీతో బెదిరించి నిర్బంధంలోకి తీసుకున్న తరువాత ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారని శనివారం పోలీసులు తెలిపారు. బాధితురాలు తన కుటుంబ సభ్యులతో కలిసి బండా-చిత్రకూట్ సరిహద్దులోని ఒక నదిని దాటుతుండగా ఈ సంఘటన జరిగిందని వారు తెలిపారు. చిత్రకూట్ జిల్లాకు చెందిన బాధితురాలు తన బంధువులను కలుసుకునేందుకు భర్త, మరిదితో కలిసి శుక్రవారం గౌరిఖాన్‌పూర్ గ్రామానికి వచ్చిందని అడిషనల్ పోలీస్ సూపరింటెండెంట్ లాల్ భరత్ కుమార్ పాల్ తెలిపారు. వారు తిరిగి స్వగ్రామానికి చేరుకుంటున్న సమయంలో భదవాల్ గ్రామ సమీపంలో సాయుధులు వారిని నిర్బంధించారని ఆయన చెప్పారు. సమీప అడవిలో ఉన్న ఒక గుడిసెలోకి తీసుకెళ్ళి ఆమెపై అత్యాచారం జరిపారని పాల్ తెలిపారు. బాధితురాలిపై అత్యాచారం జరిపిన వెంటనే దుండగులు అక్కడ నుంచి పారిపోయారని చెప్పారు ఈ సంఘటనకు సంబంధించి అందిన ఫిర్యాదు మేరకు ఆ ముగ్గురు దుండగులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని తెలిపారు. దుండగుల కోసం పోలీసులు గాలిస్తున్నారని, బాధితురాలని వైద్య పరీక్షలకు పంపామని ఆయన వెల్లడించారు.

తమిళనాడులో మూడో రోజూ కొనసాగిన ఆర్టీసి సమ్మె

చెన్నై : తమిళనాడు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన కొన్ని ఉద్యోగ సంఘాలు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారానికి మూడో రోజుకు చేరింది. వేతన సంబంధిత సమస్యల పరిష్కారాన్ని కోరుతూ వీరు సమ్మె చేస్తున్నారు. పలువురు ఉద్యోగులు విధులకు హాజరయ్యారని, బస్సులు యథాతథంగా నడుస్తాయని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నప్పటికీ చేసినప్పటికీ, మూడో రోజు బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. కాగా, కార్మిక సంఘాలతో చర్చలు జరిపి ప్రతిష్టంభనకు ముగింపు పలకాలని ప్రతిపక్ష డిఎంకె మరో మారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. అసెంబ్లీ లో ప్రతిపక్ష నేత ఎంకె స్టాలిన్ ఫోన్‌లో ఈ అంశంపై ముఖ్యమంత్రి పళనిస్వామితో చర్చించారు. ఆర్‌టి సి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికై చర్చలు జరపాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ సంఘీభావం

న్యూఢిల్లీ (ఇండియా న్యూస్‌నెట్‌వర్క్) : తమ డిమాండ్ల సాధనకై గత మూడు రోజులుగా సమ్మె బాట పట్టిన తమిళనాడు రాష్ట్ర రవాణా ఉద్యోగులకు ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్) మద్దతు, సంఘీభావం ప్రకటించింది. ఈ మేరకు ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ జనరల్ సెక్రటరి కె.కె. దివాకరన్ ఒక ప్రకటన జారీ చేశారు. రవాణా ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ తమిళనాడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సహేతుకంగా, న్యాయం కోసం పోరాడుతున్న తమిళనాడు రాష్ట్ర రవాణా ఉద్యోగుల సంఘాలను ఎఐఆర్‌టిడబ్ల్యు ఎఫ్ అభినందించింది.కార్మిక సంఘాలతో చర్చించి ఉద్యోగుల సమస్యలను సామరస్య పూర్వకంగా పరిష్కరించాలని తమిళనాడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

ఆర్టీసి ఎస్‌డబ్ల్యూఎఫ్ మద్దతు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మోటారు వాహన చట్ట సవరణ బిల్లును పార్లమెంట్ ప్రవేశపెట్టడాన్ని నిరసిస్తూ తమిళనాడులో ఆర్టీసి కార్మికులు చేపట్టిన సమ్మెకు మద్దతు తెలుపు తున్నట్లు ఎపిఎస్ ఆర్టీసి ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌కె జిలానీ బాషా, ప్రధాన కార్యదర్శి సిహెచ్ సుందరయ్య, ప్రచార కార్యదర్శి అయపరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 95 శాతం కార్మికులు సమ్మెలో ఉన్నారని పేర్కొన్నారు.

నిరసన

మీరే వండుకొని తినండి !

సిఎం, గవర్నర్ నివాసాల వద్ద ఆలుగడ్డలు పారబోసిన రైతులు

మద్దతు ధర దక్కకపోవడంతో యుపిలో వినూత్న రీతిలో నిరసన



ఉత్తరప్రదేశ్‌లోని విధాన సభ వద్ద రైతులు పారపోసిన బంగాళాదుంపలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో బంగాళదుంపలు పండించే రైతులు మద్దతు ధర లభించకపోవడంతో శనివారం వినూత్న రీతిలో తమ నిరసన వ్యక్తం చేశారు. మార్కెట్‌లో తక్కువ ధరకు అమ్ముకోలేక వాటిని వెనక్కి తీసుకొచ్చి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, గవర్నరు రాం నాయక్ నివాసాల వద్ద పారబోశారు. 'మీరే వండుకొని తినండి' అనే భావం స్ఫురించేలా వందలాది కిలోల బంగాళదుంపలను వీరి నివాసాలతో పాటు విధానసభ వెలుపల పారబోశారు. అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే ఈ ప్రాంతాల్లో ఉదయం వేకువజామునే వీటిని పారబోసినట్లు తెలుస్తోంది. ప్రభుత్వాధినేతలకు సంబంధించిన ప్రధాన పాలక భవనాల పరిసరాలు ఎటుచూసినా బంగాళదుంపలతో నిండిపోయి కనిపించడంతో ప్రభుత్వ యంత్రాంగం, భద్రతా వ్యవస్థ కంగుతినింది. దీనిపై లక్నో సీనియర్ ఎస్‌పి దీపక్ కుమార్ మాట్లాడుతూ, బంగాళాదుంపలు పారబోసిన వాహనాలను గుర్తించామని, వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు నిరసనగానే ఈ చర్య చేపట్టామని రైతులు చెప్పారు. తాము వేసిన పంటకు కనీస మద్దతు ధర లభించకపోవడంతో తమ కష్టమంతా వృధా అయిపోయిందంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బంగాళాదుంపల ధరలు క్షీణించకుండా బిజెపి ప్రభుత్వం చర్యలేమీ తీసుకోలేదని విమర్శిస్తున్నారు.

మండీల్లో కారుచౌకగా అమ్మేయాల్సివస్తోందని, మద్దతు ధర కల్పించాలని పదేపదే మొరపెట్టుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని భారతీయ కిసాన్ యూనియన్ నేత హర్నమ్ సింగ్ వర్మ చెప్పారు. పండించిన పంటలు నిల్వ చేసుకునేందుకు కూడా దిక్కులేదని ఆయన వాపోయారు. మద్దతు ధర కల్పిస్తామని, కోల్డ్ స్టోరేజీలు నిర్మిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోయిందని విమర్శించారు.

సంక్షిప్తం

సభ్యుల తీరు అభినందనీయం : వెంకయ్య

న్యూఢిల్లీ : 15 ఏళ్ల తరువాత రాజ్యసభలో ప్రశ్నోత్తరాలు పూర్తి స్థాయిలో జరిగాయని ఛైర్మన్ ఎం.వెంకయ్యనాయుడు హర్షం వ్యక్తం చేశారు. కులభూషణ్ జాదవ్ విషయంలో పార్టీలకు అతీతంగా వ్యవహరించినందుకు సభ్యులను ఆయన అభినందించారు. జాదవ్‌ను ఆయన కుటుంబ సభ్యులు కలుసుకునే విషయంలో అన్ని పక్షాలూ మద్దతుగా నిలిచాయని, ఇదే విధంగా భవిష్యత్‌లోనూ సమస్యలపై సమన్వయంతో వ్యవహరించాలని ఆయన కోరారు. అనేక అంశాలపై సభ్యులు సంయమనంతో వ్యవహరించారని పేర్కొన్నారు. రాజ్యసభలో వివిధ రాజకీయ పక్షాల సభ్యులు ఉన్నారని, కానీ పార్లమెంటులో రాజకీయాలకు తావులేదని అన్నారు.

ముంబయి పబ్ యజమాని అరెస్ట్

ముంబయి : కమలా మిల్స్ అగ్ని ప్రమాదం కేసులో మెజో బిస్ట్రో పబ్ యజమానుల్లో ఒకరైన యోగ్ పతక్‌ను శనివారం ఎన్ఎం జోషి మార్గ్ పోలీసులు అరెస్టు చేశారు. గత డిసెంబర్ 29న ముంబయిలో భారీ అగ్ని ప్రమాదం సంభవించి, 14 మంది మృతి చెందిన సంగతి తెలిసిందే. పబ్‌లో హుక్కా వినియోగం ద్వారా నిప్పు రవ్వలు ఎగసి మంటలు వ్యాపించాయంతో అగ్ని ప్రమాదం సంభవించిందని అగ్నిమాపక సిబ్బంది నివేదికిచ్చిన నేపథ్యంలో యోగ్ పతక్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

ముస్లింలు రొయ్యలు తినకూడదంటూ ఫత్వా జారీ

హైదరాబాద్ : ముస్లింలు రొయ్యలు, పీతలు తినకూడదంటూ హైదరాబాద్‌కి చెందిన జామియా నిజామియా సంస్థ ఫత్వా జారీ చేసి వివాదానికి తెర తీసింది. అలా తినడం ఇస్లాంలో పాపమని పేర్కొంది. దేశంలో అత్యంత పురాతనమైన ఇస్లామిక్ సంస్థల్లో ఒకటైన జామియా నిజామియాను 1976లో నిర్మించారు. పీతలు, రొయ్యలనేవి చేపల కేటగిరీలోకి రావని, అందువల్ల ముస్లింలు అవి తినరాదని, తింటే పాపమని పేర్కొంటూ జనవరి 1వ తేదిన ఫత్వా జారీ చేసింది. జామియా నిజామియా ప్రధాన గురువు ముఫ్తి మహ్మద్ అజీముద్దిన్ ఈ ఫత్వా జారీ చేశారు. ముస్లింలు భారత్ మాతా కీ జై అనరాదని ఫత్వా జారీ చేసి 2016లో కూడా ఈ సంస్థ వార్తల్లోకెక్కింది.

వింటర్ ఒలింపిక్స్‌లో పాల్గొంటాం

ఉత్తర కొరియా ప్రకటన

ప్యాంగ్‌చాంగ్ : దక్షిణ కొరియాలో వచ్చే నెల్లో జరిగే వింటర్ ఒలింపిక్స్‌లో తమ దేశం పాల్గొంటుందని ఉత్తర కొరియా ఒలింపిక్ కమిటీ ప్రతినిధి ఒకరు శనివారం తెలిపారు. వచ్చే వారం చర్చలు జరిపేందుకు ఉభయ కొరియాలు అంగీకరించిన ఒక రోజు తర్వాత అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసి)లో ఉత్తర కొరియా ప్రతినిధి అయిన చాంగ్ ఉంగ్ వ్యాఖ్యలు వెలువడ్డాయి. సంయుక్త సైనిక విన్యాసాలను కూడా వాయిదా వేస్తామని దక్షిణకొరియా, అమెరికా ప్రకటిం చాయి. కాగా, వింటర్ ఒలింపిక్స్‌లో పాల్గొనేందుకు ఉత్తర కొరియాకు గల అవకాశాలపై చర్చించేందుకు స్విట్జర్లాండ్‌లో జరిగే ఐఓసి సమావేశానికి చాంగ్ వెళతారని భావిస్తున్నారు.

నిరసనలహోరు

ఇరాన్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా విశ్వవిద్యాలయ విద్యార్థులు చేపట్టిన నిరసనలు హోరెత్తాయి. 90 మంది విద్యార్థులు సహా వెయ్యి మందిని పోలీసులు ఇప్పటివరకు అరెస్టు చేశారు. అవినీతి, ధరల పెరుగుదలను నిరసిస్తూ నెల కిందట ఈ ఆందోళనలను ప్రారంభించిన విద్యార్థులు ప్రభుత్వ దమనకాండను ఎదుర్కొంటూనే తమ ఉద్యమాన్ని కొనసాగిస్తుండటం విశేషం.



చైనాలో మంచు తుపాను

13 మంది మృతి

బీజింగ్ : గత మూడు రోజులుగా తూర్పు చైనాలోని అన్హుయి ప్రావిన్స్‌లో భారీగా సంభవించిన మంచు తుపానులో 13మంది మరణించారని స్థానిక అధికారులు తెలిపారు. 2008 తర్వాత ఇంత భారీ స్థాయిలో మంచు తుపాను సంభవించడం ఇదే. ఈ ప్రావిన్స్‌లో మంచు తుపాను దెబ్బకు దాదాపు పది లక్షలమంది ప్రభావితులయ్యారని అధికారులు చెప్పారు. వీరిలో ఎక్కువమంది రైతులే. మంచు తుపాను కారణంగా ఆర్థిక వ్యవస్థకు 19కోట్ల డాలర్ల మేరకు నష్టం వాటిల్లింది. వ్యవసాయం రంగానికి 12.2 కోట్ల డాలర్ల నష్టం సంభవించింది. అన్హుయి ప్రావిన్స్ రాజధాని హెఫైతో సహా తొమ్మిది నగరాల్లో అత్యవసర బృందాలను ఏర్పాటు చేశారు. ఈ వారంలో దాదాపు ఆరు రాష్ట్రాల్లో భారీగా మంచు కురియడంతో తీవ్ర స్థాయిలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. ఈ ఏడాదిలో మొదటిసారిగా బుధవారం నుండి కురుస్తున్న మంచుతో దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో జన జీవనం అస్తవ్యస్థమైంది. శనివారం మధ్యాహ్నానికి జియాంగ్సు ప్రావిన్స్‌లో 13 రహదారులను మూసివేశారు. అన్హుయి ప్రావిన్స్‌లో 51 పర్యాటక స్థలాల్లోని వ్యూ పాయింట్లను మూసివేసినట్లు చెప్పారు.

అన్ని మార్గాలూ మా ముందున్నాయి

పాక్‌ను హెచ్చరించిన అమెరికా

వాషింగ్టన్ : ఉగ్రవాదాన్ని పెంచి పోషించడం మానుకోకుంటే పాకిస్తాన్‌పై చర్యలు తీసుకొనేందుకు అన్ని మార్గాలూ తమ ముందున్నాయని అమెరికా హెచ్చరించింది. హక్కాని, తాలిబన్ ఉగ్రవాద సంస్థలపై నిర్మాణాత్మక చర్యలు తీసుకోవాలని, వాటి స్వర్గధామాలను నిర్మూలించాలని, లేని పక్షంలో పాక్‌పై చర్యలు తీసుకునేందుకు అన్ని మార్గాలు తమ ముందు ఉన్నాయని అమెరికా శనివారం పేర్కొంది. ఉగ్రవాద సంస్థలను నిర్మూలించడంలో విఫలమైన పాక్‌కు తాను అందిస్తానన్న 2బిలియన్ డాలర్ల భద్రతా సహాయాన్ని నిలిపి వేసింది. గత 15 సంవత్సరాలుగా పాక్‌కు 33 బిలియన్ డాలర్ల సహాయాన్ని అందించామని, దానికి బదులుగా ఉగ్రవాదుల స్వర్గ ధామాలు ఇచ్చిందని అమెరికా వ్యాఖ్యానించింది. పాకిస్తాన్‌పై చర్యలకు పలు మార్గాలను తాము పరిశీలిస్తున్నామని, తాలిబన్, హక్కాని నెట్‌వర్క్‌లను అణచివేసేలా పాకిస్తాన్‌కు నచ్చచెప్పే ప్రయత్నం చేస్తున్నామని ట్రంప్ ప్రభుత్వంలోని సీనియర్ అధికారి ఒకరు ఇక్కడ విలేకరులకు తెలిపారు. పాక్‌కు నాన్ నాటో మిత్ర కూటమి హోదాను ఉపసంహరించాలని కొంతమంది చట్ట సభల సభ్యులు ట్రంప్ ప్రభుత్వాన్ని కోరడమే కాకుండా అంతర్జాతీయ ద్రవ్య నిధి, ఐక్య రాజ్య సమితి తదితర సంస్థల ద్వారా దానిపై ఒత్తిడి తేవాలని సూచించారని ఆయన చెప్పారు. అంతేకాకుండా పెంటగాన్ జనరల్స్ కూడా పాక్‌పై ఏకపక్ష చర్యలు తీసుకోవాలని సూచించినట్లు ఆయన చెప్పారు.

బ్రిటన్‌లో ప్రజారోగ్యానికి ముప్పు

- అరకొర నిధులు, ప్రైవేటీకరణ చర్యలే కారణం
- 70వ వార్షికోత్సవం ముంగిట ఎన్‌హెచ్‌ఎస్



మాంచెస్టర్ రాయల్ ఆసుపత్రిలో మూలనపడ్డ అంబులెన్సులు

లండన్ : ఏళ్ళ తరబడి అరకొర నిధులు, ప్రైవేటీకరణ, లాభార్జనే ధ్యేయంగా చర్యలు తీసుకోవడం వంటి కారణాల వల్ల బ్రిటన్‌లోని జాతీయ ఆరోగ్య సేవలు (నేషనల్ హెల్త్ సర్వీస్–ఎన్‌హెచ్‌ఎస్) తీవ్ర విపత్కర పరిస్థితులను ఎదు ర్కొంటున్నాయి. జులై నాటికి ఎన్‌హెచ్‌ఎస్ 70వ వార్షికోత్స వాన్ని జరుపుకుంటోంది. ఇన్నేళ్ళ సుదీర్ఘ పయనంలో కూడా ఇంకా మనుగడ కోసం పోరు సల్పాల్సిన పరిస్థితులు ఎదురుకావడం విచారకరం. ప్రభుత్వాలు తీసుకుంటున్న పొదుపు చర్యలతో ప్రజల ఆరోగ్య పరిస్థితి మరింత దుర్భ రంగా తయారైంది. యాక్సిడెంట్, ఎమర్జన్సీ (ఎఅండ్ఇ) యూనిట్లలో అరకొర సిబ్బంది, తీవ్రమైన రద్దీ వున్న కారణంగా మరింత మంది రోగులు వస్తే వారికి చికిత్స అందించే సామర్థ్యం యూనిట్లకు లేదు. దాంతో ఎవరైనా రోగులు వచ్చినా వారిని వెనక్కి పంపించేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఆస్పత్రుల వెలుపల రోగులతో నిండిన అంబు లెన్సులు క్యూ కట్టి వుంటున్నాయి. ఎన్‌హెచ్‌ఎస్‌కి చెందిన 24 ట్రస్టులు తాజాగా 'బ్లాక్ అలర్ట్'ను ప్రకటించాయి. అంటే 24గంటల పాటు ఆస్పత్రుల్లో ఏ బెడ్స్ కూడా ఖాళీగా లేవని అర్థం. ఆ సమయంలో రోగుల పట్ల సమగ్రంగా జాగ్రత్తలు తీసుకోలేమని స్పష్టం చేశాయి.

దీంతో రోగుల భద్రతపై ముప్పు పెరిగింది. ఇప్పటికి సరిగ్గా ఏడాది క్రితం రెడ్‌క్రాస్ ఒక ప్రకటన జారీ చేసింది. ఎన్‌హెచ్‌ఎస్ మానవతా సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని పేర్కొంది. ఇదంతా కూడా ఉద్దేశ్యపూర్వకంగా సృష్టించిన సంక్షోభమేననేది మెజారిటీ డాక్టర్ల, రోగుల, ట్రస్టుల భావన. 2010 నుండి ఎన్‌హెచ్‌ఎస్‌కు వనరులు క్షీణిస్తూ వచ్చాయి. 'ఎఫిషియన్సీ సేవింగ్స్' (పొదుపు సమర్థత)ను పెంచుకోవాలని ఆస్పత్రు లపై ఒత్తిడి పెరుగుతుండడంతో కోట్లాది డాలర్లు అందులోకి వెళ్లిపోతున్నాయి. ఈ క్రమం 2020వరకు కొనసాగనుంది. దీంతో కేంద్ర ప్రభుత్వం నుండి ఎన్‌హెచ్‌ఎస్‌కు అందే నిధులు తగ్గిపోతున్నాయి. 2010కి ముందు ఎన్‌హెచ్‌ఎస్‌కి నిధుల కేటాయింపు దాదాపు నాలుగు శాతం వుండేది. కానీ అ తర్వాత సగటున 1.2శాతం మేర కేటాయింపులు పెరుగుతున్నాయి. 2016 వచ్చేసరికి ఎన్‌హెచ్‌ఎస్ ట్రస్టులు మొత్తంగా 260కోట్ల పౌండ్ల లోటును నమోదు చేశాయి. సిబ్బంది సంఖ్యను కూడా తగ్గించేశారు. దాదాపు 40వేల నర్సింగ్ పోస్టులు ఖాళీగా వున్నాయి. గత దశాబ్ద కాలంగా అనూహ్యమైన రీతిలో ఆరోగ్య సేవల్లో కోత విధించిన గ్రీస్ కన్నా దారుణమైన పరిస్థితి ప్రస్తుతం బ్రిటన్‌లో వుంది. లేబర్, కన్జర్వేటివ్ నేతృత్వంలోని స్థానిక ప్రభుత్వాలు తమ బడ్జెట్‌ల్లో దాదాపు 40శాతం కోత విధించాయి. ఫలితంగా 9లక్షల మందికి, వీరిలో చాలా మంది వృద్ధులే, ఆరోగ్య సంరక్షణ అందని పరిస్థితి ఏర్పడింది. ఈ వ్యవస్థలో లాభసాటిగా వుండే విభాగాలను ప్రైవేటు రంగానికి అప్పచెప్పడం వంటి చర్యలపై దృష్టి పెడుతూ ఉద్దేశ్యపూర్వకంగా ఎన్‌హెచ్‌ఎస్‌ను పతనంచేయాలని ప్రభుత్వం చూస్తోంది. తద్వారా లక్షలాది ప్రజల ఆరోగ్యాన్ని, జీవితాలను ఫణంగా పెడుతోంది.


టొరెంటో విమానాశ్రయంలో విమానాలు ఢీ



ఒట్టావా : కెనడాలోని టొరెంటో పియర్సన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో శుక్రవారం రాత్రి రెండు విమానాలు ఢీ కొన్న ఘటన చోటు చేసుకుంది. దీని కారణంగా ప్రయాణీకులను చలిగాలుల మధ్య అత్యవసర మార్గం ద్వారా విమానం నుండి తరలించారు. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదని సమాచారం.

మెక్సికోలోని కంకూన్ నుండి 168 మంది ప్రయాణీకులు, ఆరుగురు సిబ్బందితో వెస్ట్‌జెట్ విమానం ఇక్కడకు వచ్చిందని, ప్రయాణీకులు దిగడానికి సిద్ధంగా ఉన్న సమయంలో సన్‌వింగ్ ఎయిర్‌క్రాఫ్ట్ వెనుక నుండి వచ్చి ఢీ కొన్నట్లు వెస్ట్ జెట్ సంస్థ పేర్కొంది. దీంతో వెస్ట్‌జెట్ విమాన రెక్కలకు మంటలు అంటుకున్నట్లు వీడియో పుటేజ్‌లో కనిపించింది. అత్యవసర మార్గాల ద్వారా ప్రయాణీకులను తరలించామని మహిళా అధికార ప్రతినిధి లురెన్ స్టువర్ట్ పేర్కొన్నారు. టెర్మినల్‌లో అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని ఆమె పేర్కొన్నారు. ఈ ఘటన సమయంలో తమ విమానంలో సిబ్బంది, ప్రయాణీకులు లేరని సన్‌వింగ్ ఎయిర్‌క్రాఫ్ట్ పేర్కొంది. విచారణ జరుపుతామని కెనడా రవాణా రక్షణ బోర్డు పేర్కొంది.

మెక్సికోతో సరిహద్దు గోడ నిర్మాణానికి పదేళ్ళలో 1800 కోట్ల డాలర్లు



శాండియాగో : మెక్సికోతో సరిహద్దుగా అతిపెద్దదైన, అందమైన గోడను నిర్మిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హామీ ఇచ్చారు. తన అధ్యక్ష హయాంలో కీలకమైన చర్యగా ఈ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. 2017 సెప్టెంబరు నాటికి అదనంగా 505 కిలోమీటర్ల గోడ నిర్మించనున్నట్లు ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. దీంతో అప్పటికి మొత్తంగా 1552 కిలోమీటర్లు మేరా అంటే సరిహద్దుల్లో దాదాపు సగం గోడ నిర్మాణమవుతుంది. మెక్సికోతో సరిహద్దు గోడ విస్తరణకు రాబోయే పదేళ్ళలో 1800కోట్ల డాలర్ల మేరకు ఖర్చు చేయాలని ట్రంప్ ప్రభుత్వం ప్రతిపాదించింది. ఎన్నికల ప్రచారం సందర్భంగా ఇచ్చిన హామీలు, వాగ్దానాలను అమలు చేయడానికి చర్యలు తీసుకోవాలని ట్రంప్ యోచిస్తున్నారు. కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ బోర్డు ప్రతిపాదన ప్రకారం 651 కిలోమీటర్లు మేరా రెండో దశ కంచె వేయాలని భావిస్తున్నారు. మెక్సికోతో అందమైన, అతిపెద్ద సరిహద్దు గోడ నిర్మించాలన్నది తమ లక్ష్యమని ట్రంప్ చెప్పారు. అయితే ఈ ఏడాది 118 కిలో మీటర్ల మేరా గోడ నిర్మాణానికి అవసరమైన 116కోట్లను మంజూరు చేయాలని అధికారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. టెక్సాస్, కాలిఫోర్నియాల్లో ఈ గోడ భాగాన్ని నిర్మిస్తారు. అయితే వచ్చే ఏడాది కూడా మరో 1600కోట్లు కోరనున్నట్లు తెలిపారు. పదేళ్ళ ప్రణాళిక గురించి సెనెటర్లతో జరిగిన చర్చలో ఈ ప్రస్తావన వచ్చింది. అనంతరం ఇందుకు సంబంధించి ఒక పత్రాన్ని రూపొందించారు.

పాక్, ఇరాన్ అంతర్గత వ్యవహారాలలో అమెరికా జోక్యంపై ఎర్డోగాన్ ఆగ్రహం



ఇస్తాంబుల్ : పాకిస్తాన్, ఇరాన్‌ల అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకుంటున్న అమెరికా, ఇజ్రాయిల్‌పై టర్కీ అధ్యక్షుడు రిసిపి తయాప్ ఎర్డోగాన్ శుక్రవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాక్, సిరియా, లిబియా, తునిషియా, సూడాన్, చాద్ తదితర దేశాలలో కూడా ఇదేవిధంగా జోక్యం చేసుకుంటున్నారని ఫ్రాన్స్ పర్యటనకు వెళ్ళడానికి ముందు ఇస్తాంబుల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన చెప్పారు. ఈ దేశాలన్నీ ఇస్లాం దేశాలని, అక్కడ నివసించే ప్రజలందరూ ముస్లింలని ఆయన పేర్కొన్నారు. గతవారంలో ఇరాన్‌లో ఆందోళనలు చోటు చేసుకున్న సమయంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్ట్ ట్రంప్ నిరసనకారులకు మద్దతు ప్రకటించారు. అలాగే ప్రభుత్వానికి వ్యతిరేకంగా వీధుల్లోకి వచ్చి నిరసన తెలుపుతున్న వారిని ఇజ్రాయిల్ ప్రధాన మంత్రి బెంజామిన్ నెతన్యాహు ప్రశంసించారు. దీనికి తోడు ఆఫ్ఘన్‌లోని ఉగ్రవాదులను వేటాడేందుకు పాకిస్తాన్ తమకు తగిన సహాయం అందించలేదంటూ ట్రంప్ పాకిస్తాన్‌పై మండిపడ్డారు.

దుర్గ గుడి ఈవోపై వేటు

(మొదటిపేజీ తరువాయి)

విరుద్ధంగా సంబంధంలేని వ్యక్తులు ప్రవేశించారని విచారణ కమిటీ నిర్ధారించినట్లు తెలిపారు. దుర్గ గుడిలో బయటి వ్యక్తుల ప్రమేయంపై పరిపాలన విధాన లోపాలు ఉన్నాయని గుర్తించామన్నారు. ఈవోను రిలీవ్ చేసి విచారణ కొనసాగించాలని ముఖ్యమంత్రి నిర్ణయించినట్లు తెలిపారు. క్షుద్ర పూజలు జరగలేదని ప్రాథమిక విచారణలో తేలినట్లు చెప్పారు. దుర్గ గుడిలో పాలన వైఫల్యంపై ఈవో సూర్యకుమారిని తక్షణం బదిలీ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దుర్గ గుడిలోకి సంబంధం లేని వ్యక్తులు ప్రవేశించడంపై ముఖ్యమంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనపై పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. విజయవాడ నగర పోలీస్ కమిషనర్ గౌతం సవాంగ్ మాట్లాడుతూ దుర్గ గుడిలో తాంత్రిక పూజల వ్యవహారంపై సిఎం సీరియస్‌గా ఉన్నారన్నారు. ఆలయ సమయం ముగిసిన తరువాత ఆలయానికి సంబంధం లేని వ్యక్తులు లోపలికి వెళ్లిన మాట వాస్తవమని, పోలీస్ శాఖ నివేదికలోనూ ఈ విషయాలు పొందుపరిచామని తెలిపారు. పోలీస్ శాఖ తరఫున విచారణ కొనసాగుతుందని స్పష్టం చేశారు.



జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ రాష్ట్రస్థాయి సంబరాల్లో మాట్లాడుతున్న సిసిఎంబి మాజీ డైరెక్టర్ డాక్టర్ మోహన్‌రావు

సైన్స్‌పై పాలకుల నిర్లక్ష్యం

ప్రజాశక్తి – కర్నూలు కలెక్టరేట్

శాస్త్ర, సాంకేతిక రంగాల అభివృద్ధి పట్ల పాలక ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని సిసిఎంబి (సెంటర్ ఫర్ సెల్యూలర్ అండ్ మాలిక్యూలర్ బయాలజీ) మాజీ డైరెక్టర్ డాక్టర్ మోహన్‌రావు తెలిపారు. శాస్త్ర, సాంకేతిక రంగాల అభివృద్ధికి జిడిపిలో కనీసం 2 శాతం నిధులను కూడా కేటాయించడం లేదన్నారు. శనివారం కర్నూలు ఎక్యాంపు మాంటిస్సోరి పాఠశాలలో మూడ్రోజుల జెవివి రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథులుగా సిసిఎంబి మాజీ డైరెక్టర్ డాక్టర్ మోహన్‌రావు, ప్రముఖ శాస్త్రవేత్త మోటూరు కృష్ణప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ పాల్గొన్నారు. ముందుగా జెవివి జెండాను ఆవిష్కరించారు. విద్యార్థులనుద్దేశించి డాక్టర్ మోహన్‌రావు మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా శాస్త్ర, సాంకేతిక రంగం విస్తరిస్తోందని తెలిపారు. భారతదేశంలోనూ ఈ రంగం అభివృద్ధి చెందుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం అందుకు తగిన విధంగా ప్రోత్సహించడం లేదన్నారు. నిధుల కేటాయింపుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. విద్యార్థులు ఇలాంటి సైన్స్ టాలెంట్ టెస్టు ద్వారా ఎంపిక కావడం అభినందనీయమని తెలిపారు. నానో టెక్నాలజీ రోజురోజుకూ అభివృద్ధి చెందుతోందన్నారు. విద్యార్థులు ఇప్పటినుంచే శాస్త్ర, సాంకేతిక అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం మోటూరు కృష్ణప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు ఇలాంటి వేదికలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. చెకుముకి నిర్వాహకులు రామచంద్రయ్య మాట్లాడుతూ... రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్టులో ఎంపికైన విద్యార్థులను ఈ సంబరాలకు ఎంపిక చేశామని తెలిపారు. విద్యార్థులకు మూడ్రోజులపాటు విజ్ఞానాన్ని పెంపొందించే అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ... సైన్స్ అభివృద్ధిపై ఈ సంస్థ ఎంతో కృషి చేస్తోందని తెలిపారు. విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా మారేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. డాక్టర్ శంకర్‌శర్మ, డాక్టర్ శ్రీహరి, కెఎన్‌వి.రాజశేఖర్ మాట్లాడుతూ... కర్నూలు జిల్లాలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం గర్వించదగ్గ విషయమని తెలిపారు. జెవివి సైన్స్, మూఢనమ్మకాలు వంటి అంశాలపై ప్రజలకు నిరంతరం అవగాహన కల్పిస్తోందన్నారు. అనంతరం అక్కడే విద్యార్థులు, శాస్త్రవేత్తలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు పలు అంశాలపై శాస్త్రవేత్తలను ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ఎగ్జిబిషన్‌ను సెయింట్ జోసెఫ్ కళాశాల ప్రిన్సిపల్ శౌరీలురెడ్డి ప్రారంభించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన పలు రకాల ఎగ్జిబిషన్ స్టాల్స్ సందర్శకులను ఆకట్టుకున్నాయి. మ్యాజిక్ షో కూడా నిర్వహించారు. జెవివి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాజాబాష, సత్యనారాయణరెడ్డి, ప్రొఫెసర్ బిఎన్.రెడ్డి, ప్రొఫెసర్ కోయ వెంకటేశ్వరరావు, జెవివి రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రంగన్న, జెవివి సీనియర్ నాయకులు బిడి.సుధీర్‌రాజు, డాక్టర్ బడెసాహెబ్, జిల్లా నాయకులు జగదీష్, పలువురు రాష్ట్ర నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాయం సగమే

(మొదటిపేజీ తరువాయి)

రూ 4,856 కోట్లు పంపిణీ చేయాల్సి ఉంది. మూడు నెలలు మాత్రమే మిగిలి ఉండటంతో ఇంత భారీ మొత్తంలో రుణ పంపిణీ చేయడం దాదాపు అసాధ్యమన్న అభిప్రాయం అధికారవర్గాల్లో వ్యక్తమవుతోంది. ముఖ్యమంత్రి సొంత జిల్లా చిత్తూరులో 50271 గ్రూపులు ఉండగా, ఇప్పటివరకు 27331 గ్రూపులకు మాత్రమే రుణాలు అందాయి. రాష్ట్రంలోనే అత్యధిక సంఖ్యలో డ్వాక్రా సంఘాలున్న తూర్పుగోదావరి జిల్లాలో 50 శాతం గ్రూపులకు కూడా రుణం అందలేదు. ఇక్కడ 54333 గ్రూపులుండగా కేవలం 19వేల గ్రూపులకు మాత్రమే రుణాలు అందాయి. అనంతపురం జిల్లాలో ఈ ఏడాది 918 కోట్ల రూపాయలు రుణం ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించుకోగా ఇప్పటివరకు 389 కోట్లు మాత్రమే ఇచ్చారు.

ఎందుకీ స్థితి?

డ్వాక్రా రుణాలపై ఇప్పటికే లెక్కలేనని సార్లు సమావేశాలు జరిగాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సైతం ఈ అంశంపై ఈ ఏడాది అరడ జనుసార్లు పైగా సమావేశాలు నిర్వహిం చారు. అధికారయంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు. అయినా, నిర్దేశిత లక్ష్యం చేరుకోకపోవ డానికి బ్యాంకర్ల సహాయ నిరాకరణే ప్రధానకారణ మని అధికారులు చెబుతున్నారు. ఉన్నతస్థాయి సమా వేశాల్లో రుణ మంజురుకు ఒప్పుకున్నప్పటికీ ఆచరణలో ఆ దిశలో బ్యాంకర్లు చర్యలు తీసుకోవ డం లేదన్నది వీరి వాదన. అయితే, బ్యాంకర్లు మాత్రం దీనికి భిన్నంగా చెబుతున్నారు. ఇప్పటికే రుణం తీసుకుని బకాయి పడ్డ సంఘాలకు మళ్లీ అప్పు ఇవ్వ డానికి సాంకేతిక పరమైన ఇబ్బందులు వస్తున్నా యని వీరు అంటున్నారు. డ్వాక్రా రుణాలు పూర్తిగా మాఫీ కాకపోవడం కూడా ఈ పరిస్థితికి కారణం.

జన్మభూమిలో భారీ లక్ష్యం

ప్రస్తుత జన్మభూమి–మాఊరు కార్యక్రమంలోనే పెండింగ్ రుణాలు 25 శాతం వరకు విడుదల చేయించాలని రాష్ట్ర సర్కారు తాజాగా నిర్ణయించింది. ఇటీవల జరిగిన సమావేశంలో ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. దీని ప్రకారం జన్మభూమి ముగిసేలోగా 68 వేల గ్రూపులకు రూ 2,061 కోట్లు రుణాలు ఇవ్వాల్సిఉంది. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)కు ఈ బాధ్యతలు అప్పగించారు. ఇప్పటి వరకు అందిన సమాచారం ప్రకారం ఈ దిశలో చోటుచేసుకుంటన్న పురోగతి అంతంతమాత్రమే!

పాలేకర్ వ్యాఖ్యలపై ఆగ్రహం

- వర్శిటీలు మూసేయాలనడంపై ఆగ్రహం
- శాస్త్రవేత్తల నిరసన
- స్పీకర్ కోడెల సైతం అభ్యంతరం
- ఇరుకున పడ్డ సర్కారు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి– అమరావతి

ప్రకృతి సేద్యం పితామహుడిగా చెప్పుకుంటున్న సుభాష్ పాలేకర్ రాష్ట్రానికొచ్చి వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, పరిశోధనలు శుద్ధ దండగ అంటూ చేసిన వ్యాఖ్యలపై పెద్ద దుమారం లేచింది. పాలేకర్ పైత్యం పరాకాష్టకు చేరిందంటూ శాస్త్రవేత్తల నుంచి ఆగ్రహావేశాలు మిన్నంటాయి. స్పీకర్ కోడెల శివప్రసాదరావు సైతం పాలేకర్ తీరుపై అభ్యంతరం వ్యక్తం చేయడంతో ప్రభుత్వంలో అంతర్మధనం మొదలైంది. గుంటూరు జిల్లా లాంలో ప్రకృతి సాగుపై ప్రభుత్వం నిర్వహిస్తున్న శిక్షణా శిబిరంలో, బయట పత్రికలతో మాట్లాడుతూ యూనివర్శిటీలను మూసేయాలని అభిప్రాయపడ్డారు. వాటికి ప్రభుత్వాలు ఖర్చు చేస్తున్న రూ.వేలాది కోట్లూ వృధా అని, నయాపైసా లాభం లేదని విమర్శించడంపై వ్యవసాయ శాస్త్రవేత్తలు, విద్యార్థుల నుంచి తీవ్ర స్థాయిలో నిరసనలు వెల్లువెత్తాయి. గతంలో ఇలాగే తిరుపతిలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, పరిశోధనలను, శాస్త్రవేత్తలను తూలనాడటంపై పెద్ద ఎత్తున ఆందోళనలు చోటు చేసుకున్నాయి. అనంతరం పాలేకర్‌కు వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ ఇప్పించేందుకు సర్కారు ప్రయత్నించినప్పుడు యావత్ యూనివర్శిటీ, విద్యార్థులు అడ్డుకున్నారు. వర్శిటీలను, శాస్త్రవేత్తలను, పరిశోధనలను, కాలేజీలను వ్యతిరేకించే వ్యక్తికి ఎలా డాక్టరేట్ ప్రదానం చేస్తారని రాష్ట్ర ప్రభుత్వానికి, గవర్నర్‌కు వినతిపత్రాలు పంపారు. తీవ్ర నిరసనల కారణంగా డాక్టరేట్‌పై చంద్రబాబు సర్కారు వెనక్కి తగ్గాల్సి వచ్చింది. ఇప్పుడు గుంటూరు లాంలో ప్రభుత్వం ప్రకృతి సేద్యంపై వేలాది మంది రైతులకు, వ్యవసాయాధికారులకు, సిబ్బందికి పాలేకర్‌ను రప్పించి శిక్షణ ఇప్పిస్తోంది. డిసెంబర్ 31న ప్రారంభమైన శిక్షణ జనవరి 8 వరకు కొనసాగుతుంది.

తూలనాడటమే


శిక్షణా శిబిరంలో పాలేకర్ ప్రతి రోజూ వ్యవసాయ వర్శిటీ, వ్యవసాయ కళాశాలలు, పరిశోధనలపై విరుచుకు పడుతున్నారు. మీడియా వద్ద కూడా అదే తరహాలో నోరు పారేసుకుంటున్నారు. ఆవు పేడ, ఆవు మూత్రంతో జీవామృతం తయారు చేసుకోవాలని, అదే ఏకైక మార్గమని సూచిస్తున్నారు. భూమిని ట్రాక్టర్లతో దున్నొద్దంటున్నారు. భూసార పరీక్షలు వద్దే వద్దంటున్నారు. సాగుకు అవసరమైన మేరకు ఆవుల సంఖ్య లేదు కదా అంటే ఉన్నవి సరిపోతాయని సూత్రీకరిస్తున్నారు. టిడిపి సర్కారు 'రైతు రథం' పేరుతో సబ్సిడీపై ట్రాక్టర్లను పంపిణీ చేస్తూ మరోపక్క ట్రాక్టర్లు వద్దంటూ పాలేకర్‌తో ప్రవచనాలు ఇప్పించడమేంటని రైతుల నుంచి ప్రశ్నలొచ్చాయి. భూసార పరీక్షల ఆధారంగా కేంద్రం రైతులకు ఎరువులిస్తోంది. రాష్ట్రంలో చంద్రబాబు సర్కారు సైతం భూసార పరీక్షలకు స్పెషల్ డ్రైవ్ పెట్టింది. పాలేకర్ అవి వద్దనడంపై రైతుల్లో అయోమయం ఏర్పడింది.

చౌకబారు వ్యాఖ్యలు

ఇదిలా ఉండగా పాలేకర్ వ్యాఖ్యలపై వర్శిటీ శాస్త్రవేత్తలు శనివారం అత్యవసరంగా సమావేశమై పాలేకర్ వ్యవహారంపై నిరసన తెలిపారు. పాలేకర్ తాను చెప్పేది తాను చెప్పుకుంటే తప్పు లేదని, మొత్తానికే సైన్సు అనవసరం అనడం సబబు కాదని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయ అధ్యాపకుల సంఘం అధ్యక్షులు డాక్టర్ టి శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ జి రామచంద్రరావు హితవు పలికారు. వర్శిటీలను తూలనాడటం వలన తన సిద్ధాంతం ప్రాచుర్యం పొందుతుందనుకోవడం అన్యాయయని నిరసన తెలిపారు.

చౌకబారు విమర్శలు చేయొద్దని పాలేకర్‌కు వార్నింగ్ ఇచ్చారు. బాపట్ల వ్యవసాయ కళాశాల పూర్వ విదార్థుల సంఘం సైతం పాలేకర్ వ్యాఖ్యలపై అభ్యంతరం తెలిపింది. ఇలాంటి వ్యక్తులను ప్రభుత్వం ఎందుకు ప్రోత్సహిస్తున్నదో అర్థం కావట్లేదని పేర్కొంది. కాగా ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ కోడెల సైతం శనివారం గుంటూరు జిల్లాలో కొన్ని మీడియా చానళ్లతో మాట్లాడుతూ యూనివర్శిటీలను మూసేయాలనడం సరికాదని అభిప్రాయపడ్డారు.

పాలేకర్‌కు తగదు : కోడెల



ప్రకృతి సేద్యానికి అవసరమైన ఆవులు లేని గ్రామాలు రాష్ట్రంలో చాలా ఉన్నాయి. ఇప్పటికిప్పుడు పెద్ద సంఖ్యలో ఆవులు తీసుకురాలేము. సేంద్రీయ వ్యవసాయం వ్యర్థమని, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు మూసివేయాలని చెప్పటం పాలేకర్‌కు తగదు. సేంద్రీయ వ్యవసాయాన్ని వ్యతిరేకించటం మానుకోవాలి. వానపాముల వినియోగాన్ని విమర్శించటం కూడా సరికాదు. హైబ్రీడ్ విత్తనాలతో దేశంలో ఎన్నో ప్రాంతాల్లో 3 నుంచి 4 రెట్లు అధిక దిగుబడులు సాధించారు. ప్రొఫెసర్ స్వామినాథన్ సిఫార్సు మేరకు హైబ్రీడ్ విత్తనాలు మార్కెట్లోకి వచ్చాయి. ఎంతో మంది పరిశోధకులు కొత్త వంగడాలను సృష్టించి రైతులకు మేలు చేశారు.

– గుంటూరులో మీడియాతో స్పీకర్ కోడెల శివప్రసాద్

త్వరలో రెండో దశ విద్యుత్ సంస్కరణలు

(మొదటిపేజీ తరువాయి)

టూరిజం అభివృద్ధి చెందాలన్నా, వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించాలన్నా మౌలిక సదుపాయాలే కీలకమని అన్నారు. 90 లక్షల మంది డ్వాక్రా, మెప్మా కార్యకర్తలు చంద్రన్న బీమా, పెళ్లి కానుక, మధ్యాహ్న భోజనం, ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణాన్ని ఉద్యమస్ఫూర్తితో చేపడుతున్నామని చెప్పారు. గ్రామాల్లో వ్యర్థాలను సేకరించేందుకు పంచాయతీ అధికారులు ఒక ఏజెన్సీ టీంగా వస్తారన్నారు. తిరిగి ఎరువుగా మార్చి కావల్సిన వారికి అప్పచెప్పనున్నారన్నారు. కూచిపూడి నృత్యాన్ని పాఠశాలల్లో నేర్పించి గత వైభవానికి కృషి జరుగుతుందని తెలిపారు. ఆడ పిల్లల జోలికొస్తే కఠినంగా వ్యవహరిస్తామని, లాఅండ్ఆర్డర్‌కు విఘాతం కల్గిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మంత్రులు చంద్రమోహన్‌రెడ్డి, నారాయణ, అమర్‌నాథ్‌రెడ్డి, మాజీ మంత్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నుడా ఛైర్మన్ కోటంరెడి శ్రీనివాసులురెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ బిల్డింగ్‌కు రూ.20 లక్షలు

కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ టీచర్‌ను పిలిచి ఏమి కావాలమ్మా? అని చంద్రబాబు ప్రశ్నించగా.. ఆమె బిల్డింగ్ నిర్మించాలని కోరారు. దీంతో తక్షణమే రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. సభ కరతాల ధ్వనులతో మార్మోగింది. ముఖ్యమంత్రి వేసిన క్విజ్ ప్రశ్నలకు పడుగుపాడు అంగన్‌వాడీ చిన్నారులు జవాబు ఇచ్చారు. దాంతో సిఎం మంత్ర ముగ్దులయ్యారు. ఓచిన్నారిని దగ్గరకు తీసుకుని ఎత్తుకున్నారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



సభలో మాట్లాడుతున్న సిఐటియు ఆలిండియా అధ్యక్షులు హేమలత

విశాఖ స్టీల్స్‌లో షేర్ల విక్రయం దేశద్రోహం : సిఐటియు

(మొదటిపేజీ తరువాయి)

ఇటీవల నిర్వహించిన ప్రజా బ్యాలెట్‌లో 1,01,320 ఓట్లు పోలవ్వగా 1,00,090 ఓట్లు డిసిఐ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగాను, 612 ఓట్లు మాత్రమే అనుకూలంగా వచ్చాయన్నారు. 618 ఓట్లు చెల్లలేదన్నారు. సుమారు 99.39 శాతం మంది డిసిఐ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఓటువేశారని తెలిపారు. ప్రభుత్వానికి ఈ తీర్పు మీద ఏమాత్రం గౌరవమున్నా, డిసిఐ ప్రయివేటీకరణను తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నరసింగరావు మాట్లాడుతూ డిసిఐతోనే మోడీ ప్రభుత్వదాడి ఆగదని మొత్తం ప్రభుత్వరంగం పైనే ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌యు జాతీయ నాయకులు మనోజ్‌యాదవ్, సిఐటియు నగర ప్రధానకార్యదర్శి ఎం.జగ్గునాయుడు, ఐఎన్‌టియుసి నాయకులు కె.ఈశ్వరరావు, ఎఐటియుసి నాయకులు మార్కెండేయులు, ఐఎఫ్‌టియు నాయకులు మల్లయ్య, డిఫెన్స్ నాయకులు ఆర్.వెంటకరావు, డిసిఐ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు విఎస్.పద్మనాభరాజు తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ కవులపై భౌతిక దాడులు దుర్మార్గం

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

మైనారిటీ కవులు, రచయితలు పై భౌతిక దాడులకు పాల్పడటం, వారు రాసిన రచనలు, కవితా సంకలనాలు, పుస్తకాలు ఆవిష్కరించనీయకుండా అడ్డుకోవడం దుర్మార్గమైన చర్య అని 'సంగమం' కన్వీనర్, ప్రముఖ సినీ దర్శకుడు సి ఉమామహేశ్వరరావు ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రజాస్వామ్యంలో నిరసనలు తెలిపే హక్కు, భావప్రకటనా స్వేచ్ఛ ప్రతి ఒక్కరికి ఉంటుందన్నారు. కానీ అవి ఇబ్బందులు తలెత్తే రీతిలో ఉండకూడదన్నారు. ఇటీవల విజయవాడ పుస్తక మహోత్సవంలో జరిగిన ఘటన దారుణమన్నారు.

మా అందరికీ 'గ్యాంగ్' ప్రత్యేకమే

• తెలుగులో డబ్బింగ్ నేనే చెప్పా : సూర్య



వంశీ, ప్రమోద్, విఘ్నేశ్ శివన్, రమ్యకృష్ణ, కీర్తి సురేశ్, సూర్య, అల్లు అరవింద్, మారుతి తదితరులు



డాన్స్ చేస్తున్న సూర్య

సూర్య, కీర్తి సురేష్ జంటగా నటించిన చిత్రం 'తానా సెంద కూట్టమ్'. ఈ చిత్రాన్ని తెలుగులో యు.వి.క్రియేషన్స్ 'గ్యాంగ్' పేరుతో ఈనెల 12న విడుదల చేయబోతుంది. విఘ్నేశ్ శివన్ దర్శకుడు. ప్రమోద్, వంశీ నిర్మాతలు. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్ హైదరాబాద్ జె.ఆర్.సి. కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించారు.

హీరో సూర్య మాట్లాడుతూ 'మన అందరికీ స్కూల్‌లో ఓ గ్యాంగ్, కాలేజ్‌లో ఓ గ్యాంగ్, పనిచేసుకునే దగ్గర ఓ గ్యాంగ్ ఉంటుంది. అలాంటి గ్యాంగ్ మన లైఫ్‌లో చాలా కీలకమైన పాత్రను పోషిస్తుంది. యు.వి.క్రియేషన్స్ తెలుగులో గ్యాంగ్ అనే చాలా మంచి టైటిల్ పెట్టారు. అల్లు అరవింద్ మా గ్యాంగ్‌లో చాలా కీలకమైన వ్యక్తి. ఆయన సినిమా రిలీజ్‌కు ఎంతగానో సపోర్ట్ చేస్తున్నారు. జ్ఞానవేల్ రాజా కూడా ఇక్కడ నా సినిమాలను గ్రాండ్‌గా విడుదల చేసే మరో గ్యాంగ్ మెంబర్. మా గ్యాంగ్‌లో యు.వి.క్రియేషన్స్ వంశీ, ప్రమోద్‌లు కూడా జాయిన్ అయ్యారు. డైరెక్టర్ విఘ్నేశ్ శివన్ నన్ను ఈ సినిమాలో చాలా కొత్తగా చూపించారు. రమ్యకృష్ణ కూడా మా గ్యాంగ్‌లో ఓ మెంబర్‌గా కావడం ఆనందంగా ఉంది. అలాగే కీర్తి సురేష్, సినిమాటోగ్రాఫర్ దినేష్ సహా అందరూ ఎంతగానో సపోర్ట్ చేశారు. కచ్చితంగా ప్రేక్షకులకు డిఫరెంట్ ఎక్స్‌పీరియెన్స్‌ను ఇచ్చే చిత్రమవుతుంది. తెలుగులో డబ్బింగ్ కూడా నేనే చెప్పాను. కుటుంబం అంతా కలిసి చూసేలా సినిమా ఉంటుంది' అని అన్నారు.

విఘ్నేశ్ శివన్ మాట్లాడుతూ ' తెలుగు ప్రేక్షకులు సినిమాను ఎంతగానో ప్రేమిస్తారు. జనవరి 10న మనం అంతా కలిసి అజ్ఞాతవాసి మూవీ చూస్తాం. అలాగే జనవరి 12న మళ్లీ అందరం కలిసి గ్యాంగ్ సినిమా చూడాలి' అని చెప్పారు.

అల్లు అరవింద్ మాట్లాడుతూ 'గజిని' సినిమా నుండి నాకు, సూర్యకి మంచి అనుబంధం కొనసాగుతుంది. నాతో ఆయన సినిమా చేయాలని ప్రయత్నిస్తున్నారు కానీ కుదరడం లేదు. త్వరలోనే ఆ సినిమా చేస్తాం. జ్ఞానవేల్ రాజా, విఘ్నేశ్ శివన్ కలిసి చేసిన సినిమాను తెలుగులో యు.వి.క్రియేషన్స్ వంశీ, ప్రమోద్‌లు విడుదల చేస్తున్నారు' అని పేర్కొన్నారు.

కీర్తి సురేష్ మాట్లాడుతూ ' విఘ్నేశ్ శివన్ సినిమాను ఎంతో బాగా తెరకెక్కించారు. ఆయన టేకింగ్ చాలా కొత్తగా ఉంటుంది. రమ్యకృష్ణతో కలిసి పని చేయడం మరచిపోలేని అనుభవం. సూర్యగారితో కలిసి నటించడం గొప్ప అవకాశంగా భావిస్తున్నాను' అని పేర్కొన్నారు.

మారుతి మాట్లాడుతూ 'గ్యాంగ్‌తో మరో వండర్ ఫుల్ సినిమాను సూర్య అందిస్తున్నారు. విఘ్నేశ్ శివన్ సినిమా 'నేనూ రౌడీ తా' చూడగానే చాలా ఇన్నోవేటివ్‌గా అనిపించింది. ఆయన సినిమాల్లో కామెడీ టచ్ బావుంటుంది' అన్నారు.

అతిలోక సుందరి పెయింటింగ్ చాలా ఖరీదు గురూ

• అమ్మకానికి సోనమ్, మైఖేల్ జాక్సన్ బొమ్మలు
• ప్రారంభ ధరే 10లక్షలు



బాలీవుడ్‌లో నటుడు, పెయింటర్ ఎవరు? అని అడిగితే మనకు వెంటనే గుర్తొచ్చేది సల్మాన్ ఖాన్. ఆయనకు పెయింటింగ్ ఓ అభిరుచి. ఎవరిపై పెయింటింగ్ వేస్తే వారికే పంపేస్తాడు సల్మాన్. ఇప్పుడు ఈ జాబితాలో ప్రముఖ నటి కూడా చేరిపోయింది. ఆమె ఎవరో కాదు అతిలోక సుందరి శ్రీదేవి. తనకు ఎప్పటి నుంచో పెయింటింగ్ వేయడం అనే అభిరుచి ఉందట. 2010 నుంచి వారానికి ఐదు నుంచి పది గంటల పాటు పెయింటింగ్‌కే కేటాయిస్తుందట. ఓ సారి ఇంటర్నేషనల్ ఆర్ట్ హౌస్ వాళ్లు ఈమె వేసిన ఆర్ట్‌కు ముగ్ధులై వేలానికి రంగం సిద్ధం చేశారట. కానీ దానికి ఆమె అంగీకరించలేదు. ఇప్పుడు మాత్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇంతకీ ఆమె వేసిన పెయింటింగ్ ఏమిటంటారా? అదేనండీ.. ఆమె మేనకోడలు సోనమ్ కపూర్ బొమ్మను తన కుంచెతో గీసింది. సోనమ్ అరంగేట్రం చేసిన 'సావారియా'లో ఆమె పాత్రను వేసిందట. దీంతో పాటు మైఖేల్ జాక్సన్‌ది క్లాసిక్ పోజ్‌లో ఉన్న చిత్రాన్ని కూడా గీసిందట. ఈ రెండు పెయింటింగ్స్‌ను వచ్చే నెలలో దుబాయ్‌లో వేలం పెట్టనున్నారు. సోనమ్ కపూర్ బొమ్మకు రూ.10 లక్షలు, మైఖేల్ జాక్సన్ ఆర్ట్‌కు రూ. 8లక్షలు ప్రారంభ ధరగా నిర్ణయించారు. దుబాయ్‌లో సోనమ్ కపూర్‌కు అభిమానులు ఎక్కువగా ఉంటారని అత్యధిక ధరకు ఈ పెయింటింగ్ అమ్ముడు పోతుందని అంచనా వేస్తున్నారు. ఎంత ధరకు పలుకుతుందో చూడాలి.



సోనమ్‌పై వేసిన పెయింటింగ్

జూన్‌లో కొత్త చిత్రం




బి.ఎ. రాజు

జయ బి. దర్శకత్వంలో మరో కొత్త చిత్రం తెరకెక్కబోతుంది. బి.ఎ.రాజు నిర్మించబోతున్నాడు. ఆర్.జె. సినిమాస్ బేనర్‌పై మరో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను నిర్మించనున్నారు. ఆదివారం రాజు పుట్టినరోజు సందర్భంగా శనివారం విలేకరులతో మాట్లాడారు. "మా బేనర్‌లో నిర్మించిన మొదటి సినిమా 'పేమలో పావని కల్యాణ్'. నిర్మాతగా 15 ఏళ్లు పూర్తయింది. మా బేనర్‌లో వచ్చిన 'ప్రేమలో పావని కల్యాణ్', 'చంటిగాడు', 'గుండమ్మగారి మనవడు', 'లవ్‌లీ', 'వైశాఖం' చిత్రాలను ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. తాజా మరో చిత్రం చేయబోతున్నాం. ప్రస్తుతం ఈ సినిమాకి సంబంధించిన కథా చర్చలు జరుగుతున్నాయి. జూన్‌లో ఈ సినిమాని ప్రారంభిస్తాం" అని చెప్పారు.

తారా 'జువ్వ'

రంజిత్, పాలక్ లల్వానీ హీరో, హీరోయిన్లగా నటిస్తోన్న చిత్రం 'జువ్వ'. 'దిక్కులు చూడకు రామయ్య' ఫేం త్రికోటి పేట దర్శకత్వం వహిస్తున్నారు. ఎస్. వి. రమణ సమర్పణలో సొమ్మి ఫిలింస్ పై డా.భరత్ సోమి నిర్మిస్తున్నారు. ఎమ్. ఎమ్. కీరవాణి సంగీతం సమకూర్చారు. షూటింగ్ పూర్తిచేసుకుంది. హైదరాబాద్‌లో కొన్ని సన్నివేశాలు, వైజాగ్‌లో ఒక పాట..మరికొన్ని సన్నివేశాలు చిత్రీకరించారు. అలాగే మలేషియాలో రెండు పాటలు, బెంగుళూరులో కారు ఛేజింగ్ సన్నివేశాలు షూట్ చేశారు. తాజాగా యూనిట్ ప్రమోషన్ యాక్టివిటీస్‌ను కూడా ప్రారంభించింది. దీనిలో భాగంగా శనివారం చిత్ర మోషన్ పోస్టర్‌నురిలీజ్ చేసింది. త్వరలో మెగాస్టార్ చిరంజీవి చేతుల మీదుగా ఫస్టు లుక్ పోస్టర్, టీజర్ రిలీజ్ చేయనున్నట్లు యూనిట్ తెలిపింది. ఈ నెల మూడో వారంలో ఆడియోను, ఫిబ్రవరిలో సినిమా రిలీజ్‌కు నిర్మాణ సంస్థ సన్నాహాలు చేస్తోంది.



'జువ్వ' చిత్రంలో రంజిత్

మరో ప్రయత్నం!



షామిలి

ఒక్కో సారి కథ బాగున్నా నేరేషన్ బాగోకపోతే ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద బోల్తా కొడుతుంది. యాక్టింగ్, సినిమా రెండూ బాగుంటే మంచి కలెక్షన్సే వస్తాయి. కానీ అందులో నటించేవారికి కొన్నిసార్లు అవకాశాలు మాత్రం రావు. అటువంటిదే షామిలి విషయంలో జరిగింది. 2009లో 'ఓయ్' చిత్రంలో కథానాయికగా భలే మెప్పించింది. ఈ సినిమాతో తెలుగులో మంచి అవకాశాలు వస్తాయని అనుకున్నారు కానీ నిరాశే మిగిల్చింది. ఒక్కరూ హీరోయిన్‌గా ఆమెను పెట్టుకోలేదు. తమిళ్, మలయాళంలో మాత్రం సినిమాలు చేస్తుంది. మళ్లీ ఇప్పుడు మరోసారి తెలుగులో చేసి తనేంటో నిరూపించుకునే ప్రయత్నం చేస్తుంది. ఆ చిత్రమే 'అమ్మమ్మగారి ఇల్లు'. 'ఓయ్'కి ఈ సినిమాకు షామిలి డిఫరెంట్ లుక్‌లో కనిపించబోతుంది. ఓ సాధారణ అమ్మాయిగా ఈసారి మెప్పిస్తుంది. ఈ చిత్రానికి సుందర్ సూర్య దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రం వేసవిలో విడుదల కాబోతోంది.



'గాయత్రి' చిత్రంలో శ్రియ

నేనేదనుకుంటే అది చెప్పడం అలవాటు

మోహన్ బాబు ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'గాయత్రి'. ఫిబ్రవరి 9న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. విష్ణు మంచు, శ్రియ జంటగా నటిస్తున్నారు. వీరిద్దరూ దంపతులుగా ఉన్న లుక్ ఈనెల ఒకటో తేదీన విడుదల చేశారు. ఇప్పుడు శ్రియకు సంబంధించిన మరో పోస్టర్ ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. "నేనేదనుకుంటే అది చెప్పడం నాకు అలవాటు, తర్వాత సంగతి తర్వాత" అని ఈ పోస్టర్‌పై రాసి ఉంది. మదన్ దర్శకత్వం వహించాడు. ఎస్.ఎస్.తమన్ సంగీతం సమకూర్చారు. నిఖిల విమల్, బ్రహ్మానందం ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. శ్రీ లక్ష్మి ప్రసన్న పిక్చర్స్ పై నిర్మించగా అరియానా, వివియానా నిర్మిస్తున్నారు.

ఆచారి...



విష్ణు


విష్ణు మంచు, దర్శకుడు జి నాగేశ్వర్ రెడ్డిల కలయికలో రూపొందుతోన్న సినిమా 'ఆచారి అమెరికా యాత్ర'. ప్రజ్ఞ జైస్వాల్ కథానాయిక. బ్రహ్మానందం కీలక పాత్ర పోషిస్తున్నారు. 'పద్మజ పిక్చర్స్' బ్యానర్‌పై కీర్తి చౌదరి, కిట్టు నిర్మిస్తున్నారు. యమ్.ఎల్. కుమార్ చౌదరి సమర్పిస్తున్నారు. ఎస్ ఎస్ థమన్ బాణీలు సమకూరుస్తున్నారు. పూర్తి వినోదాత్మకంగా తెరకెక్కించిన ఈ చిత్రం టీజర్‌ను ఆదివారం విడుదల చేయనున్నారు. పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయనీ ఈనెల 26న సినిమాను విడుదల చేయనున్నామని నిర్మాత వెల్లడించారు.

చిన్న ఇన్‌ఫర్మేషన్ ఇస్తే చాలు



సమంత, విశాల్

విశాల్ హీరోగా రూపొందుతోన్న నూతన చిత్రం 'అభిమన్యుడు'. విశాల్ ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై తెరకెక్కుతోంది. పి.ఎస్.మిత్రన్ దర్శకత్వం. అర్జున్ వైవిధ్యమైన క్యారెక్టర్‌తో అలరించబోతున్నాడు. సమంత కథానాయిక. ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేశారు. 'ఈ కాలపు దొంగకి నీ ఇంటి తాళాలు అక్కర్లేదు. నీ గురించిన ఓ చిన్న ఇన్‌ఫర్మేషన్ చాలు....అంటూ ప్రారంభమయ్యే టీజర్ ఆసక్తిగా ఉంది. ఇందులో విశాల్ కొత్తతరహాలో ప్రేక్షకులను మెప్పించబోతున్నాడు. అర్జున్ డిఫరెంట్ లుక్, సమంత గ్లామర్ సినిమాపై ఈ చిత్రం విజయానికి కలిసొస్తాయని నిర్మాత తెలిపారు. నెలాఖరికి విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం : యువన్ శంకర్‌రాజా, సినిమాటోగ్రఫీ : జార్జి సి. విలియమ్స్, ఎడిటింగ్ : రూబెన్, ఫైట్స్ : దిలీప్ సుబ్బరాయన్, ఆర్ట్ : ఉమేష్ జె.కుమార్, మాటలు: రాజేష్ ఎ.మూర్తి, నిర్మాత : విశాల్.



స్ట్రీట్ లైట్స్‌లో మమ్ముట్టి

'స్ట్రీట్ లైట్స్' కిందే క్రైమ్

చాలా కాలం తరువాత మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి చిత్రం తెలుగులో విడుదలకి సిద్ధమవుతుంది. ఆయన నటించిన చిత్రం 'స్ట్రీట్ లైట్స్' పేరుతో తెలుగులో రానుంది. ఈ చిత్రానికి ప్లే హౌస్ మోషన్ పిక్చర్ ప్రైలి. సంస్థ నిర్మిస్తుంది. శ్యామ్ దత్ సైనుద్దీన్ దర్శకత్వంలో రూపొందించారు. విభిన్నమైన కథల్ని ఎంచుకునే మమ్ముట్టి ఈ సారి కూడా ఆడియెన్స్‌ని థ్రిల్‌కు గురి చేసే కథాంశంతో ఈ చిత్రంతో రానున్నారని దర్శకుడు తెలిపారు. ఇటీవలే ఈ చిత్రం టీజర్‌ను రిలీజ్ చేశారు. క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో సాగే విభిన్నమైన కథ ఇది. తమిళ, మలయాళంతో పాటు తెలుగులోనూ ఈ చిత్రాన్ని స్ట్రీట్ లైట్స్ పేరుతోనే రిలీజ్ చేస్తున్నారు.



మార్పు మాటల్లోనేనా..?

యూత్‌లో కొత్త సంవత్సరం ఫీవర్ ఇంకా తగ్గుండదు. సంబరాలు మిన్నంటి ఉంటాయి. సంబరాల సంగతి అలా ఉంచితే ఈ సంవత్సరం కొత్తగా ఎదైనా రిసొల్యూషన్ పెట్టుకుని దానికి తగ్గట్టుగా మారిపోవాలి అనుకుంటారా ? ప్రతి సంవత్సరమూ ఇలానే అనుకుని ఒక్కసారైనా పాటించారా ? అసలు రిసొల్యూషన్స్ ఎందుకు పెట్టుకుంటారు ? కొత్త సంవత్సరంలోనే మార్పెందుకు...? మామూలు రోజుల్లో ఎందుకు మారకూడదూ...? మనలో మార్పుకోసం ప్రతిసారీ కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టాల్సిందేనా...? చూద్దాం....

న్యూఇయర్ అనగానే సందడి ఒకటే కాదు, సరికొత్త నిర్ణయాలూ క్యూ కడతాయి. ఏదో చేయాలని, మరేదో సాధించాలని, ఇంకేదో మానేయాలని అనుకుంటాం. అలా గట్టిగా అనుకొని మనసులో తీర్మానించుకోవటమో, డైరీలో రాసుకోవటమో చేస్తాం. అదే న్యూఇయర్ రిసొల్యూషన్... అమలు చేయగలిగితే అది మన గమ్యానికి దారి... సమస్యలకు సొల్యూషన్.

ఎక్కడ పుట్టింది..?

మొదట ఈ సంస్కృతి రోమన్ల ద్వారా మొదలైంది. జానస్ అనబడే వారి దేవుడి పేరు ద్వారా జనవరి నెలకి ఆ పేరు వచ్చింది. వారి దేవుడికి ప్రతి సంవత్సరం ఫలానా పనులు చేస్తాం అని మొక్కుకునేవారట? ఆ సంస్కృతిని క్రైస్తవులు కూడా పాటించేవారు. వారు కూడా వారి దేవుడికి ఆ సంవత్సరం చేయబోయే పనులను చెప్పుకుని అది నెరవేరేలా చూడమని కొరుకునేవారట! అలా ప్రతి సంవత్సరం ఈ ప్రార్థనలు కాస్తా పరిష్కారాలుగా రూపుదిద్దుకున్నాయన్నమాట. 21వ శతాబ్దం చివర్లో ఈ సంస్కృతి ప్రపంచ వ్యాప్తంగా విస్తరించింది. ముఖ్యంగా యూత్‌కి ఇది నచ్చినట్టుగా కనిపించే నచ్చని అంశం అనే చెప్పుకోవాలి. అంటే మొదటి నెలలోనే ఆ రిసొల్యూషన్స్ అన్నీ ముగిసిపోతాయి అనుకోండి! అది వేరే విషయం.



ట్రెండీ రిసొల్యూషన్స్....

కొంతమంది ప్రతి సంవత్సరమూ ఒకే రిసొల్యూషన్ పెట్టుకుని, సంవత్సరాల తరబడి అదే కొనసాగిస్తుంటారు కానీ ఫలితం కనబడదు. రిసొల్యూషన్ అనే పేరు వినగానే మొట్టమొదట మదిలో మెదిలేది అధిక బరువు. "ఈ సంవత్సరం ఎలాగైనా బరువు తగ్గిపోవాలిరా" అనుకుంటారు. వందకి నూట ఇరవై మంది ఇదే రిసొల్యూషన్ తీసుకుంటారు మరి. కానీ కొందరు మాత్రం పాత రిసొల్యూషన్ పూర్తి చేయకపోయినా కొత్త వాటిపై ఆసక్తి చూపిస్తుంటారు. కొత్త విషయాలు నేర్చుకోవాలనీ, కొత్త వ్యక్తుల్ని పరిచయం చేసుకోవాలని, జీవితాన్ని మరింత ఆసక్తిగా మార్చుకోవాలనీ అనుకుంటూ ఉంటారు. ఇప్పుడు కొత్తగా మరిన్ని రిసొల్యూషన్స్ ముందుకొస్తున్నాయి. చిన్నప్పటి స్కూల్‌కి వెళ్ళాలనీ, తమలో ఉన్న భయాలను అధిగమించాలనీ, ఆర్థికంగా అభివృద్ధి చెందాలనీ, ఏదైనా ఎన్‌జివోలో వాలంటీర్‌గా కాస్త సమయం పనిచేయాలనీ, ఇప్పుడు చేస్తున్న ఉద్యోగానికంటే మెరుగైన ఉద్యోగం సంపాదించాలనీ, ప్రతివిషయం గురించి పాజిటివ్‌గా ఆలోచించాలనీ, జీవితాన్ని మరింత థ్రిల్లింగ్‌గా మార్చుకోవాలనీ... ఇలా రకరకాల రిసొల్యూషన్స్ యూత్‌ని ఎట్రాక్ట్ చేస్తున్నాయి. యువకులు మాత్రమే కాదు ఇది పెద్దవారికీ చాలా ఉపయోగపడుతుంది. చెప్పాలంటే యువకులకన్నా పెద్దవారే ఎక్కువగా అనుకున్నవాటిని పాటిస్తూ ఉంటారు.



కొత్త నిర్ణయాలు కాదు పాత అలవాట్లు....

చాలామంది న్యూ ఇయర్‌లో కొత్త నిర్ణయాలు తీసుకుంటుంటారు. కానీ మనలో మనకి నచ్చని అలవాట్లను గుర్తించి, వాటిని మార్చుకోవాలనుకోవటమూ ఒక కొత్త నిర్ణయమే కదా. ఒక అలవాటుని మార్చుకోవాలంటే ముందు దాన్ని గుర్తించాలి. వాటిని ఎలా అధిగమించాలో కొత్త మార్గాలు వెతకాలి.

మధ్యలో ఎందుకు వదిలేస్తారు..?

కొత్త నిర్ణయాలు తీసుకుంటాం సరే, మరి వాటితో కుస్తీ పట్టాలి కదా. వారం తిరక్కుండానే దాని గురించి మర్చిపోతే ఎలా? మొదట అనుకున్నది చేయాలని గట్టిగానే అనుకున్నా రంగంలోకి దిగిన తరువాత "ఆ ఇవన్నీ మనవల్ల అయ్యే పనులు కాదులే" అనుకుని మళ్ళీ వెనకడుగు వేస్తారు. ఒక రిసొల్యూషన్ తీసుకునే ముందు అది మనవల్ల సాధ్యమయ్యే పనేనా కాదా? అని అలోచించాలి. ఆచరణ సాధ్యమయ్యే దగ్గరగా ఉండే రిసొల్యూషన్స్ తీసుకుంటే వాటిని పూర్తయ్యేవరకూ పాటిస్తారు. డెడికేషన్, హార్డ్‌వర్క్ లేనిదే ఆ పనులు సాధ్యం కావు మరి. ఫలానా సమయంలో ఫలానా పని చేయాలనుకుంటారు కానీ ఇతర పనులవల్ల అది సాధ్యం కాకపోవచ్చు. అందుకని ముందు మీరు చేసే పనిని ఇష్టపడాలి. అప్పుడు మీరు ఎక్కడున్నా ఆ పని గురించే ఆలోచిస్తుంటారు. వెంటనే పూర్తిచేసేయాలి అనుకున్నా పొరపాటే! ఈ పనీ కాక వేరే పనులూ కాక మీమీద మీకే చిరాకు వస్తుంది. అందుకే చేసే పనిని ఇష్టపడాలి, వాటికి అలవాటుపడాలి అంటారు పెద్దవాళ్ళు.



మీలో మార్పు....

నిజానికి మనలో మార్పు రావాలంటే కొత్త సంవత్సరమే రానవసరం లేదు. లేదా కొత్త రిసొల్యూషన్ పెట్టుకుంటేనే మార్పు వచ్చేయదు. మనం మారటానికి ఫలానా రోజు రావాలి, ఫలానా టైం రావాలి అనుకున్నారంటే కచ్చితంగా అది జరిగే పనికాదు. మీరు ఏ పనిలో ఉన్నా అనుకున్న పనిని మధ్యలోనే ఆపకుండా పూర్తిచేయాలనే స్పృహ ఉండాలి. అలా ఉంటే ఇంక మీకు మీ పనుల గురించి ఎవరూ గుర్తు చేయాల్సిన అవసరమే ఉండదు. ఇక వచ్చే ఏడాదికి మళ్ళీ ఇదే రిసొల్యూషన్ రిపీట్ అవ్వకుండా ఉంటుంది. మరి ఇప్పుడు చెప్పండి మీ రిసొల్యూషన్ ఏంటీ...? ★

గూగుల్ నుండి కొత్త యాప్స్

గూగుల్ తల్లి ఎప్పటికప్పుడు తన యూజర్లను అవాక్కయ్యేలా చేస్తూనే ఉంటుంది. గూగుల్ వేలు పెట్టని యాపే లేదంటే అతిశయోక్తి కాదు. ఇప్పుడు కొత్తగా మరిన్ని యాప్స్‌ను మనముందుకు తీసుకొచ్చింది. అవే 'స్టోరీబోర్డ్', 'సెల్ఫీస్మో', 'స్క్రబ్బీస్' పేర్లు కొత్తగా ఉన్నాయి కదా. వాటి పనితీరు కూడా సరికొత్తగా ఉంటుంది. ఫొటోలతో ప్రయోగాలు చేసే ఔత్సాహికులకోసం గూగుల్ వారు విడుదల చేసిన సరికొత్త యాప్స్ ఇవి. ఈ మూడు యాప్లనూ విడుదల చేసినట్టు కొత్తగా ప్రారంభించిన 'యాప్స్‌పరిమెంట్స్' అనే ప్రోగ్రాం ద్వారా తెలియజేసింది గూగుల్.



'స్టోరీ బోర్డ్' ఈ పేరు వీడియో ఎడిటింగ్ చేసేవారికి కొత్తగా చెప్పక్కర్లేదు. కానీ ఈ యాప్‌లో మాత్రం వీడియోలను చిన్నపాటి కామిక్ స్టోరీల్లా మార్చేస్తుంది. ఒక వీడియోని ఆరు ఫ్రేమ్‌లలో ఫొటోలుగా మార్చేస్తుంది. ఈ యాప్‌ను కామిక్ బుక్స్, బుక్ ఆర్ట్స్‌ను, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పనిచేసే 'ప్రిస్మా' యాప్‌ను పోలినట్టు తయారు చేసారు. ఇప్పుడు ఈ తరహా యాప్సన్నీ ఔట్‌డెటెడ్ అయిపోయినా, వీడియోలను కూడా కామిక్‌లా మార్చేసే ఫీచర్ ఎటువంటి యాప్‌లోనూ లేదుకనుక ఈ యాప్ పాపులర్ అయ్యేందుకు అవకాశం ఉంది. ఈ యాప్ నుండే వీడియోలను రికార్డ్ చేసి కామిక్‌లా మార్చేసు కోవచ్చు. యాప్‌లో కొత్త లేఅవుట్స్ పొందటానికి యాప్‌ని ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకుంటే సరిపోతుంది. ఈ యాప్ నుండి ఇప్పటికే 1.6 ట్రిలియన్ల స్టోరీ బోర్డులు యూజర్లు తయారు చేసారని గూగుల్ తెలిపింది.



ఇక రెండో యాప్ 'సెల్ఫీస్మో', ఈ పేరులోనే ఉంది సెల్ఫీ అని, కానీ దీనికో లెక్కుంది. మనకి నచ్చినట్లు పోజ్ ఇస్తే చాలు బ్లాక్ అండ్ వైట్ లో సెల్ఫీలు తీసేస్తుంది. రకరకాల పోజులతో ఉన్న మీ ఫొటోలను ఒక షీట్‌లో కలిపేసి ఒకే ఫొటో చేసేస్తుంది. ఈ యాప్ ఐఓఎస్‌లో కూడా అందుబాటులో ఉంది.

'స్క్రబ్బీస్' ఇది వీడియోలకోసం తయారు చేసిన మూడో యాప్. వీడియోలను ముందుకూ వెనకకూ రివర్స్‌లో ప్లే చేయటానికి అంటే అచ్చంగా క్లబ్స్‌లో డిజేలు చేసే పనిలాంటిదన్నమాట. కాకపోతే వీడియోస్‌ని రీమిక్స్ చేస్తాం. అలానే ఈ వీడియోలను కూడా ఒకే వేలితో రీమిక్స్ చేసుకోవచ్చు. వాటిని అదే యాప్ నుండి సామాజిక మాధ్యమాల ద్వారా షేర్ చేసుకునే వీలు కూడా ఉంది. ఈ యాప్ ఇన్స్టాగ్రాం బూమరాంగ్ యాప్‌ను గుర్తు చేస్తుంది. కాకపోతే ఇందులో మనకి నచ్చినట్లు రీమిక్స్ చేసుకోవచ్చు. స్క్రబ్బీస్ ఇప్పుడు యాండ్రాయిడ్, ఐఓఎస్‌లలో అందుబాటులోకి వచ్చేసింది.



గూగుల్ నుండి ఈ మూడు యాప్సే కొత్తవి కాదు. గతేడాది 'మోషన్ స్కిల్స్' అనే యాప్‌ను విడుదల చేసింది. మొదట ఐఓఎస్‌లో అందుబాటులోకి వచ్చినా తరువాత ఆండ్రాయిడ్ లోనూ అందుబాటులోకి వచ్చింది. ఈ యాప్ చాలా కొత్తగా ఉంటుంది. ఇది జిఫ్‌లాంటి ఫొటోలను తీస్తుంది. అవే ఫొటోలు వీడియోలా రిపీట్ అవుతుంది. ఈ యాప్‌లానే ఈ మూడు యాప్స్‌లో కూడా చాలా ప్రయోగాలు చేసుకోవచ్చు. ప్రస్తుతం ఈ యాప్స్ అన్నీ ప్రయోగాల్లోనే ఉన్నా వీటిని యూజర్లకు అందుబాటులోకి తెచ్చేసింది గూగుల్. అయినా ఎప్పటికప్పుడు యాప్స్ కొత్త అప్డేట్స్‌తో ఆశ్చర్యపరుస్తుంది.

రైజ్ యువ[ర్] వాయిస్



వ్యవస్థలో మార్పు రావాలి అనే ఆశయంతో యువత నుంచి వచ్చే అభిప్రాయాలను ప్రజల వద్దకు చేర్చే ప్రత్యేక కాలమ్ రైజ్ యువ(ర్) వాయిస్. మీ వాయిస్ పంపవలసినది : జోష్, ప్రజాశక్తి దినపత్రిక, హౌస్ నెం: 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-2 లేదా joshprajasakti@gmail.com కు మెయిల్ పంపగలరు.

పిల్లల్లారా.. రారండి!!



హాయ్ పిల్లలూ!
మీలో చాలా టాలెంట్ ఉంది కదూ! మీకు పాటలొచ్చు. బొమ్మలొచ్చు, బోల్డన్ని ఆటలొచ్చు. మేజిక్కులొచ్చు. అలాగే కథలూ రాస్తారు కదూ?!. మాకెలా తెలుసంటారా? అసలు పిల్లలంటేనే.. క్రియేటివ్ కిడ్స్‌కదా?! చక్కగా చదువుకుంటూనే ఆటలు, పాటలతో మీరంతా అదరగొట్టేస్తారని మాకు తెలుసు. అందుకే మీరు వేసిన బొమ్మలు, కార్టూన్లు, రాసిన బుల్లిబుల్లికథలు వేసిన నాటకాలు ఇంకా మీరు కనిపెట్టిన సైన్స్ సంగతులు, మీరు చూసొచ్చిన కొత్త ప్రదేశాలగురించి చిన్నారి పేజీలో పంచుకోండి. వాటిని మీపేరుతో, మీ ఫొటోతో ప్రచురిస్తాం. నిజమా?! అని ఆశ్చర్యంపోకండి. నిజమే. అందుకే మీలోదాగి ఉన్న ఏ టాలెంట్ గురించి అయినా మాకు రాసి పంపండి. ఇంకెందుకు ఆలస్యం...
పెన్ను, పెన్సిల్, బ్రష్‌తో రెడీ అయిపోండి.


చిరునామా

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com

చిన్నారి



కనిపెట్టండి!



పిల్లలూ..! పక్కనున్న బొమ్మలో కొంతమంది పిల్లలు వారి నీడలు ఉన్నాయి... వాటిలో ఏ నీడ ఎవరిదో కనిపెట్టండి!

పొడుపు కథ

ఎత్తయిన జంతువును..
దాహమేసినా ఉండగలను..
ఇసుకలో వేగంగా పోతాను
నేనెవరు..?

జోక్ :

రాము : అన్ని కరెన్సీ నోట్ల మీద గాంధీతాత నవ్వుతూ ఉంటాడు ఎందుకురా పండు..?
పండు : ఏడిస్తే నోటు తడిచిపోతుందని..!

ఆపదలో ఆదుకునే పారాచూట్!

పిల్లలూ..! మీరెప్పుడైనా పారాచూట్‌ను చూశారా? చూసే ఉంటారు. చాలా సినిమాల్లో ఆపద సమయంలో ఎత్తయిన ప్రదేశాల నుంచి, విమానాల నుంచి పారాచూట్ సాయంతో నేలమీదకు మనుషులు సురక్షితంగా దిగుతున్నట్లు చూపుతుంటారు. ఇది నిజం. పారాచూట్ సాధారణంగా గొడుగు వంటి ఆకారం కలిగిన పరికరం. ఈ పారాచూట్ పదం ఫ్రెంచ్




పదాలైన పారర్, చూటీ పదాల నుంచి వచ్చింది. పారర్ అంటే అర్థం రక్షించడం. చూటీ అంటే అర్థం సురక్షితంగా, జాగ్రత్తగా పై నుంచి కిందికి జారడం అని. దీని సృష్టికర్త లియోనార్డో డావిన్సీ. ఒక రోజున మానవులు ఆకాశంలోకి ఎగరగలరని నమ్మాడు. అందుకే దీనిని కనుగొన్నాడు. పారాచూట్‌ను తేలికైన, గట్టిగా ఉన్న వస్త్రంతో తయారుచేస్తారు. ఆ వస్త్రం వాస్తవానికి సిల్కుతో తయారుచేయబడినా, ప్రస్తుతం నైలాన్ను వాడుతున్నారు. పరిస్థితులను బట్టి పారాచూట్‌ను ప్రజలు ఆహారం, పరికరాలు, స్పేస్ క్యాప్సుల్లు, బాంబులు వంటి వివిధ వస్తువులను పై నుంచి నెమ్మదిగా కిందికి దించటానికి వాడతారు. అలాగే ప్రకృతి వైపరీత్యాలు జరిగిన చోట వీటిద్వారా ప్రజలకు ఆహారాన్ని అందిస్తారు. ★





నేను గీసిన బొమ్మ



ఎమ్. కౌశిక్,
ఏడవ తరగతి,
అరవింద హైస్కూల్స్.

పాండ్యా ఒక్కడే..

అద్భుత ఇన్నింగ్స్


హార్దిక్ పాండ్యా 93 పరుగులు

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ -286 ఆలౌట్

భారత్ తొలి ఇన్నింగ్స్ - 209 ఆలౌట్

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ -65/2

కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్న భారత జట్టును ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఊపిరి ఊదాడు. కేవలం 95 బంతుల్లో 14 ఫోర్లు, ఒక సిక్సర్ సాయంతో 93 పరుగులు చేసి జట్టు గౌరవప్రదమైన స్కోర్‌కు సాధనకు సహకరించాడు. అర్ధసెంచరీని కేవలం 46 బంతుల్లోనే 10 ఫోర్ల సాయంతో చేశాడు. జట్టు స్కోర్ 92 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న దశలో గౌరవప్రదమైన స్కోర్ సాధించేందుకు తనవంతు కృషి చేశాడు. ఈ నేపథ్యంలో టెస్ట్ కెరీర్‌లో రెండో అర్ధశతకాన్ని నమోదు చేసి సెంచరీకి ఏడు పరుగుల దూరంలో రబడా బౌలింగ్ లో కీపర్ డికాక్‌కి క్యాచ్ ఇచ్చి తొమ్మిదో వికెట్‌గా పెవిలియన్ చేరాడు.

కేప్‌టౌన్ : భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరుగుతున్న తొలి టెస్ట్ రెండోరోజు భారత్ 209 పరుగులకు ముగించింది. దీంతో దక్షిణాఫ్రికా జట్టుకు 77 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 65 పరుగులకు రెండు వికెట్లు కోల్పోయింది. రెండోరోజు ఆట నిలిపివేసే సమయానికి రబాడా 2, ఆమ్లా 4 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. మక్రామ్ 34, ఎల్గర్ 25 పరుగులు చేసిన పాండ్యా బౌలింగ్‌లో అవుటయ్యారు. ఆ జట్టుకు ఇప్పటికి 142 పరుగుల ఆధిక్యత ఇప్పటికే లభించింది. బౌలర్లకు స్వర్గధామంగా ఉన్న కేప్‌టౌన్ మైదానంలో తొలిరోజు 13 వికెట్లు నేలకూలగా... రెండోరోజు 9 వికెట్లు పడ్డాయి. తొలి, రెండోరోజు కూడా దక్షిణాఫ్రికా జట్టు భారత్‌పై ఆధిక్యతను ప్రదర్శించింది. రెండు రోజుల్లోనే ఇరుజట్లు మొదటి ఇన్నింగ్స్‌ను ముగించడంతో మిగతా మూడు రోజుల్లో ఫలితం రావడం ఖాయం.

భారతజట్టు 92 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్న తరుణం హార్దిక్ పాండ్యా ఆదుకున్నాడు. వన్డే తరహాలో బ్యాటింగ్ చేసి 95 బంతుల్లో 93 పరుగులు చేసి టీమిండియా గౌరవప్రదమైన స్కోర్ సాధనకు తోడ్పడ్డాడు.

శనివారం ఉదయం భోజన విరామం అనంతరం తొలి బంతికే పుజారా 26 (92 బంతుల్లో 5 ఫోర్లు) పరుగులు చేసి ఔటయ్యాడు. క్రీజులో బాగానే కుదురుకున్న తరుణంలో ఫిలాండర్ వేసిన 36.1వ బంతికి డుప్లెసిస్‌కు క్యాచ్ ఇచ్చాడు. ఉదయం సెషన్‌లో టీమిండియా వెంటవెంటనే రెండు వికెట్లు చేజార్చుకుంది. పుజారాతో కలిసి బ్యాటింగ్ ప్రారంభించిన రోహిత్ శర్మ కేవలం 11 పరుగులు మాత్రమే చేసి రబాడా బౌలింగ్‌లో ఎల్‌బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. భోజన విరామం తర్వాత మ్యాచ్ అనూహ్య మలుపు తిరిగింది. ఆ తర్వాత ఫిలాండరే రవిచంద్రన్ అశ్విన్ (12)ను ఔట్ చేయడం గమనార్హం. టీమిండియా స్కోర్ 81 పరుగుల వద్ద 38.5వ బంతికి అశ్విన్ దక్షిణాఫ్రికా వికెట్ కీపర్ డి కాక్‌కు చిక్కాడు. తన నుంచి దూరంగా వెళ్తున్న బంతిని డికాక్ అద్భుతంగా డైవ్ చేసి క్యాచ్ అందుకున్నాడు. 40 ఓవర్లు ముగిసే సరికి టీమిండియా ఆరు వికెట్ల నష్టానికి 87 పరుగులు చేసింది. అనంతరం టీమిండియా వికెట్ కీపర్ వృద్ధిమాన్ సాహా డక్కౌట్ అవ్వడంతో భారతజట్టు కేవలం 92 పరుగులకే కీలకమైన ఏడు వికెట్లను కోల్పోయింది. కోహ్లీసేన 150 పరుగులు చేయడం కష్టమనుకున్న దశలో హార్దిక్ పాండ్యా మెరిశాడు. పాండ్యా 93 (95 బంతుల్లో ఒక సిక్స్ 14 ఫోర్లు) సాయంతో జట్టు స్కోర్‌ను 200లకు చేర్చాడు. టీ విరామ సమయానికి పాండ్యా 81 పరుగులతో, భువనేశ్వర్ కుమార్ 24 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు.

విరామం అనంతరం 25 పరుగుల వ్యక్తిగత స్కోర్‌వద్ద భువనేశ్వర్ కుమార్ మోర్కెల్ బౌలింగ్‌లో డికాక్‌కు క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. దీంతో భారత జట్టు 191 పరుగులవద్ద ఎనిమిదో వికెట్ కోల్పోయింది. వీరిద్దరి భాగస్వామ్యం 99 పరుగులు. మరో ఎనిమిది పరుగులు జోడించిన అనంతరం పాండ్యా 93 పరుగులు చేసిన అనంతరం రబాడా బౌలింగ్‌లో డికాక్‌కు క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. బుమ్రా చివరి వికెట్ రూపంలో 209 జట్టు స్కోర్ వద్ద కోల్పోవడంతో భారత జట్టు తొలి ఇన్నింగ్స్‌ను ముగించింది. ఫిలాండర్, రబాడాలకు మూడేసి వికెట్లు, డెల్ స్టెయిన్, మోర్కెల్‌కు రెండేసి వికెట్లు చొప్పున లభించాయి.



చెమటోడ్చి నెగ్గిన చెన్నై స్మాషర్స్

ప్రిమియర్ బ్యాడ్మింటన్ లీగ్

చెన్నై : ప్రిమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పిబిఎల్)లో చెన్నై చెమటోడ్చి నెగ్గింది. శనివారం అహ్మదాబాద్ స్మాష్ మాస్టర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు చివరివరకూ పోరాడి 2-1 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. పురుషుల డబుల్స్ తొలి మ్యాచ్‌ను చెన్నై స్మాషర్స్ 13-15, 12-15 సెట్ల తేడాతో ఓడింది. దీంతో అహ్మదాబాద్ స్మాషర్స్‌కు 1-0 ఆధిక్యత లభించింది. రెండో మ్యాచ్ మహిళల సింగిల్స్‌లో పి.వి. సింధూ (చెన్నై) 15-11, 10-15, 15-12తో టి.టి.హింగ్ (అహ్మదాబాద్)పై గెలిచి 1-1తో స్కోర్ సమం చేసింది. పురుషుల సింగిల్స్ ట్రంప్ మ్యాచ్‌లో చెన్నై 15-12, 14-15, 12-15తో సమీర్‌వర్మ (అహ్మదాబాద్) గెలిచాడు. దీంతో అహ్మదాబాద్‌కు 0-2 ఆధిక్యత లభించింది. పురుషుల సింగిల్స్ నాల్గో మ్యాచ్‌ను అహ్మదాబాద్ ట్రంప్ మ్యాచ్‌గా తీసుకుంది. ఈ మ్యాచ్‌లో ప్రణయ్ రాయ్ 15-10. 12-15, 15-14 సెట్ల తేడాతో చెన్నై షట్లర్ చేతిలో ఓటమి పాలయ్యాడు. దీంతో ఇరుజట్లకు నాలుగు మ్యాచ్‌లు పూర్తయ్యే సరికి 1-1 పాయింట్లతో సమంగా నిలిచాయి. ఐదో మ్యాచ్‌లో మిక్సిడ్ డబుల్స్ పివి సింధూ/బిఎస్ రెడ్డిల జోడీ 15-14, 15-13తో అహ్మదాబాద్ జోడీపై గెలిచి 2-1తో మ్యాచ్‌ను సొంతం చేసుకుంది.

చెన్నై సూపర్ కింగ్స్ బ్యాటింగ్ కోచ్‌గా మైక్ హస్సీ



చెన్నై : 2018 ఐపిఎల్ సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌కు బ్యాటింగ్ కోచ్‌గా ఆస్ట్రేలియాకు చెందిన మైక్ హస్సీ ఎన్నికయ్యాడు. ఐపిఎల్ టోర్నీల్లో సైతం అతనున చెన్నై జట్టులో ఆటగాడిగా కొనసాగాడు. అతని ఆధ్వర్యంలో రెండుసార్లు ఐపిఎల్ టోర్నీలో చెన్నై జట్టు సాధించింది. చెన్నై జట్టుకు అతడు ఏడుసార్లు సభ్యుడిగా కొనసాగాడు.



నడవలేని స్థితిలో జయసూర్య

కొలంబో : శ్రీలంక స్టార్ క్రికెటర్, మాజీ కెప్టెన్ జయసూర్య పరిస్థితి దీనంగా ఉంది. అంతర్జాతీయ క్రికెట్ లో బౌలర్లకు చుక్కలు చూపించి బ్యాటింగ్‌తో అదరగొట్టే జయసూర్య ప్రస్తుతం నడవలేని పరిస్థితికి చేరుకున్నాడు. స్ట్రెచర్స్‌లేనిదే అడుగులు ముందుకు వేయని పరిస్థితికి చేరుకున్నాడు. ఎడమచేతి వాటంతో ఆడే సూర్య క్రీజులోకి దిగితే బౌలర్లు భయపడతారు. మోకాలి సమస్య నుంచి బయటపడేందుకు త్వరలోనే ఆస్ట్రేలియా లోని మెల్‌బోర్న్‌లో మోకాలికి శస్త్రచికిత్స కోసం వెళ్లనున్నాడని తెలిసింది. క్రికెట్‌కు వీడ్కోలు పలికిన అనంతరం జయసూర్య శ్రీలంక క్రికెట్ బోర్డుకు రెండుసార్లు సెలెక్షన్ కమిటీ ఛైర్మన్‌గా కూడా పని చేశాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఎన్నో రికార్డులను తన పేరున లిఖించుకున్న జయసూర్య 1996లో శ్రీలంక వరల్డ్ కప్ గెలవడంలో కీలక పాత్ర పోషించాడు.

కివీస్ ఘన విజయం

పాకిస్తాన్‌తో వన్డే సిరిస్


విలియమ్సన్ 115 పరుగులు

వెల్లింగ్టన్ : పాకిస్తాన్- న్యూజిలాండ్ జట్ల మధ్య ఇక్కడ జరిగిన తొలి వన్డేలో న్యూజిలాండ్ 66 పరుగులతో ఘన విజయం సాధించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 315 భారీ స్కోర్ సాధించింది. ఆ జట్టు సారథి విలియమ్సన్ 115, నికొలస్ (50), మాన్రో (58) పరుగులతో ఆ జట్టు అత్యధిక స్కోర్ సాధనకు తోడ్పడ్డారు. పాకిస్తాన్ బౌలర్ హసన్ ఆలీకి 3 వికెట్లు లభించాయి. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ జట్టు 30 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 166 పరుగులు చేసిన దశలో వర్షం కారణంగా మ్యాచ్ నిలిచిపోయింది.దీంతో డక్ వర్త్ లూయిస్ ప్రకారం పాకిస్తాన్ 228 పరుగులు చేయాల్సి ఉన్న తరుణంలో పాక్ కేవలం 166 పరుగులు చేయడంతో కివీస్ గెలుపొందినట్లు అంపైర్లు ప్రకటించారు. పాక్ ఓపెనర్ ఫఖర్ జమాన్ 82 పరుగులతో అజేయంగా నిలిచాడు. మూడు వన్డేల సిరీస్‌లో 1-0 ఆధిక్యతను కివీస్ సాధించగా... మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ విలియమ్సన్‌కు లభించింది.

భారీస్కోర్ దిశగా ఆసీస్



సిడ్నీ : ఆస్ట్రేలియా -ఇంగ్లండ్ జట్ల మధ్య జరుగుతున్న యాషెస్ సిరిస్‌లో ఆసీస్ జట్టు పట్టు బిగించింది. శనివారం మూడోరోజు ఆట ముగిసే సమయానికి 4 వికెట్ల నష్టానికి 479 పరుగుల భారీ స్కోర్ సాధించింది. దీంతో ఆ జట్టుకు ఇప్పటికే 133 పరుగుల ఆధిక్యత లభించింది. ఓవర్‌నైట్ బ్యాట్స్‌మన్ ఖ్వాజా 177 పరుగులు చేసి క్రేన్ బౌలింగ్‌లో వికెట్ కీపర్ బారిస్ట్రోకు క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. జట్టు సారథి స్టీవ్ స్మిత్ 83 పరుగులు చేసి మొయిన్ ఆలీకి కాట్ అండ్ బౌల్డ్ రూపంలో పెవిలియన్‌కు చేరాడు. ఇంగ్లండ్ జట్టు బౌలర్లు మూడోరోజు ఆటలో కేవలం రెండు వికెట్లు మాత్రమే సాధించగలిగారు. మ్యాచ్ నిలిపివేసే సమయానికి షాన్ మార్ష్ 98, మిచెల్ మార్ష్ 63 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. ఇప్పటికే 3-0తో ఆస్ట్రేలియా యాషెస్ సిరిస్ గెలుచుకుంది.


పూనేలో శనివారం జరిగిన టాటా ఓపెన్ టైటిల్‌ను ఫ్రాన్స్‌కు చెందిన గిల్లెస్ సిమెన్ 7-6, 6-2తో న్యూజిలాండ్‌కు చెందిన కెవిన్ అండర్సన్ (రెండోర్యాంక్)ను ఓడించి విజేతగా నిలిచాడు.


న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో 'ఖేలో ఇండియా' లోగోను ఆవిష్కరిస్తున్న కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా శాఖ సహాయ మంత్రి కల్నల్ రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68